
'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5

సంపుటి: 10 సంచిక: 339

గురువారం 1-3-2018



ఫెడరర్ 'డబుల్'...

స్విస్ టెన్నిస్ దిగ్గజం ఖాతాలో రెండు 'లారెస్ స్పోర్ట్స్' పురస్కారాలు –స్పోర్ట్స్‌లో



డిపాజిట్ రేట్లు పెంచిన ఎస్‌బీఐ

0.75% దాకా వడ్డీ రేటు పెంపు. రుణాల పైనా వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలు - 12లో



అభిమాన లోకం..

ముంబైలోని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ నుంచి మొదలైన శ్రీదేవి అంతిమయాత్రకు భారీగా హాజరైన అభిమానులు

కన్నీటి శోకం



శ్రీదేవి భౌతికకాయం

అశ్రునయనాల మధ్య శ్రీదేవి అంత్యక్రియలు

సినీలోకం మూగబోయింది. అభిమానం అశ్రుధారలైంది. గుండెగొంతులో గూడు కట్టుకున్న దుఃఖం కట్టలు తెగింది. ముంబై దారులన్నీ కన్నీటి వరదలయ్యాయి! లక్షలాది అభిమానులు వెంటరాగా దేవకన్య శ్రీదేవి దివికేగింది. బుధవారం సాయంత్రం ముంబై విలేపార్లేలోని శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం శ్రీదేవి అంత్యక్రియలు పూర్తయ్యాయి. భర్త బోనీకపూర్ చితికి నిప్పంటించారు. 5 లో

అనారోగ్యంతో కన్నుమూసిన కంచి పీఠాధిపతి స్వామి జయేంద్ర సరస్వతి

కంచి స్వామి శివైక్యం



- తీవ్ర దిగ్భ్రాంతికి గురైన శిష్యబృందం, భక్త కోటి
- భక్తుల సందర్శన కోసం మఠంలో స్వామీజీ పార్థివదేహం
- నేటి ఉదయం పూజాదికాలు.. 'అధిష్టాన' కార్యక్రమం
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రుల సంతాపం

కాంచీపురం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం పొందారు. ఆయన వయసు 82 సంవత్సరాలు. కాంచీపురంలోని ఓ ఆస్పత్రిలో బుధవారం ఉదయం 9 గంటలకు జయేంద్ర తుదిశ్వాస విడిచారు. ఆయన కొద్ది నెలలుగా శ్వాస సంబంధ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. బుధవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందనడంతో మఠం నిర్వాహకులు ఉదయం 7.30 గంటలకు శంకర మఠానికి అనుబంధంగా ఉన్న ఆది భగవత్పాద కార్డియాక్ అండ్ డయాలసిస్ (ఏబీసీడీ) ఆస్పత్రికి స్వామీజీని తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం చికిత్స ప్రారంభించిన వైద్యులు 8.30 గంటలకు పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. స్వామీజీ తుదిశ్వాస విడిచినట్లు ఉదయం 9 గంటలకు ప్రకటించారు. దీంతో దేశ, విదేశాల్లో ఉన్న స్వామీజీ శిష్యులు, భక్తులు, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయారు. స్వామీజీ శివైక్యం విషయం తెలుసుకున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చారు. స్వామీజీ నేతృత్వంలో సాగిన ఆధ్యాత్మిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను కొనియాడారు.

నేడు శాస్త్రబద్ధంగా 'అధిష్టాన' కార్యక్రమం

స్వామీజీ శివైక్యం గురించిన వార్త విన్నంతనే ఆయన శిష్యులు, భక్తజనావళి హుటాహుటిన కంచి మఠానికి తండోప తండాలుగా తరలి వచ్చారు. భక్తుల సందర్శనార్థం స్వామీజీ పార్థివ దేహాన్ని ఆయన మండపంలోనే ఉంచారు. అక్కడి ఏర్పాట్లను మఠం మేనేజర్ సుందరేష్ అయ్యర్, బాల పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ప్రభృతులు పర్యవేక్షిస్తున్నారు. గురువారం ఉదయం వేద ఘోష, విష్ణుపారాయణ, అధిష్టాన పూజ, అభిషేకాల ప్రక్రియ ముగిశాక 'అధిష్టానం' (సమాధి) కార్యక్రమం ఉంటుందని

మిగతా 10వ పేజీలో ▶

70వ పీఠాధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతి 10 లో

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం 16 లో



కార్తీ చిదంబరం అరెస్టు



- చెన్నై విమానాశ్రయంలోనే అరెస్టు చేసిన సీబీఐ
- ఒక్క రోజు సీబీఐ కస్టడీకి అప్పగించిన ఢిల్లీ కోర్టు
- ఒక మిలియన్ డాలర్ల ముడుపుల ఆరోపణలపై విచారించనున్న సీబీఐ
- రాజకీయ కక్షతోనే ఈ వేధింపులన్న కాంగ్రెస్ - 6లో

గుడికి జీఎస్టీ గుబులు



- ఆర్జిత సేవలు, ప్రసాదాలపై 18 శాతం పన్ను
- కట్టలేమని మొత్తుకుంటున్న ఆలయాలు
- ధరల పెంపుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- లడ్డూ, పులిహోర ధరలకు రెక్కలు
- దేవుడి సాక్షిగా భక్తుల జేబుకు కన్నం - 16లో

అర చేతిలో పౌర సేవలు!



- ఇక రాష్ట్రంలోనూ మొబైల్ గవర్నెన్స్
- 'టీ–యాప్ ఫోలియో' ఆవిష్కరణలో కేటీఆర్
- దేశంలో కర్ణాటక తర్వాత రెండో రాష్ట్రంగా తెలంగాణ
- తొలుత 150 సేవలు.. ఏడాదిలో 1,000కి పెంపు

- వివరాలు 16లో

కుంటాల అందాలకు కుప్టి జలాలు



కడెం నదిపై కుప్టి వద్ద రిజర్వాయర్ నిర్మాణం

- 5.32 టీఎంసీల సామర్థ్యం.. రూ.744 కోట్ల ఖర్చు
- కడెం ప్రాజెక్టు ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం
- అవసరమైనపుడు కుంటాల జలపాతానికీ నీరు
- సీఎం ఆదేశాలతో శరవేగంగా కదులుతున్న ఫైలు

16 లో

ఫ్యామిలీలో...

చాక్లెట్ రేప్..ర్

చాక్లెట్‌ని రంగుల కాగితంలో.. అదే, రేపర్‌లో చుడతారు. ఆ రంగుల రేపర్‌లో ఒక దరిద్రుడు తన వాంఛను చుట్టి పిల్లల్ని ట్రాప్ చేస్తే.. బాల్యాన్ని నలిపేస్తే.. ఒళ్లంతా పుండ్లు వచ్చేస్తాయి! జీవితంలో ఎప్పటికీ మానని గాయాలుగా అవి మిగిలిపోతాయి.

సాక్షి వెబ్‌సైట్‌లో.. (w

ఏ పనిలోనైనా విజయం సాధించాలంటే ఏకాగ్రత, నిబద్ధత అవసరం.. అందుకు ఏకైక మార్గం ఆధ్యాత్మికత. తమ ప్రవచనాలు, ప్రసంగాల ద్వారా జ్ఞానమార్గాన్ని బోధిస్తున్న సాధ్వీమణులను స్మరించుకుందాం.. 'సాధ్వీమణులకు వందనం'..

జానా బాబా 40 దొంగలు

బస్సు యాత్ర చేస్తున్న కాంగ్రెస్ నేతలందరిపై కేసులున్నాయి : కేటీఆర్

- ఒకరు ఓటుకు నోట్లిస్తూ.. మరొకరు కోదాడ ఎన్నికల్లో దొరికారు
- 15ఏళ్లు మంత్రిగా ఉన్న జానారెడ్డి ఉమ్మడి నల్లగొండకు ఏం చేశారు
- తుంగతుర్తి ప్రగతిసభలో ధ్వజం





బుధవారం సూర్యాపేట జిల్లా మద్దిరాలలో బహిరంగ సభకు హాజరైన ప్రజలు

సాక్షి ప్రతినిధి, సూర్యాపేట: 'ఆలీబాబా 40 దొంగలు అన్నట్లు జానాబాబా 40 దొంగలుగా కాంగ్రెస్ నేతలు సిగ్గు, ఎగ్గు లేకుండా బస్సు యాత్ర చేస్తున్నారు. యాత్ర చేస్తున్న వారందరిపై కేసులున్నాయి.' అని ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా పర్యటనలో భాగంగా నూతనకల్ మండలం చిల్పకుంట్లలో రూ.143 కోట్లతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభోత్సవం చేసి 175 గ్రామాలకు మంచి నీటిని విడుదల చేశారు. అనంతరం తుంగతుర్తిలోని మద్దిరాల క్రాస్‌రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల్లో ఒకరు ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికితే, ఇంకొకరు ఎన్నికల సమయంలో కోదాడలో రూ.3 కోట్లతో దొరికిపోయారని, మరికొంత మంది సీబీఐ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని మంత్రి ఎద్దేవా చేశారు.

ఒక్కరూ నోరు మెదపలేదు..

55 ఏళ్లుగా కాంగ్రెస్ .. దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిందని, ఇన్నాళ్లలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వారు ఏం చేశారని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి, కృష్ణా జలాలు వస్తే ఫ్లోరోసిస్ వ్యాధితో 2లక్షల మంది చితికిపోయేవారా అని ప్రశ్నించారు. 15 ఏళ్ల మంత్రిగా ఉన్న జానారెడ్డి దేవరకొండ, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో ఫ్లోరోసిస్‌తో ప్రజలు పడుతున్న బాధలు గుర్తుకురాలేదా, నాటి సీఎంల వద్ద జానా, ఉత్తమ్‌లు ఎందుకు యుద్ధం చేయలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఫ్లోరోసిస్‌పై ఏ ఒక్కరైనా శాసన సభలో నోరు మెదపలేదని విమర్శించారు. నిండు శాసనసభలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ జిల్లాలకు నిధులు ఇవ్వనని అసెంబ్లీలో చెప్పినా ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు మాట్లాడలేదని మండిపడ్డారు. ఒక చిత్తూరు జిల్లాకే తాగునీటి అవసరాల కోసం రూ.9 వేల కోట్ల రూపాయలు తన్నుకుపోతుంటే ఈ కాంగ్రెస్ నాయకులు నిలదీయలేదని విమర్శించారు. 45 ఏళ్ల క్రితం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ శ్రీరాం సాగర్‌కు శంకుస్థాపన చేస్తే ఇప్పటి వరకు ఆ కాలువల్లో నీరెందుకు రాలేదని ప్రశ్నించారు. శ్రీరాంసాగర్ జలాలతో నియోజక వర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరందించేందుకు రెండు(వెంపటి, రుద్రమదేవి చెరువులు) రిజర్వాయర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని కేటీఆర్ తెలిపారు. అలాగే తుంగతుర్తిలో యువతకు ఉపాధి కల్పించేలా ఇక్కడికి పెద్ద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసే బాధ్యత తనదే అని హామీ ఇచ్చారు. విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన ఈ 36 నెలల కాలంలో రూ.30వేల కోట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వచ్చాయని, ఈ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సభలో భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ హోలీ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: తెలుగు ప్రజలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ దేశ సమగ్రతకు చిహ్నమని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆనందంగా జరుపుకోవాలి: సీఎం



సాక్షి, హైదరాబాద్: హోలీ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పండుగను ఆనందంగా జరుపుకోవాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

వారిపై కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

సాక్షి, హైదరాబాద్: ఎంపీలు, ఎమ్మెల్యేలపై నమోదైన క్రిమినల్ కేసులను విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసింది. సెషన్స్ కోర్టు స్థాయిలో ఈ ప్రత్యేక కోర్టును హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తూ న్యాయశాఖ కార్యదర్శి వి.నిరంజన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు కొత్త గిరిజన క్రీడా గురుకులాలు

సాక్షి, హైదరాబాద్: గిరిజన విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపేందుకు గిరిజన సంక్షేమ శాఖ క్రీడా గురుకులాలను అందుబాటులోకి తెస్తోంది. కొత్తగా రెండు క్రీడా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలో కిన్నెరసాని క్రీడా గురుకుల పాఠశాల అందుబాటులో ఉంది. ఉట్నూరు, కొత్తగా ఆదిలాబాద్ జిల్లా బోథ్, ఏటూరునాగరంలో రెండు క్రీడా గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తేవాలని గిరిజన సంక్షేమ శాఖ నిర్ణయించింది.

FORM IV
(See Rule 8)

Statement about ownership and other particulars about newspaper ***SAKSHI***

1. Place of Publication	:	**NALGONDA**
2. Periodicity of its publication	:	DAILY
3. Printer's Name	:	**K. RAMACHANDRA MURTHY**
Nationality	:	INDIAN
Address	:	**Jagati Publications Limited** 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
4. Publisher's Name	:	**K. RAMACHANDRA MURTHY**
Nationality	:	INDIAN
Address	:	**Jagati Publications Limited** 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
5. Editor's Name	:	**V. MURALI**
Nationality	:	INDIAN
Address	:	Flat No. 301, Rajya Lakshmi Residency, Padma Colony, Nallakunta, Hyderabad - 500 044.
6. Name & Addresses of Individuals who own the Newspaper and shareholders holding more than one percent of the total capital.	:	**1. M/s. Jagati Publications Limited,** 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
		2. M/s.Carmel Asia Holdings Pvt Ltd., No. 56B/34, 1st Main, Vyalikaval Lower Palace Orchards, Bangalore -560 003.
		3. M/s.Gilchrist Investments Pvt Ltd, # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
		4. M/s. Alpha Avenues Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
		5. M/s. Alpha Villas Pvt Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
		6. M/s. India Cements Ltd. # 827, Annasalai, Dhun Building, IVth Floor, Chennai - 600 002
		7. M/s. P.R. Energy Holdings Limited Lakshmi Nivas, Plot. No. 705, Road. No.3, Banjara Hills, Hyderabad-500 034
		8. M/s. PVP Business Ventures Pvt. Ltd. # 46, Avenue 4, Street No.1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034
		9. M/s. PVP Business Towers Pvt Ltd., 8-2-609/K, Avenue 4, Street No. 1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034.
		10. M/s.R.R. Global Enterprises Pvt. Ltd. 8-2-120/86/5, Third Floor, Sneha House, Road No. 3, Banjara Hills, Hyderabad - 500 034.
		11. M/s. Sentia Developers Ltd. 1A-Hamilton House, 1st Floor, Connaught Place, New Delhi - 110 001.
		12. M/s.Avant Garde Fashion Wear Pvt. Ltd, 54/3, Ejipura Main Road, Vivek Nagar, Bangalore - 560 047.
		13. M/s. Beta Avenues Pvt. Ltd., # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003.
		14. M/s. IA and IC Pvt. Ltd., 16, Gundecha Chambers, Nagindas Master Road, Fort, Mumbai - 400 023.

I, K. RAMACHANDRA MURTHY hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 28-02-2018

Sd/-
(K. RAMACHANDRA MURTHY)
Publisher

మోదీకి కేసీఆర్ చెంచాగిరీ!

- ప్రధాని పేరు చెబితేనే సీఎం గజగజలాడుతున్నారు: ఉత్తమ్
- విభజన హామీల కోసం కొట్లాడకుండా కేంద్రాన్ని సమర్థిస్తున్నారు
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం
- లేకుంటే కుటుంబంతో సహా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- 106 సీట్లు గెలవకుంటే సీఎం తప్పుకుంటారా అని సవాల్
- సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ బస్సు యాత్ర



జహీరాబాద్ సభలో మాట్లాడుతున్న ఉత్తమ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి, జహీరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి కేసీఆర్ చెంచాగిరీ చేస్తున్నారని.. ఆయన పేరు చెబితేనే గజగజలాడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పొరుగు రాష్ట్రంలో విభజన హామీల కోసం అక్కడి ఎంపీలు కొట్లాడుతుంటే.. ఇక్కడ కేసీఆర్ మాత్రం నోట్ల రద్దు, జీఎస్టీలను సమర్థిస్తున్నారని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య బస్సు యాత్ర బుధవారం సంగారెడ్డి జిల్లాలో సాగింది. ఈ సందర్భంగా జహీరాబాద్, నారాయణఖేడ్‌లలో జరిగిన బహిరంగసభల్లో ఉత్తమ్ ప్రసంగించారు. ''మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మైనారిటీలను ఇబ్బందులకు గురిచేస్తోంది. మైనారిటీలపై వేధింపులు పెరిగాయి. అలాంటి మోదీకి సీఎం కేసీఆర్ చెంచాగిరీ చేస్తున్నారు. ఆయన పేరు చెబితేనే గజగజలాడుతున్నారు. పొరుగు రాష్ట్రంలో ఎంపీలు విభజన హామీల అమలు కోసం కొట్లాడుతుంటే.. ఇక్కడ కేసీఆర్ మాత్రం నోట్లరద్దు, జీఎస్టీ తదితరాలను సమర్థిస్తున్నారు..'' అని మండిపడ్డారు. టీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మోదీకి ఓటు వేసినట్లేనని.. మైనారిటీల హక్కుల రక్షణ, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు.

కేసీఆర్‌ను ప్రజలే తరిమికొడతారు

రూ.500 కోట్లతో అధునాతన భవనం కట్టుకుని.. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు అత్యంత విలాస జీవితం అనుభవిస్తున్నారని ఉత్తమ్ ఆరోపించారు. నాలుగేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి రాగానే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, మహిళా సంఘాలకు రూ.లక్ష రివాల్వింగ్ ఫండ్, అభయ హస్తం పింఛన్ పునరుద్ధరణ, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి వంటివి అమలు చేస్తామని.. పంటలకు మద్దతు ధర అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

106 సీట్లు రాకుంటే కేసీఆర్ తప్పకుంటారా..

''వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పక్షంలో నేను నా కుటుంబంతో సహా రాజకీయాల నుంచి వైదొలుగుతా. 106 అసెంబ్లీ స్థానాల్లో గెలవకుంటే కేసీఆర్ రాజకీయాల నుంచి తప్పుకుంటారా..'' అని ఉత్తమ్ సవాల్ విసిరారు. తాము అధికారంలోకి వచ్చాక 2019–20లో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్ రూ.1.90 లక్షల కోట్ల మేర ఉంటుందన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల్లో సీఎం ఆరు శాతం కమీషన్ తీసుకుంటున్నారని.. తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టులపై పునఃసమీక్ష జరుపుతామని పేర్కొన్నారు.

అధిష్టానం ఆదేశిస్తే కేసీఆర్‌పై పోటీ: కోమటిరెడ్డి

అధిష్టానం ఆదేశిస్తే వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌పై పోటీ చేసి ఓడిస్తానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. జహీరాబాద్ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సర్వేల పేరు చెబుతూ బతుకుతున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఆనాడే మంత్రి పదవి ఇచ్చి ఉంటే తెలంగాణ గురించి మాట్లాడేవాడే కాదని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఇక కాంగ్రెస్ తరఫున సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై పార్టీలో గందరగోళం ఉన్నమాట వాస్తవమేనని, అయితే అధిష్టానం దగ్గర కొట్లాడి అయినా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీఎం చేస్తామని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ పేర్కొన్నారు.

మళ్లీ మాట మార్చారా బాబూ?

- ప్రత్యేక హోదాపై ఎన్నిసార్లు నాలుక మడతేస్తారు?
- అసలు మీకు మెదడుందా?
- వైఎస్ జగన్ మండిపాటు



బుధవారం ప్రకాశం జిల్లా చీమకుర్తిలో అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'ఈ పెద్ద మనిషి పూటకో మాట మాట్లాడుతున్నాడు. ఎన్నికలప్పుడు ప్రత్యేక హోదా సంజీవనే అన్నాడు. అధికారంలోకి రాగానే హోదా ఏమైనా సంజీవనా అని ఎదురు ప్రశ్న వేశాడు. నాలుగేళ్లుగా మనం పోరాటం చేస్తుండటంతో ఇటీవల మాట మార్చి హోదా ఇవ్వాల్సిందే అన్నాడు. ఇప్పటికైనా జ్ఞానోదయం అయింది అనుకున్నాం. నాలుగు రోజులైనా గడవక ముందే ప్రత్యేక హోదాతో ఏమొస్తుందని ప్రశ్నిస్తున్నాడు. ఆయన మాటలు వింటుంటే అసలు ఈ మనిషికి మెదడు ఉందా అని సందేహం వస్తోంది' అంటూ ఏపీ సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ప్రజా సంకల్ప యాత్రలో 100వ రోజు బుధవారం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తిలో భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే...

హోదాతో ఏమి వస్తాయో తెలియదా బాబు?

''పరిశ్రమలకు రాయితీలు వస్తాయని కొందరు మభ్యపెడుతున్నారు అని మీరన్నారు కనుక నేను సమాధానం చెబుతా. రాష్ట్రాన్ని విడగొట్టే ముందు పార్లమెంట్‌లో ఏమి జరిగిందో, ఎంత అడ్డగోలుగా విడగొట్టారో తెలియదా? పార్లమెంట్‌లో అడ్డగోలుగా విభజించే సమయంలో ఇప్పుడు మీ మిత్రపక్షంగా ఉన్న ఆనాటి బీజేపీ నాయకుడు వెంకయ్య నాయుడు ఏమి మాట్లాడారో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. పరిశ్రమల ఏర్పాటుకు మూడు, నాలుగేళ్లు పడుతుందని, అలాంటప్పుడు ఐదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తే ఏమి సరిపోతుందీ.. కనీసం పదేళ్లయినా కావాలి అని అడిగారు. ఆ తర్వాత ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ సమక్షంలో తిరుపతి సభలో మీరు (చంద్రబాబు) 15 ఏళ్ల హోదా కావాలని అడిగారు. దీనర్థం ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకే రాయితీలు వస్తాయన్నది మీకు తెలియదా? హోదా ఉన్న రాష్ట్రాలకే ప్రత్యేక రాయితీలు వస్తాయి. ఎవరైనా ఆస్పత్రో, హోటలో, మరేదయినా కట్టాలంటే రాయితీలున్నప్పుడే వస్తారు. ప్రత్యేక హోదా ఉంటే ఆదాయపు పన్నులో, జీఎస్టీలో రాయితీ వస్తుంది. కరెంటు చార్జీల తగ్గింపు ఉంటుంది. ఇవన్నీ తెలుసుకాబట్టే ఆవేళ వెంకయ్యనాయుడైనా, చంద్రబాబు నాయుడైనా ప్రత్యేక హోదా గురించి మాట్లాడారు. పరిశ్రమలు పెట్టడానికే ఆ ఇద్దరూ 10, 15 ఏళ్ల హోదా కావాలన్నారు. కానీ ఈవేళ మీకు అవి కనబడడం లేదా? అప్పుడొక మాట.. మొన్నటి దాకా ఒక మాట.. నేడొక మాట. మాట మీద నిలకడ ఉండదు. పొద్దున్నే ఒక మాట మాట్లాడి.. సాయంత్రానికి మాట మార్చేస్తాడు.

పోలవరం ప్రాజెక్టుకు సమాధి కడుతున్నారు..

పోలవరానికి సంబంధించి రూ.40 వేల కోట్లు కూడా రావని చంద్రబాబు అంటున్నాడు. నిజానికి రాష్ట్రాన్ని విడగొట్టేటప్పుడు విభజన చట్టంలో కొన్ని అంశాలు పెట్టారు. తర్వాత ప్రధాని కొన్ని హామీలిచ్చారు. వాళ్ల మాటల్ని బట్టి పోలవరానికి ఎంత ఖర్చయినా పర్వాలేదు, కేంద్రమే నిర్మిస్తాం, మాకు వదిలిపెట్టండి అన్నారు. కానీ బాబు ఈ ప్రాజెక్టును వాళ్లకు విడిచిపెట్టకుండా తన కమీషన్లు, లంచాల కోసం అడిగి తీసుకోవడం అన్యాయం కాదా? తన అవినీతితో ప్రాజెక్టుకు సమాధి కడుతున్నాడు. రేట్లు పెంచి తనకు కావాల్సిన వారికి కాంట్రాక్టులు కట్టబెడుతున్నాడు. చివరకు తన మంత్రివర్గంలోని క్యాబినెట్ మంత్రి యనమల రామకృష్ణుడు వియ్యంకుడు కూడా సబ్ కాంట్రాక్టర్‌గా ఉన్నారు. ఏ స్థాయిలో అవినీతి ఉందో ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. లోటు బడ్జెట్ కింద రూ.16 వేల కోట్లు రావంటాడు. ఆయనకు మధ్యకాలంలో జ్ఞాపకశక్తి ఏమైనా తగ్గిందేమో ఆలోచించుకోవాలి. లేక ఏదయినా మెంటల్ ఆస్పత్రికి పోయి వైద్యం చేయించుకోండి. ఎందుకంటే ప్రధానమంత్రి ఇచ్చిన హామీని ఒక్కసారి గుర్తుకుతెచ్చుకో. పీఎం హామీ, విభజన చట్టం ప్రకారం లోటు బడ్జెట్‌ను పూర్తిగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకున్న వెసులుబాటు ఏమిటంటే రెవెన్యూ డెఫిసిట్‌ను పూర్తిగా పూడ్చే పరిస్థితి ఎప్పుడూ ఉంది. చంద్రబాబుకు ఇవన్నీ తెలియక కాదు. అయినా ప్రత్యేక హోదా ఎక్కడుందీ.. యాక్ట్ ఎక్కడుందీ.. రాయితీలు ఎక్కడున్నాయి.. అంటూ తిక్కతిక్కప్రశ్నలు వేస్తాడు. జీఎస్టీ కౌన్సిల్‌లో టీడీపీకే చెందిన యనమల సభ్యుడు. ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు ఏమేం రాయితీలు వస్తాయో మీకు తెలియదా?

అభివృద్ధి అంటే ఇదేనా?

40 ఏళ్ల రాజకీయ జీవితం పూర్తయిందంటూ చంద్రబాబు నిన్న టీవీల్లో, పేపర్లలో ఇంటర్వ్యూలు వేయించుకున్నారు. ఈనాడు పేపర్‌లో, ఎల్లో మీడియా పేపర్లో బ్యానర్లు పెట్టారు. అభివృద్ధి విపక్షాలకు కనిపించడం లేదా అని బాబు ప్రశ్నిస్తున్నట్టు రాశారు. అసలు అభివృద్ధి అంటే ఏమిటో తెలుసా బాబూ? మీకు బాబు వంటి అబద్ధాలకోరు మోసగించే వ్యక్తి కావాలా? ఆలోచించండి.



100వ రోజు
28–02–2018,
బుధవారం
చీమకుర్తి, ప్రకాశం జిల్లా

ఈ వంద రోజుల ప్రయాణంలో జనం అగచాట్లు చూశాను..

ఇడుపులపాయలో మొదలైన నా పాదయాత్ర ఇవాళ వంద రోజులకు చేరింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో నా అడుగులో అడుగేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. మరువలేని మీ ఆదరణ.. విలువ కట్టలేని మీ ఆప్యాయత.. ఉత్సాహాన్నిచ్చిన మీ ప్రోత్సాహానికి ధన్యవాదాలు. ఈ వంద రోజుల ప్రయాణంలో ఎన్నో అనుభవాలు. చంద్రబాబు అవినీతి, అన్యాయ, మోసపూరిత పాలనలో జనం అగచాట్లు చూశాను. అన్నదాత గుండె కోత.. అవ్వాతాతల హృదయ ఘోష.. అక్కచెల్లెమ్మల ఆవేదన.. నిరుద్యోగుల హాహాకారాలు.. పేదవాడి ఆకలి కేకలు.. పాదయాత్రలో కదిలించిన అంశాలు. కన్నీరు తెప్పించిన సజీవ చిత్రాలు. ఇలాంటి బాధాతప్త హృదయాలను ఊరడించడానికి ఇంకా.. ఇంకా.. ప్రజలతో మమేకమవ్వాలనే తపన నాలో మరింత పెరుగుతోంది.

ఈ రోజు నా పాదయాత్ర చీమకుర్తి మండలం రామతీర్థం మీదుగా సాగింది. నిన్న మొత్తం మండే ఎండలో.. గొంతెండిన మార్కాపురం నియోజకవర్గ పల్లెల గోడు చూశాను. దోసెడు నీటి కోసం కోసుల దూరం వెళ్తున్న జనం, ఖాళీ బిందెలతో గగ్గోలు పెట్టిన అక్కచెల్లెమ్మల ఆందోళనలే నా కళ్ల ముందు మెదులుతున్నాయి. ఈ రోజూ ఇలాంటి అనుభవాలే ఉంటాయేమో అనుకున్నా. ఆశ్చర్యమేంటంటే.. ఇక్కడ అసలు తాగునీటి సమస్యే ఎదురవ్వలేదు. రామతీర్థం గ్రామానికి వచ్చాకగానీ అసలు విషయం తెలియలేదు. దాహార్తి తీర్చేందుకు నాన్నగారు నిర్మించిన రామతీర్థం జలాశయం ఇక్కడే ఉంది. సాగర్ నీళ్లతో కళకళలాడుతోంది. ఆ జలాశయమే ఇప్పుడు పరిసర పల్లెల గొంతు తడుపుతోందని స్థానికులు చెప్పారు. ఆయన చేసిన ఆ మంచిపని జనం గుండెల్లో ఎంతగానో నిలిచిపోయింది. వెలిగొండ పూర్తిచేసి మార్కాపురంతో పాటు ఇతర ప్రాంతాల వెతలూ తీర్చాలన్నది నాన్నగారి కోరిక. కానీ, ఆయన తర్వాత ప్రభుత్వాలు ఆ ఆశయానికి గండికొట్టాయి. గుక్కెడు నీరు కూడా ఇవ్వాలనే స్పృహలేని ఈ ప్రభుత్వాన్ని ఏమనాలి?

రక్తాన్నే ఇంధనంగా మార్చి.. యంత్రాన్ని నడుపుతున్న శ్రమజీవికి ఇన్ని కష్టాలా! ఆపదొస్తే కుటుంబమే కుమిలిపోవాలా? ఈఎస్ఐ చందాదారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు వెలిబుచ్చిన ఆందోళనలోంచి పుట్టుకొచ్చిన ప్రశ్నలివి. రాష్ట్రంలో 14 లక్షలకు పైగా ఈఎస్ఐ చందాదారులున్నారు. తిన్నా తినకున్నా.. వాళ్లంతా ఈఎస్ఐకి కనీసం నెలకు రూ.780 కడుతూనే ఉన్నారు. ఏటా వందల కోట్లు కట్టించుకుంటున్నా ఆస్పత్రులు అందుబాటులో లేవట. తిరుపతి, విజయవాడ, రాజమండ్రి, విశాఖలలో మాత్రమే ప్రాంతీయ ఆస్పత్రులున్నాయట. అత్యవసర పరిస్థితైనా.. సుదూర ఆస్పత్రులకు వెళ్లక తప్పదు. తీరా వెళ్తే సౌకర్యాలు నామమాత్రమట. వైద్యులూ అందుబాటులో ఉండరట. కాళ్లావేళ్లాపడి కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫార్సు చేయించుకున్నా అక్కడా చేదు అనుభవాలే. ప్రైవేటు ఆస్పత్రులకు ఈఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడమే కారణమంటున్నారు. ప్రాణాలు నిలబెట్టుకునేందుకు చేతి నుంచి ఖర్చుచేసుకుంటే.. రీయింబర్స్ చేయడం లేదట.

కార్మికుల స్వేదాన్ని సైతం దోచుకుంటున్న ఈ పాలకులకు వారి గోడు చెవికెక్కుతుందా?! మన ప్రభుత్వం వచ్చాక ప్రతి జిల్లా కేంద్రంలో ఒక ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని, ఈఎస్ఐ మెడికల్ కాలేజీ కట్టించాలని, తమకు, కుటుంబాలకు ఆరోగ్య భరోసా ఇవ్వాలని కార్మికులు కోరారు.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. ప్రజల కనీస అవసరాలు తీర్చడం పాలకుడి ధర్మం. నాన్నగారికి ఉన్న ఆ తపనకు సజీవ సాక్ష్యమే.. రామతీర్థం జలాశయం. ఆయన హయాంలో 70శాతానికి పైగా పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి.. ఈ ప్రాంత దాహార్తిని తీర్చకపోవడం మీ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం కాదా?

వై.ఎస్. జగన్

గ్రూప్‌-2 జవాబు పత్రాలు పరిశీలిస్తాం

- బబ్లింగ్‌లో తప్పులు, వైట్‌నర్‌ వివాదంపై హైకోర్టు
- టాప్‌ 5 వేల మంది ఓఎంఆర్‌ షీట్ల పరిశీలనకు నిర్ణయం
- ఇందుకోసం ముగ్గురు సీనియర్‌ న్యాయవాదులతో కమిటీ
- శని, ఆదివారాల్లో పరిశీలనకు ఏర్పాట్లు చేయాలని టీఎస్‌పీఎస్సీకి ఆదేశం
- న్యాయవాదుల కమిటీ నివేదిక మేరకు నిర్ణయం ఉంటుందన్న కోర్టు
- తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా

సాక్షి, హైదరాబాద్‌: గ్రూప్‌–2 పరీక్షల్లో వైట్‌నర్‌ వాడిన, బబ్లింగ్‌లో తప్పులు చేసిన అభ్యర్థులను అర్హులుగా ప్రకటించారన్న ఆరోపణల నేపథ్యంలో.. అభ్యర్థుల జవాబు పరిశీలించాలని ఉమ్మడి హైకోర్టు నిర్ణయించింది. టాప్‌–5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్‌ షీట్లను పరిశీలిస్తామని, ఇందుకోసం ముగ్గురు సీనియర్‌ న్యాయవాదులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించింది. ఆ కమిటీ నివేదికను పరిశీలించిన అనంతరం ఈ వ్యవహారంలో తుది నిర్ణయం తీసుకుంటామంది. ఈ మేరకు న్యాయ మూర్తి జస్టిస్‌ పి.నవీన్‌రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

‘వైట్‌నర్‌’తో వివాదం

టీఎస్‌పీఎస్సీ రాష్ట్రంలో 1,032 గ్రూప్‌–2 పోస్టుల భర్తీ కోసం 2015లో నోటిఫికేషన్‌ జారీ చేసిన విషయం తెలిసిందే. ఓఎంఆర్‌ షీట్లపై వైట్‌నర్‌ ఉపయోగించరాదని, వివరాల నమోదులో తప్పులు చేస్తే వాటిని పరిగణనలోకి తీసుకోబోమని పరీక్ష నిబంధనల్లో స్పష్టం చేసింది. అయితే పరీక్ష నిర్వహించిన అనంతరం.. వైట్‌నర్‌ వినియోగించిన, బబ్లింగ్‌లో, వ్యక్తిగత వివరాల నమోదులో పొరపాట్లు చేసినవారిని కూడా టీఎస్‌పీఎస్సీ అర్హులుగా గుర్తించిందంటూ వివాదం తలెత్తింది. దీనివల్ల అర్హులైన అభ్యర్థులు నష్టపోయారని, గ్రూప్‌–2 నియామకాలను నిలిపేయాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన రామచంద్రారెడ్డి, మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వైట్‌నర్‌ వాడిన వారి సంఖ్య తక్కువని, ఆ కారణంతో నియామక ప్రక్రియను నిలిపేయొద్దంటూ మరికొందరు పిటిషన్లు వేశారు. తాజాగా బుధవారం న్యాయమూర్తి జస్టిస్‌ పి.నవీన్‌రావు మరోసారి విచారించారు.

మార్గదర్శకాలను ఉల్లంఘించడమే

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఓఎంఆర్‌ షీట్లలో సమాధానాల బబ్లింగ్, వైట్‌నర్‌ వినియోగం విషయంలో టీఎస్‌పీఎస్సీ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. వాటి ప్రకారం వైట్‌నర్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించకూడదని.. కానీ వైట్‌నర్‌ వాడిన, బబ్లింగ్‌లో తప్పులు చేసిన అభ్యర్థులను కూడా అర్హులుగా గుర్తించారని తెలిపారు. ఇది టీఎస్‌పీఎస్సీ స్వీయ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనన్నారు. ప్రభుత్వం తరఫు అడ్వకేట్‌ జనరల్‌ దేశాయ్‌ ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ.. 1,032 పోస్టుల భర్తీకి 1:3 పద్ధతిన 3,096 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోందని వివరించారు. అవసరమైతే అభ్యర్థుల జవాబు పత్రాల పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేసినా తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. దీంతో ఓఎంఆర్‌ షీట్ల పరిశీలనకు సీనియర్‌ న్యాయవాదులు పి.శ్రీరఘురాం, ఆర్‌.రఘునందన్‌రావు, ఎస్‌.నిరంజన్‌ రెడ్డితో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. టీఎస్‌పీఎస్సీ అధికారుల సాయంతో టాప్‌ 5 వేల మంది మెరిట్‌ అభ్యర్థుల ఓఎంఆర్‌ షీట్లను పరిశీలించాలని కమిటీకి సూచించారు. అనంతరం పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. శని, ఆదివారాల్లో కమిటీ పరిశీలన జరుపుతుందని.. ఇందుకోసం టాప్‌ 5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్‌ షీట్లను, సంబంధిత రికార్డులను అందుబాటులో ఉంచాలని టీఎస్‌పీఎస్సీ అధికారులను ఆదేశించారు. కమిటీ నివేదికను పరిశీలించాక ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు విచారణను మార్చి 19కి వాయిదా వేశారు.

హిజ్రాల హక్కులను హరిస్తోంది

- యూనక్స్‌ చట్టంపై హైకోర్టు
- ప్రభుత్వం సవరణలు చేయాలి
- పూర్తి వివరాలతో కౌంటర్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: శతాబ్దం కిందట (1919) నిజాం కాలంలో హిజ్రాలకు సంబంధించి తీసుకొచ్చిన తెలంగాణ యూనక్స్‌ చట్టంలోని కొన్ని నిబంధనలు అత్యంత దారుణంగా ఉన్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నిబంధనలను తాము కొట్టేయడానికి ముందే తెలంగాణ ప్రభుత్వం ఈ చట్టానికి సవరణలు చేసే అంశాన్ని పరిశీలించాలని పేర్కొంది. 15–16 ఏళ్ల బాలుడిని హిజ్రాలు తమ వద్ద ఉంచుకోవడం నేరమన్న ఈ చట్ట నిబంధనలపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. సమాజంలో పిల్లలపై అనేక రకాలుగా అఘాయిత్యాలు జరుగుతున్నాయని, వీటిని కేవలం హిజ్రాలకే ఆపాదించడం ఎంత మాత్రం సరికాదంది. అలాగే హిజ్రాలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని.. నాట్యం, సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నా అరెస్ట్‌ చేయవచ్చునన్న నిబంధనలు ఎంత మాత్రం సమంజసం కాదని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్‌ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్‌ రమేశ్‌ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్‌ కె.విజయ లక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. తెలంగాణ యూనక్స్‌ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి, దానిని కొట్టేయాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన వి.వసంత, కేఎంవీ మోనాలీసా, మరొకరు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలు చేశారు.

ఓయూలోకి ప్రైవేటు వాహనాల నిషేధం!

హైదరాబాద్‌: ఓయూ క్యాంపస్‌ మీదుగా రాకపోకలు సాగించే ప్రైవేటు వాహనాలను నిషేధించాలని వర్సిటీ అధికారులు నిర్ణయించారు. బుధవారం ఓయూ రిజిస్ట్రార్‌ పేరిట క్యాంపస్‌కు ఇరువైపులా నిషేధ బోర్డులు పెట్టారు. ప్రైవేటు వాహనాల కారణంగా నిత్యం రోడ్డు ప్రమాదాలతో పాటు వాయు, ధ్వని కాలుష్యంతో క్యాంపస్‌ వాతావరణం కలుషితమవుతుందని ఏబీవీపీ నాయకులు ఇటీవల ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. క్యాంపస్‌కు ఇరువైపులా గేట్లు పెట్టి ఉద్యోగులు, వర్సిటీకి సంబంధించిన వాహనాలను మాత్రమే అనుమతించాలని ఏబీవీపీ ఓయూ ఇన్‌చార్జి పగిడిపల్లి శ్రీహరి పేర్కొన్నారు.

మనిషిలో దైవాన్ని దర్శించిన జయేంద్ర

మంత్రి ఇంద్రకరణ్‌

హైదరాబాద్‌: కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కంచి పీఠాధిపతిగా 64 ఏళ్లకు పైగా కొనసాగుతూ సనాతన భారతీయ ధర్మ పరిరక్షణకు విశిష్టంగా కృషి చేశారని కొనియాడారు. వైద్య, విద్యాలయాలు, వృద్ధాశ్రమాలను నెలకొల్పి సాటి మనిషిలో దైవాన్ని దర్శించిన మహోన్నత జీవి జయేంద్ర సరస్వతి అని పేర్కొన్నారు. స్వామి మహానిర్యాణం పట్ల తెలంగాణ అర్చక సమాఖ్య ప్రతినిధులు భాస్కరభట్ల రామశర్మ ఆధ్వర్యంలో ప్రతినిధులు నివాళులర్పించారు.

‘టీఎస్‌కాప్‌’కు ఎన్‌సీఆర్‌బీ ట్రోఫీ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర పోలీసు విభాగం రూపొందించిన ‘టీఎస్‌కాప్‌’కు నేషనల్‌ క్రైమ్‌ రికార్డ్స్‌ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ట్రోఫీ–2017 లభించింది. బుధవారం చెన్నైలో జరిగిన ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా ట్రోఫీని తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి చేతుల మీదుగా అదనపు డీజీ అంజనీకుమార్‌ అందుకున్నారు. ఎన్‌సీఆర్‌బీ ఏటా నిర్వహించే టెక్నాలజీ అమలు, వినియోగం, పోలీసు శాఖలో కంప్యూటీకరణ తదితర అంశాలపై పోటీ నిర్వహిస్తోంది. ఇందులో అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు పోటీ పడగా టీఎస్‌కాప్‌కు ఈ ట్రోఫీ లభించింది.

రాష్ట్ర హజ్‌ కోటా పెంచండి

కేంద్ర మంత్రి నఖ్వీని కోరిన రాష్ట్ర హజ్‌ కమిటీ చైర్మన్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రం నుంచి ఏటా హజ్‌ యాత్రకు దరఖాస్తులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర కోటాను పెంచాలని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ముఖ్తార్‌ అబ్బాస్‌ నఖ్వీని రాష్ట్ర హజ్‌ కమిటీ చైర్మన్‌ మసీవుల్లాఖాన్‌ కోరారు. బుధవారం ఈ మేరకు ఢిల్లీలో ఆయన కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 2018 హజ్‌ యాత్రకు దాదాపు 18 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అయితే కేంద్ర హజ్‌ కమిటీ రాష్ట్రానికి 4 వేల కోటా మాత్రమే కేటాయించడంతో దరఖాస్తు చేసుకున్న మిగతా 14 వేల మందికి నిరాశే మిగిలిందని వివరించినట్లు చెప్పారు.

‘ప్రతి అసెంబ్లీ కేంద్రంలో మహిళా దినోత్సవం’

సాక్షి, హైదరాబాద్‌: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో వేడుకలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిధులను జిల్లాలకు విడుదల చేస్తామని చెప్పారు. బుధవారం సచివాలయంలో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, సాంస్కృతిక మండలి చైర్మన్‌ రసమయి బాలకిషన్‌తో సమావేశం నిర్వహించారు. మార్చి 8న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కార్యక్రమానికి వేదికగా లలితకళాతోరణాన్ని పరిశీలించాలన్నారు.

‘ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలు బాధ్యత కమిషన్‌దే’

సాక్షి, హైదరాబాద్‌: షెడ్యూల్డ్‌ కులాలు, షెడ్యూల్డ్‌ తెగల కోసం రూపొందించిన చట్టాలను అమలు చేయడంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో కడియం మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను శ్రీనివాస్‌ సమర్థంగా నిర్వహించాలని సూచించారు. టీఆర్‌ఎస్‌ పార్టీలో ప్రతి కార్యకర్తకు అవకాశం వస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను కమిషన్‌ అరికట్టాలని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, నాయిని నర్సింహారెడ్డి, జోగు రామన్న, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ పాల్గొన్నారు.



ప్రభుత్వోద్యోగులకు ‘ఎంసీఆర్‌ హెచ్‌ఆర్డీ’ రెండో దశ శిక్షణ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు రెండో దశ ఈ–లెర్నింగ్‌ శిక్షణ కార్యక్రమాన్ని ఎంసీఆర్‌ హెచ్‌ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌ బుధవారం ప్రారంభించింది. ఇందులో ఆర్టీఐ, కార్యాలయ నిర్వహణ, ఫైనాన్స్, అకౌంట్స్‌ తదితర అంశాలపై ఉద్యోగుల నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. మొదటి రోజు 120 రిసోర్సు పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. వీరు మండల స్థాయిలోని ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు ఏకే గోయల్‌ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ స్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు నైపుణ్యాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 13 లక్షల మంది టీచర్లకు ఈ శిక్షణ అవసరమన్నారు. మొదటి దశలో జిల్లాస్థాయిలోని 9 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామని ఎంసీఆర్‌ హెచ్‌ఆర్డీ డైరెక్టర్‌ జనరల్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య అన్నారు. రెండో దశలో మండల స్థాయిల్లోని మరో 9 వేల మందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాక్షి
గురువారం, మార్చి, 1

ట్రుడో టూర్‌లో అపశ్రుతులు

వేరే దేశాల అధినేతలు అధికారిక పర్యటనకు వచ్చినప్పుడు వారికి సాదరంగా ఆహ్వానం పలకడం, మంచి అతిథి సత్కారాలు అందించి వీడ్కోలు పలకడం దౌత్య మర్యాదల్లో భాగం. ప్రధాని నరేంద్ర మోదీ ఇంకో అడుగు ముందుకేసి స్వయంగా విమానాశ్రయానికెళ్లి ఆ అధినేతలకు స్వాగతం పలికి, వారిని హత్తుకుని ప్రేమాభిమానాలు చాటుతున్నారు. కొందరిని తన స్వరాష్ట్రం గుజరాత్ తీసుకెళ్లారు. ఆ అధినేతల రాకను హర్షిస్తూ ట్వీటర్ ద్వారా సందేశాలివ్వడం కూడా మోదీయే ప్రారంభించారు. ఇవన్నీ వారిని మనకు మరింత దగ్గర చేసే చర్యలు. పరస్పర ఆధారిత ప్రపంచంలో ఇవి మేలు కలిగించేవే. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, జపాన్ ప్రధాని షింజో అబేలకు ఇలాంటి ఘన సత్కారాలే లభించాయి. కానీ ఈ నెల 17 నుంచి 24 వరకూ మన దేశంలో సకుటుంబ సమేతంగా ఎనిమిది రోజులపాటు పర్యటించిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడోకు మాత్రం ఆ మాదిరి ఆదరణ లభించలేదు. కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి మాత్రమే వెళ్లి ఆయనకు స్వాగతం పలికారు. ఆయన కుటుంబం తాజ్‌మహల్‌కు వెళ్లినప్పుడు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌గానీ, ఆయన కేబినెట్‌లో మరెవరైనాగానీ అక్కడ లేరు సరిగదా జిల్లా అధికారులు మాత్రమే ఆయనను పలకరించారు. జస్టిన్ ట్రుడో, ఆయన కుటుంబ సభ్యులు మన దేశ పర్యటన కోసం కొంత కసరత్తు కూడా చేసినట్టున్నారు. విమానం నుంచి వెలుపలికి వచ్చి ఆ దంపతులు, వారితోపాటు పిల్లలు ముకుళిత హస్తాలతో నిల్చున్నారు. ఆ తర్వాతే మెట్లు దిగి కిందికొచ్చారు. వారందరి వస్త్ర ధారణలో భారతీయం మెరిసింది. ఈ వారం రోజుల పర్యటనలోనూ అధికారిక కార్యక్రమం ఉన్నది ఒక్క అరపూట మాత్రమే. అయితే ఏ మాటకా మాటే చెప్పుకోవాలి. ఆ కార్యక్రమం సందర్భంగా నరేంద్ర మోదీ ట్రుడోను హత్తుకున్నారు. వారి పిల్లలతో ఉల్లాసంగా కబుర్లు చెప్పారు. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌ను ట్రుడో కలిసినా ఆయన ముకసరిగా, ముభావంగా ఉన్నారు. సరిగ్గా ఆరేళ్లక్రితం అప్పటి కెనడా ప్రధాని స్టీఫెన్ హార్పర్ ఆరు రోజుల పర్యటనకు వచ్చినప్పుడు సైతం ఇప్పుడు ట్రుడోకు లభించిన నిరాదరణ వంటిదే ఎదురైంది.

కెనడా జనాభా 3.6 కోట్లు కాగా అందులో 10 లక్షలమంది భారత సంతతి పౌరులుంటారు. వీరిలో సగంమంది సిక్కులు. కొన్ని ప్రాంతాల్లో వీరి జనాభా అత్యధికం. రాజకీయంగా నిర్ణయాత్మకం. ఈ సిక్కుల్లో అధిక శాతంమంది ట్రుడో నేతృత్వంలోని పార్టీకి గట్టి మద్దతుదారులు. ట్రుడో ప్రభుత్వంలో నలుగురు సిక్కు మతస్తులున్నారు. డోనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్షుడయ్యాక అమెరికా ఎడాపెడా వీసా నిబంధనలను కఠినం చేస్తున్న వర్తమానంలో అనేకులు కెనడావైపు ఆశగా చూస్తున్నారు. మన సాఫ్ట్‌వేర్ నిపుణులపై అమెరికా అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ వేధిస్తుంటే కెనడా వారికి స్వాగతం పలుకుతోంది. పర్మినెంట్ రెసిడెన్సీ ఇవ్వడానికి సిద్ధపడుతోంది. 'ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ'ప్రారంభించి దానికింద సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఇంజనీరింగ్, వైద్యవిద్య తదితర రంగాల్లో నిపుణులైనవారు ఉద్యోగం లేకున్నా ఆర్నెల్ల వీసాపై రావడానికి అవకాశం ఇస్తోంది. ఫలితంగా ఆయా రంగాల్లో నిపుణులైనవారు కెనడాకు వెళ్లి ఉపాధి వెదుక్కునే వీలుంటుంది. అక్కడి విశ్వవిద్యాలయాల్లో మన విద్యార్థులకు పుష్కలంగా అవకాశాలున్నాయి.

ఈ నేపథ్యంలో మన దేశంలో ట్రుడోకు ఘన స్వాగతం లభించాలి. కానీ సిక్కు వేర్పాటువాదుల విషయంలో ఆ దేశ విధానాలు మన దేశానికి ససేమిరా నచ్చడం లేదు. వారిపట్ల కఠినంగా ఉండాలని మన దేశం డిమాండు చేస్తుంటే కెనడా పట్టించుకోవడం లేదు. ఇది ఇటీవల తలెత్తిన ధోరణి కాదు. పంజాబ్‌లో ఉగ్రవాదం పెచ్చరిల్లిన 80వ దశకం నుంచీ ఈ సమస్య ఉంది. 1985 జూన్‌లో కెనడాలోని టొరంటో నుంచి ఢిల్లీ వస్తున్న ఎయిరిండియా విమానాన్ని మిలిటెంట్లు పేల్చేయడంతో 329మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. కెనడాలో స్థిరపడ్డ సిక్కు నేతలు ఈ మిలిటెంట్లకు అండదండలిచ్చారని, వారిపై చర్య తీసుకోవాలని మన దేశం కోరినా అక్కడి ప్రభుత్వం పెద్దగా స్పందించలేదు. అందువల్లే లోగడ హార్పర్‌కూ గానీ, ఇప్పుడు ట్రుడోకూ గానీ ఘనస్వాగతం లభించలేదు. ఇదంతా చాలదన్నట్టు ట్రుడో రాక సందర్భంగా ఢిల్లీలోని కెనడా హైకమిషనర్ ఇచ్చిన విందులో ఖలిస్తాన్ మాజీ నాయకుడు జస్పాల్ సింగ్ అత్వాల్ పాల్గొన్నాడు. 1986లో కెనడా వెళ్లిన పంజాబ్ మంత్రి మాల్కియత్ సింగ్ సిద్ధూపై హత్యాయత్నం చేసిన కేసులో అత్వాల్ 20 ఏళ్ల శిక్ష అనుభవించాడు. అతడు నిషేధిత అంతర్జాతీయ సిక్కు ఫెడరేషన్ కార్యకర్త. అలాంటి చరిత్ర ఉన్న వ్యక్తికి ట్రుడో కార్యక్రమాల్లో చోటివ్వడం కెనడా చేసిన తప్పే కావొచ్చుగానీ... అసలు అతనికి భారత్ వీసా ఎలా లభించింది? ఈ మధ్యకాలంలో విదేశీయులు కొందరిని విమానాశ్రయాలనుంచే వెనక్కి పంపిన మన అధికారుల కన్నుగప్పి అతడెలా రాగలిగాడు?

ట్రుడో పర్యటనలో కొన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరాయి. అణు సరఫరాదార్ల బృందం(ఎన్ఎస్‌జీ)లో భారత్ ప్రవేశానికి తమ మద్దతుంటుందని ట్రుడో చెప్పారు. రెండు దేశాల మధ్య 840 కోట్ల డాలర్ల వాణిజ్యం ఉంది. కానీ ఈ అనుకూలాంశాలన్నీ అత్వాల్ ఉదంతం మింగేసింది. అధినేతల పర్యటనలున్నప్పుడు ఇరు దేశాల మధ్యా రెండు మూడు నెలల ముందు నుంచి కసరత్తు జరుగుతుంది. ఎవరెవరితో పరిమితులు పాటించాలో... ఏ అంశాల్లో కలిసి కదలాలన్న అవగాహన ఉంటుంది. అవి ముగియకుండానే ట్రుడో వచ్చిన పర్యవసానంగా అంతా రసాభాసగా ముగిసినట్టు కనబడుతోంది. కెనడాతో సమస్యలుంటే ప్రస్తుతం రాకపోవడమే మంచిదన్న సంకేతాలు పంపాలి. అంతా సవ్యంగా ఉన్నదనుకున్నప్పుడే పిలవాలి. ట్రుడోను అవమానించారంటూ కెనడా మీడియా చేసిన వ్యాఖ్యల ప్రభావం అక్కడి మన పౌరులపై కూడా ఉంటుంది. ప్రపంచ దేశాల్లోనూ పలచనవుతాం. ఇలాంటి ఇరకాట పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటం అవసరం.



మనల్ని మనం గౌరవించుకోవడం మన నైతికతను నిర్దేశిస్తుంది. ఇతరులను గౌరవించడం మన మర్యాదను నిర్దేశిస్తుంది.

–లారెన్స్ స్టెర్న్
ఐరిష్ నవలా రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబినామ సంవత్సరంఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం తిథి శు.చతుర్దశి ఉ.8.25 వరకు తదుపరి పౌర్ణమి నక్షత్రం మఖ రా.12.00 వరకు తదుపరి పుబ్బ వర్జ్యం రా.12.36 నుంచి 2.07 వరకు దుర్ముహూర్తం ఉ.10.14 నుంచి 11.01 వరకు తదుపరి ప.2.54 నుంచి 3.42 వరకు అమృతఘడియలు రా.9.43 నుంచి 11.14 వరకు

సూర్యోదయం	: 6.23	3.00 వరకు
సూర్యాస్తమయం	: 6.02	యమగండం :
రాహుకాలం :		ఉ.6.00 నుంచి
ప 1.30 నుంచి		7.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	: 5.22	మగ్రీబ్	: 6.23
జొహర్	: 12.28	ఇషా	: 7.35
అసర్	: 4.44		

గుజరాత్ నమూనా నిజరూపం



మల్లెపల్లి లక్ష్మయ్య

గత ఇరవై సంవత్సరాల బీజేపీ పాలనలో దళితులు మరింత అభద్రతా భావంలో మునిగిపోయారు. ఆధిపత్య కులాల దాడులను, అత్యాచారాలను కొన్ని రాష్ట్రాలు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. కానీ గుజరాత్‌లో మంత్రులు, అధికారులు ఆధిపత్య కులాలకు వంతపాడుతున్నారు. దానికి తోడు గోసంరక్షణ పేరుతో ప్రతి గ్రామంలో దళితులను, ముస్లింలను నేరస్తులుగా చూస్తున్న పరిస్థితి.

భానూ భాయి వంకార్ ఆరుపదులు దాటిన రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి. విశ్రాంత జీవితాన్ని మనవలూ మనవరాళ్లతో సంతోషంగా, సుఖంగా గడిపేస్తారని అంతా భావించారు. వీలైతే ఏ ప్రైవేటు ఆఫీసులోనో పనిచేసి భవిష్యత్‌ని మరింత భద్రంగా మార్చుకునే వీలు కూడా లేకపోలేదు. కానీ ఆయన తన చుట్టూ ఉన్నవారి కోసం ఆలోచించారు. వాళ్లందరికీ మేలు జరిగితేనే తన లాంటి ఎందరో నిరుపేద దళితులకు న్యాయం జరిగినట్టుగా భావించాడు. అన్యాయాన్ని సహించలేని తత్వం, అణిగిమణిగి ఉండలేని వ్యక్తిత్వం కావడంతో పరిణామాలను తట్టుకోలేకపోయాడు. ఫిబ్రవరి 15 వ తేదీన పటాన్ జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం ఎదుట తనకు తాను నిప్పంటించుకొని ఆ మంటల్లో కాలిపోయాడు. మరునాడు తుదిశ్వాస విడిచాడు. ఈ సంఘటనపై దళితులు మూడు రోజుల పాటు చేసిన ఆందోళన ప్రభుత్వాన్ని కదిలించింది.

దళితుల ఆగ్రహావేశాలకు నిదర్శనం

ఎవరీ భానూ భాయి వంకార్? ఆయన ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారు? ప్రభుత్వోద్యోగిగా ఉండి రిటైర్ అయిన వ్యక్తికి వచ్చిన కష్టమేమిటి అన్న సందేహం రావచ్చు. భానూ భాయి వంకార్ నిబద్ధత కలిగిన దళిత నాయకుడు. దళిత్ అధికార్ మంచ్ కార్యకర్త. ఉద్యోగ విరమణానంతరం తన సమయాన్ని పూర్తిగా ఉద్యమం కోసం వెచ్చిస్తున్నారు. ఆయన మెహసేనా జిల్లా ఉంజా పట్టణానికి చెందినవాడు. గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో దళితులకు ఎక్కడ సమస్య ఎదురైనా మొదట గుర్తొచ్చేది ఆయనే. అందులో భాగంగానే పటాన్ జిల్లా సిమి బ్లాక్ దుద్క గ్రామానికి చెందిన దళితులు కొంతకాలంగా భూమి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దుద్క గ్రామానికి చెందిన హేమ, రమా చమార్‌లతో సహా వెళ్లి ముఖ్యమంత్రి విజయ్ రూపానీకి వినతిపత్రాన్ని సమర్పించారు భాను. దుద్క దళితులకు భూమి కేటాయించకపోతే 'అగ్నిస్నానం' చేస్తానని హెచ్చరించారు. కానీ ముఖ్యమంత్రి సహా ఎవరూ పట్టించుకోలేదు. ఫిబ్రవరి 7వ తేదీన పటాన్ జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రం ఇస్తూ, దుద్క గ్రామ దళితుల భూమి సమస్యను పరిష్కరించని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుటే ఆత్మహత్యకు పాల్పడతానని వెల్లడించారు. అయినా ఎటువంటి స్పందనా లేదు. దీంతో కుంగిపోయిన భానూ భాయి ఆవేదనతో అన్నంత పనీ చేశారు. 62 ఏళ్ల వృద్ధుడి జీవితంలోని ఈ విషాదాంతాన్ని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తూ చెప్పారు. ఫిబ్రవరి 17వ తేదీన నవసర్జన్ ట్రస్ట్ అహ్మదాబాద్‌లో తలపెట్టిన సమావేశానికి వెళ్లిన నాకు భానూ భాయి వంకార్ ఆత్మ బలిదానం గురించి తెలిసింది. గాంధీనగర్‌లోని ప్రభుత్వ వైద్యశాల వద్దకు వెళ్లాను. వందలాది మంది కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు ధర్నా చేస్తున్నారు. గుజరాత్ లోని దళితుల భూమి సమస్యను పరిష్కరించాలని, భానూభాయి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని, దుద్క గ్రామ దళితుల భూమి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ఆ డిమాండ్లు అంగీకరించేవరకు భానూ భాయి మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని తెగేసి చెప్పారు రైతులు. ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో ఆ మరుసటిరోజు గుజరాత్ అంతటా రాస్తారోకోలు జరిగాయి. గుజరాత్‌లో స్వతంత్ర అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికైన జిగ్నేష్ మేవాని సహా వందలాది మందిని ప్రభుత్వం అదుపులోనికి తీసుకుంది. ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశమున్నదని గ్రహించిన ప్రభుత్వం దిగివచ్చి ఉద్యమకారుల డిమాండ్లను అంగీకరించింది. చివరకు ఫిబ్రవరి 19వ తేదీ సోమవారం భానూ భాయి అంత్యక్రియలు నిర్వహించారు.

భానూ భాయి బలిదానం గుజరాత్ దళితుల్లో దాగున్న ఆగ్రహావేశాలను చాటిచెప్పింది. మహిళలు సైతం పెద్ద ఎత్తున పాల్గొనడం అక్కడి ప్రజల్లో నెలకొన్న అసంతృప్తికి నిదర్శనంగా చెప్పుకున్నారు. నిజానికి భానూ భాయి తన భూమి కోసం ఆత్మహత్యకు పాల్పడలేదు. అన్ని వనరులూ ఉండి, తరతరాలుగా భూమికి దూరంగా ఉండిపోయిన దళితుల పక్షాన నిలబడ్డారు. విఫలయత్నాలు మిగిల్చిన నిస్సహాయ స్థితిలో ఆత్మబలిదానం చేసుకున్నారు.

కొన్నేళ్లుగా గుజరాత్ దళితులు వెలివేతకు గురవుతున్నారు. భూవసతికి ప్రభుత్వాలు వారిని దూరంగా ఉంచాయి. భూసంస్కరణలు అంతగా ప్రయోజనం చేకూర్చలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం గుజరాత్‌లో దళితులు చేస్తున్న సేవలకు కొంత భూమిని కేటాయించేవారు. వాటిని పస్యత, వెతియ, ఇనామి పేర్లతో పిలిచేవారు. క్రమంగా ఆ భూములను స్థానిక ఆధిపత్య కులాలు స్వాధీనం చేసుకున్నాయి. భూ సంస్కరణల వలన దళిత, ఆదివాసీలకు 37 లక్షల 50 వేల ఎకరాలు పంచినట్టు ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ ఇందులో మూడోవంతు మాత్రమే ఈ వర్గాలకు చేరింది. ఉదాహరణకు సురేంద్రనగర్ జిల్లా లెక్కలను పరిశీలిస్తే 251 గ్రామాల్లో కేవలం ఆరువేల ఎకరాలు దళితుల అధీనంలో ఉన్నాయి. తమకు అందిన పట్టా కాగితాలతో దళితులు న్యాయస్థానాలను ఆశ్రయించినప్పటికీ నాలుగు దశాబ్దాలుగా న్యాయం దక్కలేదు.

కొత్తకోణం



దళితులకు దక్కని భూములు

గ్రామాల్లో ఆధిపత్య కులాలు పాటిదార్, బనియా, బ్రాహ్మణ కులాలు దళితుల పేరు మీద ఉన్న భూములను తమ స్వాధీనంలోనే పెట్టుకున్నాయి. మంత్రులను, అధికారులను ప్రభావితం చేయడం వల్ల దళితుల భూమి వారికి చెందకుండా పోయిందని కూడా నవసర్జన్ ట్రస్ట్ సర్వేలో వెల్లడైంది. అహ్మదాబాద్ జిల్లా, ధొల్కా తాలూకా, సరోడా గ్రామానికి చెందిన 185 మంది భూమిలేని దళిత కుటుంబాలకు 2006లో వ్యవసాయ భూమి పరిమితి చట్టం ప్రకారం 222 బిగాల భూమిని కేటాయించారు. అది కాగితాలకే పరిమితమైంది. పదేళ్ల నుంచి ఈ గ్రామ దళితులు ఈ భూమి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కానీ దాని జాడేలేదు. రాష్ట్రీయ దళిత్ అధికార్ మంచ్ ఆందోళన వల్ల ఈ గ్రామంలోని భూమి సమస్యను పరిష్కరిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. దళితులకు భూమి కావాలనే నినాదం మీద అక్కడ చాలా ఉద్యమాలు జరుగుతున్నాయి. అన్ని రాష్ట్రాల్లో జరిగిన విధంగానే గుజరాత్‌లో కూడా స్వాతంత్ర్యానంతరం 1952లో అమలులోనికి వచ్చిన సౌరాష్ట్ర భూసంస్కరణల చట్టం ప్రకారం దాదాపు 12 లక్షల ఎకరాలను గ్రామాల్లో ఆధిపత్య కులమైన పాటిదార్లకు కట్టబెట్టారు. దానితో పాటిదార్లు ఆ భూమి ద్వారా వ్యవసాయంలో అనేక ప్రయోజనాలు పొంది, ఈ రోజు వ్యాపార వర్గంగా ఎదిగారు.

మరికొన్ని చోట్ల దళితుల భూమిని కాజేయడానికి వారిని గ్రామాల నుంచి వెళ్లగొట్టారు. ఇది దేశంలో ఎక్కడాలేని దౌర్జన్య చర్య. దాదాపు 112 గ్రామాల్లో ఇదే పరిస్థితి. బెదిరించి, భయపెట్టి, చివరకు గ్రామబహిష్కరణ ద్వారా 69 గ్రామాల ప్రజలను తరిమికొట్టారు. మరో 43 గ్రామాల దళితులు బెదిరింపులకు భయపడి పారిపోయారు. దాదాపు 21 జిల్లాల్లో ఇటువంటి పరిస్థితి కొనసాగుతున్న విషయం మానవ హక్కుల సంఘాలకు అందిన వివరాలను బట్టి తెలుస్తున్నది. సౌరాష్ట్ర ప్రాంతంలో ఇలాంటి అత్యాచారాలకు లెక్కేలేదు. కానీ ఎక్కడా రికార్డు కూడా కావు. గుజరాత్ ఉత్తర ప్రాంతమైన సౌరాష్ట్రలో దళిత మహిళలకు రక్షణ లేదు. స్త్రీలను బహిరంగంగానే చెరపట్టే దుర్మార్గాలు ఆ ప్రాంతంలోని జునాగఢ్ జిల్లాలో సాగుతున్నాయి. ఇది వింటే గుజరాత్ అభివృద్ధి మంత్రం మాయాజాలం మాటున కొట్టుకుపోతోన్న అరాచకాలు అర్థం అవుతాయి.

విద్య దగ్గరా వివక్షే

గుజరాత్ అభివృద్ధి నమూనాను ప్రభుత్వాలు హద్దులు దాటి ప్రచారం చేశాయి. దాని అసలు స్వరూపం అనేకసార్లు బహిర్గతమైంది. అక్కడి దళితుల్లో ఇసుమంతైనా అభివృద్ధి లేదు. ఒక్క భూముల విషయంలోనే కాదు, అన్ని విషయాల్లో వారు నిలువుదోపిడీకి గురవుతున్నారు. విద్యాలయాల్లో అంతులేని వివక్ష. దళిత విద్యార్థులను వెనుకవరుసలో కూర్చోబెడుతున్న దారుణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటీవలే ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయం జరిపిన సర్వేలో ఈ దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడయ్యాయి. భానూ భాయి వంకార్ భూమికోసం జరిపిన పోరాట ప్రాంతమైన సెమి తాలూకాలో సహపూర్ గ్రామంలో వందమంది దళిత విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతి తరగతిలో మొదటి వరుస దళితేతర విద్యార్థులకు వదిలిపెట్టాలి. నీటి కుండలను, పాత్రలను దళిత విద్యార్థినీ విద్యార్థులు తాకకూడదు. దళితేతర విద్యార్థులు గానీ, ఉపాధ్యాయులుగానీ వచ్చేవరకు వేచి ఉండాలి. అందుకు భిన్నంగా జరిగితే పరిణామాలెలా ఉంటాయో దళిత విద్యార్థులకు తెలుసు. గుజరాత్‌లో దళితులపై భౌతికదాడులు తీవ్రస్థాయిలో ఉన్నాయి. దేశంలోని 26 రాష్ట్రాల్లో దళితుల అత్యాచారాల జాబితాలో గుజరాత్ మొదటి నుంచి ఐదవ స్థానాన్ని ఆక్రమించడాన్ని బట్టి పరిస్థితి తీవ్రతను అంచనా వేయవచ్చు. అయితే చాలా కేసులు నమోదు చేసుకోవడానికి అధికారులు అంగీకరించని వాస్తవాన్ని మాజీ శాసనసభ్యులు సిద్ధార్థ్ చెప్పారు. ఊనాలో జరిగిన గోరక్షకుల దాడిలాంటివి ప్రతిచోటా జరుగుతున్నా వెలుగులోకి వచ్చేవి అతికొద్ది మాత్రమేనని ఆయన వెల్లడించారు. పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో చాలా వాటిలో నిందితులకు శిక్షలు కూడా పడవని ఆ రోజు ధర్నాలో పాల్గొన్న వక్తలు స్పష్టం చేశారు.

గత ఇరవై సంవత్సరాల బీజేపీ పాలనలో దళితులు మరింత అభద్రతా భావంలో మునిగిపోయారు. ఆధిపత్య కులాల దాడులను, అత్యాచారాలను కొన్ని రాష్ట్రాలు సీరియస్‌గా తీసుకుంటున్నాయి. కానీ గుజరాత్‌లో మంత్రులు, అధికారులు ఆధిపత్య కులాలకు వంతపాడుతున్నారు. దానికి తోడు గోసంరక్షణ పేరుతో ప్రతి గ్రామంలో దళితులను, ముస్లింలను నేరస్తులుగా చూస్తున్న పరిస్థితి. రెండో వైపు సంక్షేమ కార్యక్రమాల అమలు గానీ, అభివృద్ధిలో భాగస్వామ్యంగానీ రెండూ దళితులకు లేవు. దళితుల కోసం కేటాయిస్తున్న నిధులకు చట్టబద్ధత లేదు. పైగా వనరులన్నీ కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం ధారాదత్తం చేస్తోంది. ఈ పరిణామాలతో ప్రభుత్వాలు తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాయనే భావన దళితుల్లో పేరుకుపోయింది. వీటికి పరాకాష్ట భానూ భాయి బలిదానం. తర్వాత ప్రభుత్వాలు దళితుల డిమాండ్లను అంగీకరించినట్టు కనిపిస్తున్నప్పటికీ, దళితుల్లో మాత్రం విశ్వాసం కలగడంలేదు. గుజరాత్ దళితులకు కరువౌతోన్న రక్షణ, వారిపై జరుగుతున్న అఘాయిత్యాలు, అక్కడ అమలులో ఉన్న సామాజిక అంతరాలూ అంతిమంగా ప్రజల చైతన్యానికీ, తెగింపుకీ, తిరుగుబాటుకీ దారితీస్తాయనడంలో సందేహం అక్కర్లేదు.

–వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 97055 66213

అతిలోకసుందరి అంతర్ధానం

ఎబ్బెట్టుతనం లేని ఠీవయిన సౌందర్యం శ్రీదేవిది. నాటకాన్ని పండించడంలో ఏ గొప్ప నటుడితోనయినా దీటుగా నిలబడగల టైమింగ్. బాలనటి నుంచి ప్రౌఢ నటిగా సజావయిన పరిణామాన్ని దేశంలో చూపించిన ఒకే ఒక్క తార –శ్రీదేవి.



గొల్లపూడి మారుతిరావు

సినిమాల్లో పాత్ర ఇమేజ్‌ని మార్చుకోవడం చాలా కష్టం. ఒకప్పుడు అసాధ్యం కూడా. 'షోలే' సినిమాలో గబ్బర్ సింగ్ పాత్రను ధరించి కొన్ని సంవత్సరాల పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయిన గొప్ప నటుడు అంజాద్ ఖాన్ తన జీవితకాలంలో ఆ ఇమేజ్‌నుంచి బయటపడలేకపోయాడు.

'శంకరాభరణం'లో శంకరశాస్త్రి పాత్ర ద్వారా దేశస్థాయిలో ప్రాముఖ్యాన్ని సాధించిన జె.వి. సోమయాజులుగారు ఇక మరే పాత్రలోను వేరేగా రాణించలేకపోయారు. కృష్ణగారి 'అల్లూరి సీతారామ రాజు'ని చూశాక చక్రపాణి గారు.'ఇంక ఓ సంవత్సరం పాటు నీ చిత్రాలన్నీ ఫ్లాఫ్ అవుతాయి' అన్నారట. తర్వాత 20 సినిమాలు వరసగా లేచి పోయాయని కృష్ణగారే మాకు చెప్పేవారు. ఇది శ్రుతి మించిన గొప్ప ప్రాచుర్యానికి పట్టే అనర్థం. పాత్ర ఇమేజ్ ఏనాడు తలకు మించిపోరాదు. నాకూ అలాంటి గతి పట్టేదే. 'ఇంట్లో రామయ్య–వీధిలో కృష్ణయ్య' 500 రోజులు నడిచి సుబ్బారావు పాత్ర దుమ్ము దులిపింది. అదే ప్రమాదం.

శ్రీదేవి బాలనటిగా ముద్దుగా , అమాయకంగా, అయినా చిలిపిగా ఊలుపిల్లిలాగ ఉండేది. ఆమె మీద ఆమె నటన మీద నిర్మాతల 'విశ్వాసం' ఎంతటిదంటే 'బడిపంతులు'లో ఆమె మీద పూర్తి పాటనే తీశారు. ఏ పాత్రలోనయినా ఆమె పసితనం ఆమె నటనకి పెద్ద ఇన్సులేషన్. తీరా ప్రౌఢ వయస్సు వచ్చాక ఆమె కేరీర్ ఏమిటీ? సెక్స్, చిన్న వగలు, మురిపించే యవ్వనం–ఇవన్నీ హీరోయిన్ల పెట్టుబడి. హఠాత్తుగా ఈ మూసలోకి శ్రీదేవి రాగలదా? ఆ సంధి కాలంలో ఆమె మొదటిసారిగా హీరోయిన్‌గా చేసిన సినిమాని నేను రాశాను. శక్తి సామంత 'అనురాగ్' అనే చిత్రాన్ని నిర్మించాడు. మౌసమీ చటర్జీ హీరోయిన్. ఆమెకి అది మొదటి సినిమా. ఆ పాత్రని తెలుగులో శ్రీదేవి చేసింది. సినిమా పేరు 'అనురాగాలు'. మిత్రుడు పి.యస్.రామిరెడ్డి దర్శకుడు. శ్రీదేవి తన శరీరంలో, వయస్సులో పరిణామాన్ని ప్రదర్శించాలని ప్రయత్నం చేసింది. ఆమె ప్రతిభ. కథలో పాత్ర ఆమెని కాపాడాయి. అయినా చిత్రం బాగా పోలేదు.

పాత ఇమేజ్‌ని ఆమె మరిపించగలదా? నిన్నటి పసిపిల్ల నేటి ప్రౌఢ అని ఒప్పించగలదా? విచిత్రం! ఒప్పించింది. ఎబ్బెట్టుతనం లేని ఠీవయిన సౌందర్యం శ్రీదేవిది. నాటకాన్ని పండించడంలో ఏ గొప్ప నటుడితోనయినా దీటుగా నిలబడగల టైమింగ్. బాలనటి నుంచి ప్రౌఢనటిగా సజావయిన పరిణామాన్ని భారత దేశంలో చూపించిన ఒకే ఒక్క తార –నాకు తెలిసి –శ్రీదేవి. అలాంటి పని మరొక్కరే– అంతే ప్రొఫెషనల్‌గా చేశారు. 'కళత్తూర్ కన్నమ్మ'తో కెరీర్ ప్రారంభించి 'విశ్వరూపం' దాకా తనదైన జీనియస్‌ని చూపిన నటుడు కమల్‌హాసన్. మరి వీరిద్దరూ ఒకే సినిమాలో కలిస్తే? ఆ

జీవన కాలమ్



వైభవాన్ని చరితార్థం చేసిన సందర్భం బాలూ మహేంద్ర ''మూంద్రాం పిరై''. అపూర్వం. అద్భుతం. నేను మిత్రులు కమల్‌తో ఒకసారి అన్నాను: ''మీరు ఆ సినిమాలో చూపిన వైదుష్యం ఏ సినిమాలో ఏ పాత్రలోనయినా అవలీలగా చూపగలరు. ఇది హీరో ప్రాధాన్య ప్రపంచం కనుక. కాని హీరోయిన్‌కి అంత రేంజ్ ఉన్న పాత్ర దొరకదు. ఆమె నటన నభూతో నభవిష్యతి. నేనయితే మీకు జాతీయ ఉత్తమ నటుడి బహుమతి ఇవ్వను. ఆమెకి జాతీయ బహుమతి – రెండు సార్లు ఇస్తానని.''

మేమిద్దరం తక్కువ సినిమాల్లో కలిసి నటించాం. కాని మంచి జ్ఞాపకం– 'త్రిశూలం'లో నా కూతురు. ఎదురెదురుగా నిలిచి counter shot చేస్తున్నప్పుడు – 'మీరు బాగున్నారా?' అనే వాక్యాన్ని పదిమంది నటీమణులు పది రకాలుగా చెప్తారు. ఆమె తప్పనిసరిగా పదకొండో రకంగా చెబుతుంది. ఇంతకంటే రాతలో ఈ విషయాన్ని నిరూపించలేను.

'త్రిశూలం'లో ఒక సీను గొప్పది. ఈ సీనుని కోరి రాఘవేంద్రరావు నాచేత రాయించారు. రాధిక మా యింట్లో పనిమనిషి. అవసరానికి డబ్బుకోసం వస్తుంది. ధాన్యం గోదాంకి రమ్మన్నాడు హిట్లర్ రాఘవయ్య. తను వచ్చాడు. ఆమెను పట్టుకోబోగా తప్పించుకుని గోదాంలోకి పారిపోయింది. ఇచ్చకాలు చెప్పి పైకి రమ్మని చెయ్యి జాచాడు. ఆడపిల్ల చెయ్యి అందింది. లాగాడు. తన ముందుకు కూతురు శ్రీదేవి వచ్చింది. బిక్కచచ్చిపోయాడు. అప్పుడు డైలాగు– శ్రీదేవిది–:''ఏం నాన్నా! నేనూ యాదీ (రాధిక) చిన్నప్పట్నుంచి నీ కళ్ల ముందే పెరిగాం. యాదిలో నువ్వు కేవలం ఆడదాన్ని చూడగలిగితే నేనూ ఆడదాన్నే కద నాన్నా?''

ఆ డైలాగు అనితరసాధ్యంగా చెప్పింది శ్రీదేవి.

రాఘవేంద్రరావు, విన్సెంట్‌వంటి మంత్రగాళ్లుండగా ఎవరయినా అలవోకగా ' అతిలోక సుందరి' పాత్రని చెయ్యగలరు. కాని 'మూంద్రా పిరై' శ్రీదేవి ఒక్కరే చెయ్యగలరు.

ఇక డాన్స్ టైమింగ్. పరాకాష్ట 'మిష్టర్ ఇండియాలో' 'హవా హవాయీ' పాట. దయచేసి ఈ దృష్టితో మరొకసారి చూడండి. మంచి వంకాయకూర అతిథిగా తినడం వేరు. వంటవాడుగా తినడం వేరు. ఒక్కసారి వంటవాడు కాండి.

శ్రీదేవి ఈ తరం ప్రతిభకు పరాకాష్ట .
''last word. she is the ultimate complete artist''

సదాచరణకు స్ఫూర్తి

పేదవాడిని ప్రేమించడమే పెరుమాళ్లను సేవించడమని ఆయన మనసా వాచా నమ్మారు. అందుకే మఠం సొమ్ముతో కంచి కామకోటి ఆస్పత్రులు, నేత్ర వైద్యశాలలు, నామమాత్రంగా రుసుము తీసుకునే విద్యాసంస్థలు నెలకొల్పారు.



నివాళి

సనాతన ధర్మాన్ని నిలబెట్టడం కోసం జగద్గురు ఆది శంకరాచార్య స్థాపించి, స్వయంగా వారే ఆధిపత్యం వహించిన కంచి పీఠం ఎంతో విశిష్టమైనది. ఆ పరంపరలో 68వ పీఠాధిపతిగా అందరినీ తరింప చేసిన పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారు సాక్షాత్తూ భూమిపైకి దిగివచ్చిన శంకరులుగా, నడిచే దైవంగా, త్రికాలజ్ఞులుగా అందరికీ తెలుసు.

మత సంప్రదాయాన్ని అనుసరించి, ఆయన జీవించి ఉండగానే, ఆయన సంకల్పంతో, తన తరువాతి పీఠాధిపతిగా వారసులుగా నియమితు లయ్యారు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామి. ఆ కంచిమఠ ప్రాధాన్యాన్ని నిలబెడుతూ మనందరికీ మార్గదర్శకులు అయ్యారు. అయితే ఆయన మహిమలేమీ చూపలేదు. మాయలూ చేయలేదు. కానీ ఆచరించదగ్గ మంచి మాటలెన్నో చెప్పారు. వాటిలో కొన్నింటిని మననం చేసుకుందాం...

తల్లిదండ్రులు చిన్నప్పుడు పిల్లలకు నేర్పిందే వారికి జీవితాంతం ఉంటుంది. పిల్లలను ప్రేమించడం అంటే వారికి ఏ కష్టమూ రాకుండా చూసుకోవడం కాదు, కష్టం వచ్చినప్పుడు దానిని అధిగమించడం ఎలాగో నేర్పడం. వారికి బాల్యం నుంచి రామాయణ భారత భాగవత కథలు చెబుతూ, అందులోని నీతిని, ధర్మాన్ని, న్యాయాన్ని నేర్చుకునేలా చేయి. ఎలా బతకాలో, ఎలా బతకకూడదో, పొరుగువారిని ప్రేమించడం ఎలాగో నేర్పు...

నీకేదో నాలుగు అక్షరం ముక్కలు వచ్చినాయని గర్వ పడటం కాదు, నీకు తెలిసిన విద్యను, నీ సంస్కారాన్ని వారు నేర్చుకునేలా చేయాలి. కాబట్టి ముందు నువ్వు మంచి ప్రవర్తనతో మెలుగు అనేవారు. అదేవిధంగా నువ్వు పూజా పురస్కారాలు చేయడం కాదు, నీ కుమారుడికి నేర్పు, నీవు రుచికరమైన వంటలు చేయడం కాదు, నీ కుమార్తెకు మంచి మంచి వంటకాలు చేయడం నేర్పించు. మన సంస్కృతిలోని గొప్పదనాన్ని వారంతట వారే తెలుసుకునేలా చేయి. ధనం సంపాదించడం ఒక్కటే కాదు, నీతి నిజాయితీలతో జీవించగలిగే ఇంధనాన్ని వారి జీవన ప్రయాణంలో నింపు అని చెప్పేవారు తన వద్దకొచ్చిన వారితో.

అయితే, ఎన్ని మంచి మాటలు చెప్పినా, సమాజానికి వారు ఎంత సేవ చేసినా, వారిపైన కూడా కొన్ని నీలినీడలు, అపవాదులు, అభియోగాలు ఉన్నాయి. మాయలో ఉన్న ప్రకృతిలో కలిప్రభావంతో వచ్చే అపవాదులవంటి వాటిని సహనంతో తట్టుకొని, దైవశక్తితో నిష్కళంకులై, ధర్మప్రబోధానికి ప్రత్యక్షసాక్షులు అయ్యారు! వారు సిద్ధిపొంది, భౌతిక కాయాన్ని విడిచినా, ఆ దైవశక్తి పరంపరగా కొనసాగుతుంది.

ఆదిశంకరులు మనకందించిన ధర్మాచరణ విధానం, అద్వైత మత ఆచరణ – ఆ కంచి పీఠం ద్వారా, శ్రీశ్రీశ్రీ విజయేంద్ర ఇందిరా సరస్వతీ మార్గదర్శనంలో మనం పనిచేస్తాము. శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామి మన మధ్యలో భౌతికంగా లేకపోయినా, పరంపరాగత శక్తి మనకి మార్గదర్శనం చేస్తూ ఉంటుంది.

అనంతానికి ఎంత కలసినా అనంతమే!

అనంతంలో నుంచీ ఎంత తీసేసినా అనంతమే! మానవాళి కోసం, విశ్వ శాంతి కోసం ఆచార్యుల వారు చేసిన కృషి అనన్య సామాన్యమైనది. పేదవాడిని ప్రేమించడమే పెరుమాళ్లను సేవించడమని మనసా వాచా నమ్మిన వారాయన. అందుకే మఠం సొమ్ముతో మఠం పేరుతో కంచి కామకోటి ఆస్పత్రులు, నేత్ర వైద్యశాలలు, నామమాత్రంగా రుసుము తీసుకునే విద్యాసంస్థలు నెలకొల్పారు. ఆయన చేసిన మహా మంచి పనులకు లెక్క కట్టటం కూడా కష్టసాధ్యమైనదే నడం అతిశయోక్తి కాదు..

సామాన్యుల నుంచి అసాధారణమైన వారి వరకు ఆయనకు పాదాభివందనం చేయటం కోసం వేచి ఉండేవారు. అలాంటి ఒక ఉత్తమోత్తములకు, శిఖరాగ్రం అయినటువంటి మహా మనీషికి ఎవరు ఎంతటి మర్యాద ఇచ్చినా ఇవ్వకపోయినా, ఆయన విలువ మాత్రం ఎపుడూ అలానే నిలిచి ఉంటుంది.. అది ఆచంద్ర తారార్కం.. అలాంటి ఒక గురుతుల్యులకు, భగవత్సమానులకు అంజలి ఘటిస్తూ దేశం యావత్తూ కన్నీటి వీడ్కోలు సమర్పిస్తోంది.

–డి.వి.ఆర్.భాస్కర్



అంతిమ యాత్రకు హాజరైన అభిమానులు...

అభిమాన లోకం.. కన్నీటి శోకం

అశ్రునయనాల మధ్య శ్రీదేవి అంత్యక్రియలు

ముంబై విలేపార్లే శ్మశానవాటికలో చితికి నిప్పంటించిన భర్త బోనీకపూర్

తరలివచ్చిన సినీ తారలు.. కడసారి చూసేందుకు బారులు తీరిన అభిమానులు

సాక్షి, ముంబై

సినీలోకం మూగబోయింది. అభిమానం అశ్రుధారలైంది. గుండెగొంతులో గూడు కట్టుకున్న దుఃఖం కట్టలు తెగింది. ముంబై దారులన్నీ కన్నీటి వరదలయ్యాయి! లక్షలాది అభిమానులు వెంటరాగా దేవకన్య శ్రీదేవి దివికేగింది. బుధవారం సాయంత్రం ముంబై విలేపార్లేలోని శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం శ్రీదేవి(54) అంత్యక్రియలు పూర్తయ్యాయి. భర్త బోనీకపూర్ చితికి నిప్పంటించారు. ఆ సమయంలో ఇద్దరు కూతుళ్లు జాహ్నవి, ఖుషిలు తండ్రి పక్కనే ఉన్నారు. అంతకుముందు సెలబ్రేషన్స్ క్లబ్ నుంచి తెల్లని పూలతో అలంకరించిన వాహనంపై శ్రీదేవి పార్థివదేహాన్ని శ్మశానానికి తీసుకొచ్చారు. ఆమెను కడసారి చూసేందుకు దారిపొడగునా అభిమానులు బారులుతీరారు. విలేపార్లే శ్మశానవాటికకు కుటుంబీకులు, సన్నిహితులు, పలువురు సినీతారలు మాత్రమే హాజరయ్యారు. అభిమానుల తాకిడి ఎక్కువకావటంతో షారుక్‌ఖాన్, సోనమ్ కపూర్ తదితరులు తమ వాహనాన్ని దూరంగా నిలిపేసి నడుస్తూ శ్మశాన వాటికకు చేరుకున్నారు.

ఆ దారి.. అభిమాన సంద్రం

అంతిమయాత్ర అనుకున్న సమయానికన్నా కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ నుంచి ఈ యాత్ర మొదలైంది. త్రివర్ణ పతాకం కప్పిన శ్రీదేవి భౌతికకాయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వాహనం ముందు, వెనుక శ్రీదేవి ఫొటోలను ఉంచారు. భర్త బోనీకపూర్, ఇద్దరు పిల్లలు, ఇంకొందరు కపూర్ కుటుంబీకులు భౌతికకాయంతో వాహనంలో ఉండగా.. మిగిలిన వారంతా కార్లలో శ్మశానవాటికకు చేరుకున్నారు. శ్రీదేవిని చివరిసారి చూసేందుకు అభిమానులు రోడ్డుకు ఇరువైపులా పెద్దఎత్తున బారులు తీరడంతో వారిని అదుపు చేయడం పోలీసులకు కష్టంగా మారింది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ప్రారంభమైన అంతిమ యాత్ర సాయంత్రం 4 గంటలకు శ్మశానవాటికకు చేరుకుంది. ఉదయమే క్లబ్ వద్ద అభిమానులను అదుపు చేసేందుకు 200 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్విగ్న క్షణాలు..

సెలబ్రేషన్ క్లబ్‌లో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. హాల్ మధ్యలో పూలతో అలంకరించిన టేబుల్‌పై శ్రీదేవి పార్థివదేహాన్ని ఉంచారు. ఓవైపు వీఐపీల కోసం మరోవైపు అభిమానుల కోసం బారికేడ్లు కట్టారు. బాక్స్‌కు ముందు ఓ ఫొటో పెట్టి దాని ముందు దీపం ఉంచారు. గదిలో ఓ మూల నిలబడ్డ బోనీ కపూర్‌ను, జాహ్నవి, ఖుషిలను సినీ, రాజకీయ రంగ ప్రముఖులు ఓదార్చారు. బాలీవుడ్ ఫ్యాషన్ డిజైనర్ మనీశ్ మల్హోత్రా బోరున విలపించటంతో.. పక్కనే ఉన్న కరణ్ జోహార్ ఆయన్ను ఓదార్చారు. రాణీ ముఖర్జీ చాలాసేపు భౌతికకాయం వద్దే కూర్చున్నారు. రోదిస్తున్న సోనమ్ కపూర్‌ను ఓదార్చారు. సినీ ప్రముఖులంతా ఉబికి వస్తున్న కన్నీరును ఆపుకుంటూ.. బోనీ, పిల్లలకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. 'శ్రీదేవిని కడసారి చూసొచ్చాను. సినీ పరిశ్రమ అంతా మౌనంగా రోదిస్తోంది. అదే శ్రీదేవి గొప్పదనం. అందమైన ఎర్రని చీరలో ప్రశాంతంగా ఆమె పడుకుని ఉంది'అని హేమమాలిని ట్వీట్ చేశారు.

అభిమానుల నిరాశ

ఉదయం నుంచే క్లబ్ ముందు పెద్దసంఖ్యలో అభిమానులు వేచి ఉన్నా.. 10 గంటల సమయంలో వీరిని లోపలకు అనుమతించారు. అయితే భారీగా తరలిరావడంతో కొంద రికే ఆఖరిచూపు దక్కింది. తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్‌లతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి అభిమానులు చివరి చూపు కోసం వచ్చారు. వీఐపీలు వచ్చినపుడల్లా అభిమానుల క్యూను ఆపేశారు. దీంతో చాలా మందికి లోపలకు వెళ్లే అవకాశం రాలేదు. శ్రీదేవి అంతిమయాత్ర వాహనాన్ని కూడా మూడువైపుల నుంచి మూసేశారు. ఆమెను చివరిసారిగా చూసేందుకు అభిమానులు చెట్లు ఎక్కారు. పక్కనున్న భవంతులపైకి చేరారు. ఫుట్‌ఓవర్‌పై నిలుచుని మరీ ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బాక్సులో పెట్టడం, పువ్వులతో పెట్టను, వాహనాన్ని కప్పడంతో వారికి ఆమె ముఖం కనిపించలేదు. ఎక్కడ్నుంచో వచ్చినా చివరిచూపు దక్కలేదని వారంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.

ఎర్రని చీర.. నుదుట తిలకం..

మంగళవారం రాత్రంతా శ్రీదేవి నివాసం గ్రీన్‌ఏకర్స్‌లోనే ఉన్న శ్రీదేవి భౌతికకాయాన్ని.. బుధవారం ఉదయం 9 గంటలకు సెలబ్రేషన్ క్లబ్‌కు తరలించారు. శ్రీదేవికి ఇష్టమైన ఎరుపురంగు కాంచీవరం చీరతో మృతదేహాన్ని చుట్టారు. సెల బ్రేషన్ క్లబ్‌లో బోనీ, జాహ్నవి, ఖుషి, అనిల్ కపూర్, సంజయ్‌కపూర్, మేన ల్లుడు హర్షవర్ధన్ కపూర్, కోడలు సోనమ్, రేఖ కపూర్‌లు భౌతికకాయం వద్ద ఉన్నారు. ఇక్కడ సినీరంగ ప్రముఖులు, అభిమానులు నివాళులర్పిం చిన తర్వాత మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ప్రభుత్వ లాంఛనాలతో శ్రీదేవికి నివాళులర్పించారు. పార్థివ దేహంపై త్రివర్ణ పతాకం కప్పిన అనంతరం గన్ సెల్యూట్ చేశారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత అంతిమయాత్ర ప్రారంభమైంది.

దిగివచ్చిన తారాలోకం..

శ్రీదేవికి చివరి వీడ్కోలు పలికేందుకు తారాలోకం దిగివచ్చింది. హిందీ, తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ సినీరంగాలకు చెందిన ప్రముఖులు తరలి వచ్చారు. అమితాబ్ బచ్చన్, షారుక్‌ఖాన్, చిరంజీవి, రజనీకాంత్, కమల్‌హాసన్, నాగార్జున, వెంకటేశ్, సంజయ్ కపూర్, హేమామాలిని, రేఖ, జయాబచ్చన్, ఐశ్వర్యరాయ్, మాధురీ దీక్షిత్, నగ్మా, సారికా, దీపికా పదుకొనే, రాకేశ్ రోషన్, సంజయ్‌ఖాన్, సురేశ్ ఒబెరాయ్, వివేక్ ఒబెరాయ్, షబానా ఆజ్మీ, జావేద్ అఖ్తర్, అనుపమ్ ఖేర్, సుస్మితా సేన్, సోనంకపూర్, కాజోల్, అజయ్ దేవగన్, టబూ, జయప్రద, సంజయ్‌ఖాన్, అక్షయ్ ఖన్నాతో పాటు పలు పార్టీల ప్రముఖులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

ప్రశాంతంగా నిద్రపోతున్నట్లున్నారు

భారత అధికారులు శ్రీదేవి పాస్‌పోర్టును రద్దుచేసి ఇతర దస్తావేజులను సిద్ధం చేస్తుండగానే.. పోలీస్ క్లియరెన్స్ కావా లంటూ జర్నలిస్టులు, అధికారులు, పలువురు స్థానిక భారతీయులు అశ్రఫ్‌కు ఫోన్ చేశారు. క్లియరెన్స్ తెచ్చిన తర్వాత దుబాయ్ సమీపంలోని ప్రభుత్వ మార్చురీకి చేరుకుని ఎంబామింగ్ ప్రక్రియ త్వరగా జరిగేలా చొరవ తీసుకున్నారు. అక్కడ అధికారులు శ్రీదేవితోపాటు మరో ముగ్గురి ఎంబామింగ్‌కు సంబంధించిన పత్రాలను అశ్రఫ్‌కు అందించారు. ఎంబామింగ్ సర్టిఫికెట్ అశ్రఫ్ పేరుతోనే జారీ కావడం గమనార్హం. అక్కడినుంచి మృతదేహాన్ని ఎయిర్‌పోర్టుకు తరలించి ప్రత్యేక విమానంలో ముంబైకి తీసుకొచ్చారు. ఇదంతా పూర్తయ్యాక అశ్రఫ్ తన ఇంటికెళ్లాడు. ''పెద్దల ఆశీర్వాదంతోనే ఈ పనిచేస్తున్నా. విదేశీయులు ఎవరైనా చనిపోతే వారి మృతదేహాన్ని తరలించేందుకు ఏమేం చేయాలో చాలా మందికి తెలియదు. అలాంటి వారందరికీ నేను సాయం చేస్తా' అని అశ్రఫ్ పేర్కొన్నారు. ''శ్రీదేవి ప్రశాంతంగా నిద్రపోతున్నట్లే ఉన్నారు. నిద్రపోతున్న అందాల రాణిలా..''అని ఆయన తెలిపారు. సినిమాల్లో ఉన్నట్లుగానే ఆమె కనిపించారని.. ముఖంపై ఎలాంటి గాయాలూ లేవని వెల్లడించారు.

భారతీయుడి సాయంతో..

శ్రీదేవి భౌతికకాయం తరలింపులో అశ్రఫ్ చొరవ

శ్రీదేవి భౌతికకాయం దుబాయ్ నుంచి స్వదేశానికి తిరిగిరావటంలో అక్కడ స్థిరపడిన ఓ భారతీయుడు సాయం చేశారు. ఆయన పేరు అశ్రఫ్ షెర్రీ తమరసెరీ. 44 ఏళ్ల ఈయన కేరళ నుంచి వచ్చి దుబాయ్‌లో స్థిరపడ్డాడు. యూఏఈలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపటాన్ని కర్తవ్యంగా భావిస్తారు. ఈయన అసలు వృత్తి మెకానిక్. దుబాయ్‌కి 35 కిలోమీటర్ల దూరంలోని ఓ ప్రాంతంలో ఈయనకు మెకానిక్ షెడ్ ఉంది. మృతదేహాలను స్వస్థలాలకు పంపేందుకు.. అక్కడి చట్టాలకు అనుగుణంగా అవసరమైన పద్ధతులన్నీ దగ్గరుండి పూర్తి చేస్తారు. పనికోసం వెళ్లి ప్రాణాలు పోగొట్టుకున్న కార్మికుల దగ్గర్నుంచి ప్రముఖుల వరకు అందరికీ ఈయన సాయం చేస్తారు. 18 ఏళ్లుగా 38 దేశాలకు చెందిన 4,700 మృతదేహాలను వారివారి దేశాలకు పంపిచారు అశ్రఫ్. అందుకే అక్కడి అధికారులకు, యూఏఈలో ఉండే విదేశీయులకు అశ్రఫ్ అంటే విపరీతమైన గౌరవం. శ్రీదేవి భౌతికకాయాన్ని భారత్‌కు తరలించిన రోజే ఈయన.. మరో ఐదు పార్థివ దేహాలనూ వేర్వేరు దేశాలకు పంపించారు. ఆయన్ను స్థానికులంతా 'ఫ్రెండ్ ఆఫ్ డెడ్'అని పిలుస్తారు.


శ్రీదేవి భౌతికకాయం..


విషణ్న వదనంతో బోనీ కపూర్, జాన్వీ కపూర్


శ్రీదేవి పార్థివ దేహం వద్ద బోనీ సోదరుడు అనిల్, తనయుడు అర్జున్

నివాళులర్పించిన ప్రముఖులు..


మెగాస్టార్ చిరంజీవి, అశ్వనీదత్, షారుక్‌ఖాన్


జయాబచ్చన్, ఐశ్వర్యరాయ్, మాధురీ దీక్షిత్ దంపతులు

ప్రపంచానికి చాందినీ.. నాకు సర్వస్వం

ట్వీటర్‌లో బోనీ కపూర్

ముంబై: 'ఆమె ఈ ప్రపంచానికి చాందినీ.. నాకు మాత్రం ఆమే సర్వస్వం.. నా ప్రేమ. ఆమె లేని లోటు మాటల్లో వర్ణించలేను' అని శ్రీదేవి భర్త బోనీ కపూర్ ట్వీట్ చేశారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం శ్రీదేవి ట్వీటర్ ఖాతా నుంచి ఆయన ట్వీట్ చేశారు. 'ఈ బాధాకర సమయంలో అర్జున్, అన్షుల నా వెంట నిలబడి.. నాకు, జాన్వి, ఖుషికి ధైర్యాన్నిచ్చారు' అని ట్వీట్ చేశారు. తన ఇద్దరు కూతుళ్లు జాన్వి, ఖుషిలను జాగ్రత్తగా చూసుకోవడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. సినీ తారల జీవితానికి తెర పడదని, వెండితెరపై వారెప్పుడూ సజీవంగానే ఉంటారని పేర్కొన్నారు.


శ్రీదేవి అంత్యక్రియలు.. హాజరైన అమితాబ్


రజనీకాంత్


వెంకటేశ్, జయప్రద, దీపికా పదుకొనే


శ్రీదేవి కడసారి చూపు కోసం బారులు తీరిన అభిమాన జనం..

కార్తీ చిదంబరం అరెస్టు

లండన్ నుంచి రాగానే చెన్నై విమానాశ్రయంలో...

ఐఎన్‌ఎక్స్ మీడియా ముడుపులపై విచారించనున్న సీబీఐ

చిదంబరంను కూడా కలిశాం: 'ఐఎన్‌ఎక్స్' డైరెక్టర్లు ఇంద్రాణి, పీటర్ ముఖర్జీ

న్యూఢిల్లీ

అవినీతి కేసులో కేంద్ర మాజీ ఆర్థికమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కొడుకు కార్తీని సీబీఐ బుధవారం చెన్నైలో అరెస్టు చేసింది. మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఈడీ విచారణకు హాజరయ్యేందుకు లండన్ నుంచి భారత్‌కు వచ్చిన కార్తీని చెన్నై విమానాశ్రయంలోనే సీబీఐ అదుపులోకి తీసుకుంది. అనంతరం ఢిల్లీకి తీసుకెళ్లి, అక్కడి కోర్టులో హాజరుపరిచింది. ఐఎన్‌ఎక్స్ మీడియా నుంచి కోట్ల రూపాయల మేర ముడుపులు అందుకున్న కేసులో కార్తీని ప్రశ్నించేందుకు 15 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరగా.. ఒకరోజు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు మళ్లీ కోర్టులో హాజరుపర్చాలంది. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కార్తీని అరెస్ట్ చేశారని కాంగ్రెస్ ఆరోపించగా.. ఇందులో ప్రభుత్వ జోక్యం ఏదీ లేదని, చట్ట ప్రకారమే దర్యాప్తు సంస్థలు పని చేస్తున్నాయని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. అయితే, ఈ ముడుపుల వ్యవహారానికి సంబంధించి నాటి ఆర్థిక మంత్రి చిదంబరంను కూడా కలిశామని అప్పటి ఐఎన్‌ఎక్స్ డైరెక్టర్లు ఇంద్రాణి ముఖర్జీ, ఆమె భర్త పీటర్ ముఖర్జీ సీబీఐ, ఈడీల విచారణలో వెల్లడించడం సంచలనం రేపుతోంది.

విచారణకు సహకరించడం లేదనే..

విచారణకు సహకరించకపోవడం వల్లనే కార్తీని అరెస్ట్ చేయాల్సి వచ్చిందని సీబీఐ స్పష్టం చేసింది. అలాగే, ఆయన పలుమార్లు విదేశాలకు వెళ్తుండటంతో అక్కడి బ్యాంకుల్లోని సాక్ష్యాధారాలను నాశనం చేసే అవకాశం ఉందంది. విచారణకు హాజరవకుండా పూర్తిగా విదేశాల్లోనే ఉండిపోయే పరిస్థితి కూడా ఉందని, అందువల్లనే అదుపులోకి తీసుకుని విచారిస్తామని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఈ వాదనను కార్తీ తరఫు న్యాయవాది తోసిపుచ్చారు. గతంలోనే ఎన్నోసార్లు సీబీఐ, ఈడీలు కార్తీని విచారించాయనీ, ఇప్పుడు కూడా ఈడీ విచారణకు హాజరవ్వడానికే ఆయన భారత్ వచ్చారని కోర్టుకు తెలిపారు. ఆయన అరెస్టుకు సరైన కారణాలే లేవన్నారు. కాగా, ఐఎన్‌ఎక్స్ మీడియా కేసుతోపాటు 2006లో ఎయిర్‌సెల్–మ్యాక్సిస్ ఒప్పందానికి ఎఫ్ఐపీబీ (విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి) అనుమతులపై కూడా సీబీఐ విచారిస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా మనీలాండరింగ్ కేసులో కార్తీని ఇప్పటికే పలుమార్లు ప్రశ్నించింది.

రాజకీయ కక్షతోనే..

రాజకీయ కక్షతోనే బీజేపీ ప్రభుత్వం కార్తీని అరెస్టు చేయించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్డీయే హయాంలో వెలుగుచూస్తున్న కుంభకోణాలు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఎత్తుగడ వేసిందంది. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు చెప్పడాన్ని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని ఇలాంటి చర్యలతో ఆపలేరని ఆ పార్టీ నేత రణదీప్ సుర్జేవాలా అన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేయడానికి బీభత్సంగా మాటలను వాడే ప్రధాని మోదీ.. గత 10 రోజుల్లో బీజేపీ హయాంలో రూ. 30 వేల కోట్ల కుంభకోణాలు బయటపడినా నోరు తెరవడం లేదన్నారు. 'వేల కోట్లు ఎగ్గొట్టి దేశం నుంచి పారిపోయిన నీరవ్ మోదీ, విజయ్ మాల్యాను ప్రభుత్వం ఏం చేయదు. కేసు విచారణకు హాజరయ్యేందుకు విదేశం నుంచి తిరిగొచ్చిన కార్తీని అరెస్టు చేస్తుంది' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ విమర్శించారు.

ప్రభుత్వ జోక్యం లేదు..

కార్తీ చిదంబరం కేసులో ప్రభుత్వ జోక్యం ఏమీ లేదనీ, ఉండదని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. చట్టం ప్రకారమే దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయనీ ఆయన తప్పు చేశారో లేదో ఆధారాలే చెబుతాయని పేర్కొన్నారు.

కేసు విచారణకు రాకముందే..

సీబీఐ, ఈడీలు తప్పుడు కేసులతో తనను, తన కుటుంబ సభ్యులను తరచూ వేధిస్తున్నాయని, తమ ప్రాథమిక హక్కులను రక్షించాలని కోరుతూ చిదంబరం గతవారమే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దర్యాప్తు సంస్థలు తమపై 'అక్రమ విచారణలు' జరపకుండా అడ్డుకోవాలని ఆయన పిటిషన్‌లో కోరారు. అయితే సుప్రీంకోర్టులో చిదంబరం పిటిషన్ ఇంకా విచారణకు కూడా రాకముందే కార్తీని సీబీఐ అరెస్టు చేయడం గమనార్హం. మార్చి 1న విచారణకు హాజరుకావాలంటూ ఈడీ ఇచ్చిన నోటీసుపై స్టే విధించాలనీ, లేదా కనీసం విచారణను కొద్దికాలం వాయిదా వేయాలంటూ కార్తీ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ వేశారు. గతవారం ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కార్తీ తరఫున వాదిస్తున్న కపిల్ సిబల్ కూడా 'మీరు కార్తీని అరెస్టు చేయాలని అనుకుంటున్నారా?' అని దర్యాప్తు సంస్థలను ప్రశ్నించడం గమనార్హం.

ఏమిటీ ఐఎన్‌ఎక్స్ కేసు?

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసు 2007 మార్చిలో పి.చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నప్పటిది. కూతురి హత్యకేసులో నిందితులుగా ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న భార్యాభర్తలు ఇంద్రాణీ, పీటర్ ముఖర్జీల చేతుల్లో అప్పట్లో ఈ కంపెనీ ఉండేది. తమ కంపెనీలోకి 46 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను అనుమతించాలంటూ వారు.. ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో పనిచేసే విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ)కి దరఖాస్తు చేసుకున్నారు. రెండు నెలల అనంతరం ఎఫ్ఐపీబీ ఐఎన్‌ఎక్స్ మీడియాలో 46 శాతం ఎఫ్‌డీఐకి అనుమతినిచ్చింది. అయితే అప్పటికే 26 శాతం ఎఫ్‌డీఐలు ఐఎన్‌ఎక్స్‌లో ఉన్నాయి. ఆ విషయాన్ని ముఖర్జీలు ఎఫ్ఐపీబీ వద్ద దాచిపెట్టారు. పరిమితికి మించి రూ. 305 కోట్ల మేర విదేశీ పెట్టుబడులను తీసుకున్నారు. ఈ అవకతవకలను ఆదాయ పన్ను శాఖ గుర్తించి, ఆర్థిక శాఖను సైతం అప్రమత్తం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై ఈడీ సూచన మేరకు గతేడాది మే 15న సీబీఐ తొలి కేసును నమోదు చేసింది. ఆ తర్వాత జరిపిన సోదాల్లో తమకు పలు ఆధారాలు లభించాయని ఈడీ, సీబీఐలు చెబుతున్నాయి.



బుధవారం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టుకు హాజరవుతున్న కార్తీ చిదంబరం

తండ్రి మద్దతుతోనే..

2007లో ఐఎన్‌ఎక్స్ మీడియాలో విదేశీ పెట్టుబడులకు సంబంధించి ఎఫ్ఐపీబీ (విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి) అనుమతుల విషయంలో జరిగిన ఉల్లంఘనలను సరిచేసేందుకు కార్తీ తమ నుంచి పది లక్షల డాలర్లు తీసుకున్నట్లు ఐఎన్‌ఎక్స్ మీడియా మాజీ డైరెక్టర్లు పీటర్ ముఖర్జీ, ఇంద్రాణీ ముఖర్జీ ఇటీవల సీబీఐ విచారణలో బయటపెట్టారు. అందుకు అప్పుడు కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న తన తండ్రి పీ చిదంబరం సహకరిస్తారని కార్తీ చెప్పాడని వారు వెల్లడించారు. 'కార్తీ కోరిన 10 లక్షల డాలర్లలో 7 లక్షల డాలర్లను(రూ.3.10 కోట్లు) కార్తీకి విదేశాల్లోని ఆయన అనుబంధ సంస్థల ద్వారా అందించాం' అని ముఖర్జీలు మెజిస్ట్రేట్ ముందు ఇచ్చిన వాంగ్మూలంలోనూ స్పష్టం చేశారు. 'ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి రూ. 305 కోట్ల విదేశీ పెట్టుబడులను అక్రమంగా పొందాం. ఆ పెట్టుబడులను క్రమబద్ధీకరించేందుకు కార్తీని సంప్రదించాం. అనంతరం ఆయనకు చెందిన అడ్వాంటేజ్ స్ట్రాటెజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్(ఏఎస్‌సీపీఎల్), దాని అనుబంధ సంస్థలకు 7 లక్షల డాలర్లు(రూ. 3.10 కోట్లు) అందజేశాం. ఆ తరువాత మా ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి విదేశీ పెట్టుబడుల అంశానికి లైన్ క్లియరైంది' అని ఇంద్రాణి, పీటర్‌లు వెల్లడించినట్లుగా తన దర్యాప్తు నివేదికల్లో సీబీఐ, ఈడీ తెలిపాయి. అనుమతులివ్వవద్దంటూ ఆదాయ పన్ను శాఖ కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖకు సూచించిన విషయాన్ని కూడా సీబీఐ ప్రస్తావించింది.

చిదంబరంను అరెస్టు చేసే అవకాశం

సీబీఐ, ఈడీల విచారణలో మరో విషయాన్ని కూడా పీటర్, ఇంద్రాణి ముఖర్జీలు బయటపెట్టారు. అక్రమ లావాదేవీలను క్రమబద్ధం చేసుకునే క్రమంలో భాగంగా తాము అప్పటి ఆర్థికమంత్రి చిదంబరంను నార్త్‌బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో కలిశామని వెల్లడించారు. 'నా కుమారుడి వ్యాపారాలకు సహకరించండి. అందుకు విదేశీ నిధులందజేయండి' అని చిదంబరం తమను కోరారని దర్యాప్తు సంస్థలకు తెలిపారు. ఆ తరువాత తాము ఢిల్లీలోని పార్క్ హయత్ హోటల్లో కార్తీని కలిశామని, తమ పని చేసేందుకు ఆయన 10 లక్షల డాలర్లు కోరారని దర్యాప్తులో వెల్లడించారు. ఈ నేపథ్యంలో.. మాజీ కేంద్ర మంత్రి చిదంబరంను కూడా దర్యాప్తు సంస్థలు ప్రశ్నించే అవకాశముందని, అవసరమైతే అరెస్ట్ కూడా చేయొచ్చని వార్తలు వినిపిస్తున్నాయి.



కార్తీ – ఐఎన్‌ఎక్స్ మీడియా కేసు పూర్వాపరాలు

2017 మే 15: ఐఎన్‌ఎక్స్ మీడియా సంస్థలోకి 2007లో రూ.305 కోట్ల పెట్టుబడులను విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎఫ్ఐపీబీ) అనుమతించటంలో అవకతవకలు జరిగాయనీ, ఆ సమయంలో కార్తీ తండ్రి చిదంబరం కేంద్రమంత్రిగా ఉన్నారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది.

2017 జూన్ 16: కేంద్ర హోం శాఖలోని ది ఫారినర్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఎఫ్ఆర్ఆర్‌వో), బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్‌లు కార్తీపై లుకౌట్ సర్క్యులర్ జారీ చేశాయి.

2017 ఆగస్టు 10: లుకౌట్ సర్క్యులర్‌పై మద్రాస్ హైకోర్టు స్టే. వారెంట్లు లేనందున లుకౌట్ నోటీసు చెల్లదని తీర్పు.

2017 ఆగస్టు 14: మద్రాస్ హైకోర్టు స్టే ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది.

2017 ఆగస్టు 18: ఆగస్టు 23న సీబీఐ కోర్టులో హాజరు కావాల్సిందిగా కార్తీకి సుప్రీంకోర్టు ఆదేశం.

2017 ఆగస్టు 23: సీబీఐ కోర్టులో హాజరైన కార్తీ

2017 సెప్టెంబర్ 11: కార్తీకి విదేశాల్లో ఉన్నట్లు భావిస్తున్న 25 ఆస్తుల వివరాలను, లావాదేవీలను సీబీఐ సీల్డు కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించింది.

2017 సెప్టెంబర్ 22: విదేశాల్లో బ్యాంకు అకౌంట్లను కార్తీ మూసివేస్తున్నందున దేశం వదిలి వెళ్లకుండా అడ్డుకున్నట్లు సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది.

2017 అక్టోబర్ 9: కేంబ్రిడ్జి యూనివర్సిటీలో తన కుమార్తెను చేర్పించేందుకు లండన్ వెళ్లేందుకు అనుమతివ్వాలని సుప్రీంకోర్టులో కార్తీ పిటిషన్ వేశారు. అక్కడ ఏ బ్యాంకుకూ వెళ్లబోనని అందులో పేర్కొన్నారు.

2017 అక్టోబర్ 9: బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసమే తనను, తన కుమారుడిని వేధిస్తోందంటూ చిదంబరం సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

2017 డిసెంబర్ 8: ఎయిర్‌సెల్–మాక్సిస్ కేసులో సీబీఐ సమన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లిన కార్తీ.

2018 జనవరి 31: తనతోపాటు మరికొందరిపై ఉన్న రెండు లుకౌట్ నోటీసులపై కార్తీ సుప్రీంకోర్టును ఆశ్రయించగా మద్రాస్ హైకోర్టుకు వెళ్లాలని సూచించింది.

2018 ఫిబ్రవరి 16: దేశ, విదేశాల్లో అక్రమంగా ఆస్తులు కూడబెట్టటంలో సహకరించారంటూ కార్తీ చార్టెర్డ్ అకౌంటెంట్‌భాస్కరరామన్‌ను సీబీఐ అరెస్ట్ చేసింది.

2018 ఫిబ్రవరి 24: సీబీఐ దర్యాప్తుతో తన ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందనీ, వెంటనే నిలిపివేసేలా ఆదేశివ్వాలని సుప్రీంకోర్టులో చిదంబరం పిటిషన్ వేశారు.



చిత్రంలో కనిపిస్తున్నది చేప, తిమింగలం జాతుల్లోనే అతి పెద్దదైన వేల్ షార్క్. ఇప్పటి వరకు సముద్ర జీవజాలంలో అతి తక్కువగా తెలిసిన ఈ జీవిపై ఈక్వెడార్‌లోని గాలాపాగోస్ దీవిలో పరిశోధనలు జరుగుతున్నాయి. వేల్ షార్క్ ఆరు నుంచి 16 మీటర్ల పొడవు, 20 టన్నుల బరువు ఉంటుంది.

నీట్ అర్హత నిబంధనలపై హైకోర్టు స్టే

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం సీబీఎస్‌ఈ జారీ చేసిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) నోటిఫికేషన్‌లోని అర్హత నిబంధనలపై ఢిల్లీ హైకోర్టు బుధవారం స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. నోటిఫికేషన్‌లోని నిబంధనలతో పరీక్ష రాసేందుకు అర్హత కోల్పోయిన అనేక మంది విద్యార్థులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తమ స్పందన తెలపాల్సిందిగా కోర్టు సీబీఎస్‌ఈతోపాటు భారత వైద్య మండలి (ఎంసీఐ)ని కూడా ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రకారం అర్హత లేకపోయినా అభ్యర్థులు నీట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని కోర్టు తెలిపింది. అయితే దాని అర్థం వారిని కచ్చితంగా పరీక్షకు అనుమతిస్తారని కాదనీ, అది తుది తీర్పుకు లోబడి ఉంటుందంది. నీట్ దరఖాస్తుల స్వీకరణకు మార్చి 9 చివరితేదీ కాగా పరీక్ష మే 6న జరగనుంది. కోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేడీ గెలుపు



కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

భోపాల్/భువనేశ్వర్: మధ్యప్రదేశ్‌లోని రెండు, ఒడిశాలోని ఒక అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కాంగ్రెస్ రెండింటిని నిలబెట్టుకోగా, బీజేడీ ఒక చోట గెలుపొందింది. మధ్యప్రదేశ్‌లోని ముంగావోలీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీకి చెందిన మహేంద్ర సింగ్ కలుఖేడా ఆకస్మికంగా మృతి చెందటంతో ఫిబ్రవరి 24వ తేదీన ఉప ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి బ్రజేంద్ర సింగ్ యాదవ్ బీజేపీకి చెందిన బైషాబ్ యాదవ్‌ను 2,124 ఓట్ల తేడాతో ఓడించారు. కొలరస్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మహేంద్ర సింగ్ యాదవ్, బీజేపీకి చెందిన దేవేంద్ర జైన్‌పై 8,083 ఓట్లతో గెలుపొందారు. ఒడిశాలోని బిజేపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబల్ సాహు గత ఏడాది ఆగస్టులో మృతి చెందటంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిపారు. బీజేడీకి చెందిన రితూ సాహు, బీజేపీ అభ్యర్థి అశోక్ పాణిగ్రాహిపై 41, 933 ఓట్ల తేడాతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రణయ సాహు మూడో స్థానంలో నిలిచారు.

ట్రంప్ అల్లుడు కుష్నర్ హోదా కుదింపు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ హోదాను శ్వేతసౌధం తగ్గించింది. ప్రస్తుతం టాప్ సీక్రెట్ క్లియరెన్స్ జాబితాలో ఉన్న కుష్నర్ పేరును తొలగించి సీక్రెట్ క్లియరెన్స్ జాబితాలో చేర్చింది. దీని ప్రకారం అధ్యక్ష భవనం అధికారులకు ప్రతిరోజూ అందే అత్యంత రహస్య నివేదికలు ఇకపై ఆయనకు అందుబాటులో ఉండవు. ట్రంప్ కుమార్తె ఇవాంకా భర్త, అధ్యక్షుడి సీనియర్ సలహాదారు కూడా అయిన కుష్నర్.. పశ్చిమాసియా శాంతి చర్చలు, మెక్సికోతో సంబంధాలను పర్యవేక్షిస్తున్నారు. కొన్ని విదేశీ ప్రభుత్వాలు కుష్నర్, అతని కుటుంబంతో ఆర్థిక, వ్యాపార సంబంధాలను ప్రభావితం చేసి శ్వేతసౌధం రహస్యాలను చేజిక్కించుకునే ప్రమాదముందని అమెరికా నిఘా సంస్థలు భయపడుతున్నట్లు న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.

శతాబ్ది రైలుకు మహిళా టీటీఈలు

న్యూఢిల్లీ: భారత రైల్వే మరో నూతన అధ్యాయానికి తెరతీయనుంది. ముంబై–అహ్మదాబాద్ మధ్య నడిచే శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో కేవలం మహిళా ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ల(టీటీఈ)నే నియమించాలని నిర్ణయించింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీనిని ప్రయోగాత్మకంగా అమలుచేయనున్నారు. శతాబ్దిలో 30 మంది మహిళా టీటీఈల బృందం విధులు నిర్వహించనుంది.

రూ.515 కోట్ల కుచ్చుటోపి

కోల్‌కతాలో బట్టబయలైన మరో బ్యాంకింగ్ మోసం
- రుణాలు చెల్లించక ఆస్తులను ఎన్‌పీఏలుగా చూపించిన వైనం
- ఆ వ్యాపారవేత్త గతంలో మమతా బెనర్జీకి సన్నిహితుడు!



కోల్‌కతా: పీఎన్‌బీ, రొటోమ్యాక్ కుంభకోణాలపై చర్చ జరుగుతుండగానే కోల్‌కతాలో మరో బ్యాంకు అవినీతి బట్టబయలైంది. పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీకి గతంలో సన్నిహితంగా ఉన్న ఓ వ్యాపారవేత్తకు చెందిన ఆర్పీ ఇన్ఫో సిస్టమ్స్ సంస్థ కారణంగా కెనరా బ్యాంకుతోపాటు మరో తొమ్మిది బ్యాంకులకు రూ.515 కోట్ల నష్టం వాటిల్లినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ.. సంస్థ కార్యాలయం సహా ఆరుచోట్ల బుధవారం సోదాలు నిర్వహించింది. ఆర్పీ ఇన్ఫో సిస్టమ్స్ డైరెక్టర్లైన శివాజీ పంజా, కౌస్తవ్ చటర్జీ, వినయ్ బాఫ్నా, ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ దేవ్‌నాత్ పాల్ సహా.. పలువురు బ్యాంకు అధికారుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. 2012–13లో రూ.515 కోట్ల మోసం జరిగిందంటూ కెనరా తోపాటు తొమ్మిది బ్యాంకుల కన్సార్షియం సీబీఐకి ఫిర్యాదు చేసింది. దీని ఆధారంగా రంగంలోకి దిగిన సీబీఐ.. బాధ్యులపై మోసం, నేరపూరిత కుట్ర, ఫోర్జరీ, అధికారులతో అమర్యాదకరంగా వ్యవహరించారంటూ కేసు నమోదు చేసింది. ఇందులో శివాజీ పంజా పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితుడు.

2015లోనే వెలుగులోకి తొలి మోసం

ఈ సంస్థ 'చిరాగ్' పేరుతో దేశవ్యాప్తంగా డెస్క్‌టాప్స్, ల్యాప్‌టాప్స్ తయారీ, వ్యాపారం, కంప్యూటర్ల సర్వీసింగ్, నెట్‌వర్కింగ్ ఇంటిగ్రేషన్‌తోపాటుగా హార్డ్‌వేర్ ఉత్పత్తులను అమ్మేది. బ్యాంకుల కన్సార్షియానికి తప్పుడు డాక్యుమెంట్లను ఇచ్చి రుణాలు పొందిన ఆర్పీ ఇన్ఫో సిస్టమ్స్.. ఆ తర్వాత రుణాలు చెల్లించటంలో విఫలమైంది. దీంతో సరైన రుణాలు చెల్లించక ఎన్‌పీఏ ముద్రవేసుకుంది. 2015లోనే ఐడీబీఐ బ్యాంకును రూ. 180 కోట్లకు మోసం చేసిన కేసులో సీబీఐ ఈ సంస్థపై కేసు నమోదు చేసింది. ఫిర్యాదు చేసిన బ్యాంకుల కన్సార్షియంలో ఎస్‌బీఐ, ఎస్‌బీఐలో విలీనం అయిన రెండు బ్యాంకులు, యూనియన్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్‌లున్నాయి.


విచారణకు రాను: నీరవ్



పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించిన సీబీఐ విచారణకు హాజరయ్యేందుకు నీరవ్ మోదీ నిరాకరించారు. వ్యాపార కారణాల రీత్యా విచారణకు హాజరు కాలేనని వెల్లడించారు. ఏ దేశంలో ఉన్నా అక్కడున్న భారత దౌత్యకార్యాలయాన్ని సంప్రదించాలని.. అక్కడి అధికారులే భారత్ వచ్చేందుకు వాళ్లు ఏర్పాటుచేస్తారని నీరవ్ మోదీకి రాసిన లేఖలో పేర్కొంది. కేసులో దోషిగా ఉన్నవారెవరైనా పిలిచినప్పుడు విచారణకు రావాల్సిందేనని హెచ్చరించింది. వచ్చేవారం కేసు విచారణకు హాజరవ్వాలని తెలిపింది. మరోవైపు, ఈ కేసు విచారణలో భాగంగా పీఎన్‌బీ ఇంటర్నల్ చీఫ్ ఆడిటర్ ఎంకే శర్మను సీబీఐ అరెస్టు చేసింది. కుంభకోణానికి కేంద్రమైన పీఎన్‌బీ బ్రాడీహౌజ్ శాఖలో ఆడిటింగ్ వ్యవహారాలకు ఈయనే బాధ్యుడు.

మంత్రాల్లోనే న్యూటన్ నియమాలు!

- చదువు రావాలంటే స్కూళ్లకు వాస్తు ఉండాలి
- కేంద్రమంత్రి సత్యపాల్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం తప్పని వాదించిన కేంద్ర మానవవనరుల శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్.. మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఐజాక్ న్యూటన్ ప్రతిపాదించిన గమన నియమాలు(లాస్ ఆఫ్ మోషన్) మన మంత్రాల్లో ఎప్పటినుంచో ఉన్నాయని సత్యపాల్ సింగ్ తెలిపారు. గత జనవరిలో హెచ్‌ఆర్డీ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన 65వ సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్(సీఏబీఈ) భేటీలో సత్యపాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. కాబట్టి సంప్రదాయ జ్ఞానాన్ని కచ్చితంగా మన పాఠ్యాంశాల్లో చేర్చాలని సత్యపాల్ సూచించారు. అంతేకాకుండా పాఠశాల భవనాలు పూర్తి వాస్తుతో ఉండాలనీ.. అప్పుడే విద్యార్థులకు చదువు అబ్బుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా న్యూటన్ మంత్రాల విషయమై మీడియా ఆయన్ను బుధవారం ప్రశ్నించగా.. సత్యపాల్ జవాబు దాటవేశారు. అంతేకాకుండా డార్విన్ విషయంలో తాను చెప్పింది కేవలం తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేననీ, దానికి ప్రభుత్వం, పార్టీతో ఎలాంటి సంబంధం లేదని వివరణ కూడా ఇచ్చారు.

పథకాలు ప్రజలకు చేరేలా శ్రమించండి

బీజేపీ సీఎంలకు ప్రధాని ఉద్బోధ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత కష్టపడాలని బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రధాని మోదీ సూచించారు. పేదలకు ఆరోగ్య బీమా, అన్ని ఇళ్లకు విద్యుత్ వంటి పథకాలను అర్థమయ్యేలా వివరించాలన్నారు. బీజేపీ సీఎంలతో మోదీ బుధవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఏకకాల ఎన్నికలపై పార్టీ సుముఖంగానే ఉందని.. ఈ దిశగా తీసుకోవాల్సిన చర్యలపైనే చర్చించామని ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ చెప్పారు. పార్టీ చీఫ్ అమిత్ షా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, సుష్మాస్వరాజ్, అరుణ్ జైట్లీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పాతతరానికే రాహుల్ ఓటు

- 17, 18 తేదీల్లో ప్లీనరీ
- నిర్వాహక కమిటీకి వోరా.. డ్రాఫ్ట్ కమిటీకి మన్మోహన్



సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: మార్చిలో ఢిల్లీలో జరపనున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ ఏర్పాట్ల కమిటీలో పాతతరం నేతలకే అధ్యక్షుడు రాహుల్ కీలక బాధ్యతలు అప్పజెప్పారు. ప్లీనరీ ఏర్పాట్లకోసం నియమించిన పలు కమిటీలను ఏఐసీసీ బుధవారం ప్రకటించింది. ఇందులో పలువురు పాతతరం నేతలకు ముఖ్యమైన బాధ్యతలు అప్పజెప్పారు. ప్లీనరీ నిర్వాహక కమిటీ బాధ్యతలను పార్టీ కోశాధికారి మోతీలాల్ వోరాకు అప్పగించగా.. కన్వీనర్‌గా ఆస్కార్ ఫెర్నాండెజ్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇంచార్జ్‌లను నియమించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలో డ్రాఫ్ట్ కమిటీకి వేశారు. ఈ కమిటీలోనూ సగానికిపైగా మంది వృద్ధ నేతలే. రాజకీయ తీర్మానాలను సిద్ధం చేసే కమిటీ బాధ్యతలను ఏకే ఆంటోనీకి అప్పగించారు. ఆర్థిక వ్యవహారాల కమిటీకి పి. చిదంబరం చైర్మన్ కాగా.. కన్వీనర్ జైరాం రమేశ్. పార్టీ మాజీ చీఫ్ సోనియా గాంధీకి ఏ కమిటీలోనూ స్థానం కల్పించలేదు. స్టీరింగ్ కమిటీ పార్లమెంటు హౌజ్‌లో మార్చి 16వ తేదీన సమావేశమై తీర్మానాల తుదిజాబితాను సిద్ధం చేయనుంది. ప్లీనరీ మార్చి 17, 18 తేదీల్లో జరగనుంది.

ఎంపీల అలవెన్సు పెంపునకు ఓకే

- అక్రమరవాణా విచారణ ఇకపై ఎన్ఐఏ చేతికి
- పీఎంఈజీపీ గడువు పెంపు
- కేబినెట్ నిర్ణయాలు



న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యులకు అందజేస్తున్న అలవెన్సులను పెంచాలన్న పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ప్రతిపాదనకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. కేంద్రం తాజా నిర్ణయం ప్రకారం ఎంపీలకు ప్రతినెల చెల్లించే నియోజకవర్గ అలవెన్సు రూ.45 వేల నుంచి రూ.70 వేలకు చేరుకోనుంది. అలాగే ఆఫీస్ ఖర్చుల కోసం అందిస్తున్న అలవెన్సు మొత్తం రూ.45 వేల నుంచి రూ.60 వేలకు చేరుకోనుంది. వీటికి అదనంగా ఐదేళ్లకోసారి అందించే ఫర్నీచర్ అలవెన్సును రూ.75 వేల నుంచి రూ.లక్షకు పెంచారు. అంతేకాకుండా ఎంపీల మూలవేతనాన్ని ప్రస్తుతమున్న రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇవి వచ్చే ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. పార్లమెంటు సభ్యుడిపై ప్రస్తుతం ప్రభుత్వం నెలకు రూ.2.70 లక్షల మేర ఖర్చుపెడుతోంది.


అక్రమరవాణా కేసులు ఎన్ఐఏకు: ఉగ్రవాద కేసుల్ని విచారిస్తున్న జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు మనుషుల అక్రమరవాణా కేసుల్ని విచారించే బాధ్యతను కూడా కేంద్రం అప్పగించింది. ఈ మేరకు మనుషుల అక్రమ రవాణా(నిరోధం, రక్షణ , పునరావాసం) బిల్లు–2018కి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ప్రకారం తరచూ మనుషుల్ని అక్రమంగా తరలించేవారికి యావజ్జీవశిక్ష కూడా విధించవచ్చు. ఎన్ఐఏలో ఏర్పాటుచేయనున్న ప్రత్యేక విభాగానికి నిర్భయ ఫండ్ నుంచి ఆర్థికసాయం అందిస్తారు.ప్రధానమంత్రి ఉద్యోగ కల్పనా కార్యక్రమం (పీఎంఈజీపీ) కాలపరిమితిని 2019–20 వరకూ పెంచుతూ సీసీఈఏ నిర్ణయం తీసుకుంది. దీనికి రూ.5,500 కోట్లను కేటాయించింది. దీంతో ఏటా 15 లక్షల చొప్పున మూడేళ్లలో 45 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నది లక్ష్యం.

కంప్యూటర్‌తో పరీక్షలు

- దివ్యాంగ విద్యార్థులకు సీబీఎస్‌ఈ వెసులుబాటు
- ఈ ఏడాది నుంచే 10, 12 తరగతి బోర్డు పరీక్షల్లో వర్తింపు

న్యూఢిల్లీ: 10, 12వ తరగతుల బోర్డు పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులు (ప్రత్యేక అవసరాలున్నవారు) కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు వాడుకోవడానికి సీబీఎస్‌ఈ అనుమతించింది. ఈ ఏడాది నుంచే ఈ వెసులుబాటు అమల్లోకి రానున్నట్లు ఒక అధికారిక ప్రకటన వెలువడింది.పరీక్షా కేంద్రంలో సదరు విద్యార్థి కంప్యూటర్ వినియోగించుకోవచ్చని సిఫార్సు చేస్తూ అర్హుడైన వైద్యుడు సర్టిఫికేట్ జారీచేయాల్సి ఉంటుంది. అలా సిఫార్సు చేయడానికి తగిన కారణాలను అందులో పేర్కొనాలి. విద్యార్థి ఈ సర్టిఫికేట్‌ను పరీక్షా సమయంలో సమర్పించాలి. సమాధానాలు టైప్ చేయడానికి, ప్రశ్నలను వినడానికి, వాటిని పెద్ద అక్షరాల్లో చూడటానికి మాత్రమే కంప్యూటర్ వినియోగాన్ని పరిమితం చేయాలని సీబీఎస్‌ఈ పేర్కొంది. విద్యార్థి ఫార్మాట్ చేసిన కంప్యూటర్/ల్యాప్‌టాప్‌ను తానే సొంతంగా వెంట తెచ్చుకోవాలని వెల్లడించింది. కంప్యూటర్ టీచర్ ఆ కంప్యూటర్‌ను పరీక్షించిన తరువాతే పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ దాన్ని అనుమతించాలని తెలిపింది. ఆ కంప్యూటర్‌కు ఇంటర్నెట్ ఉండొద్దని షరతు విధించింది. పరీక్ష రాసే సహాయకుడి బదులు ప్రశ్నా పత్రం చదివి వినిపించే రీడర్ కావాలన్నా తీసుకునే ప్రతిపాదనకూ సీబీఎస్‌ఈ అంగీకరించింది.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం, 1-3-2018



బాల్యంపై బలాత్కారాలే.. ఈ బాలత్కారాలు.

చాక్లెట్‌ని రంగుల కాగితంలో..
అదే.. రేపర్‌లో చుడతారు.
ఆ రంగుల రేపర్‌లో ఒక దరిద్రుడు తన వాంఛను చుట్టి
పిల్లల్ని ట్రాప్ చేస్తే... బాల్యాన్ని నలిపేస్తే..
ఒళ్లంతా పుండ్లు వచ్చేస్తాయి!
జీవితంలో ఎప్పటికీ మానని గాయాలుగా అవి మిగిలిపోతాయి.

చాక్లెట్ రేప్..ర్

ఆ రోజు భయం భయంగా ఇంట్లో అడుగుపెట్టానో లేదో.. 'చిన్నదాన్ని చూసుకో' అని చెప్పేసి – ఉరుకులు పరుగుల మీద పనికి పోయింది మా అమ్మ. ఐదు రూపాయల నోటు చేతిలో పెడితే.. మారు మాట్లాడకుండా కొంగున కట్టుకుంది.

నా వైపు కన్నెత్తయినా చూడలేదు.

'ఎవరిచ్చారు' అని కూడా అడగలేదు.

బండ చాకిరీ చేస్తుంది మా అమ్మ. మా నాన్న మమ్మల్ని వదిలేసి పోయినప్పట్నుంచీ తను బండరాయి మల్లే తయారైంది. ఒక్కోసారి కోపంతో ఊగిపోతూ నన్నూ నా ఇద్దరు చెల్లెళ్లనీ కొట్టేది. పెద్ద పెద్ద కేకలేసేది.

మాకు నాలుగు మెతుకులు కతకడానికి నానా యాతన పడుతుండేది. తిండిబెట్టి, వంద రూపాయలు ఇస్తామంటే ఒక ఇంట్లో నన్ను పనికి పెట్టింది.

ఆ ఇంటాయన నా ఒంటి మీద కన్నేశాడు. ఆ రోజు ఆయన నన్ను ఎక్కడెక్కడో ముట్టుకున్నాడు. అయోమయంగా అన్పించింది. అసలు ఏం చేస్తున్నాడో ఎందుకట్లా చేస్తున్నాడో తెలియక భయమైంది. చెప్పుకోలేని చోట్ల మంట. నొప్పి. ఇంటికి వెళ్లే ముందు ఆయన ఐదు రూపాయలిచ్చి ఎవ్వరికీ చెప్పొద్దన్నాడు. చెబితే మా అమ్మను పనిలో నుంచి తీయించేస్తానని బెదిరించాడు. మేముండే రేకుల షెడ్లో నుంచి బయటకు తోలిస్తానని భయపెట్టాడు.

వీధి పంపులోంచి నీళ్లు తెచ్చి ఇంట్లో డ్రమ్ములు నింపడం నా పనే. కానీ ఆ రోజు ఆ పనే కాదు, ఏ పనీ చేయలేక మా అమ్మ చేతిలో దెబ్బలు తిన్నాను. కానీ నేనేం చేయను? లోపటి వాపులతో నడవడమే కష్టమైంది. ఒంట్లో ఓపిక లేనట్టు అనిపించింది.

వెబ్ వెర్షన్ కోసం QR Code స్కాన్ చేయండి.

మర్నాడు పని మానేస్తానన్నా. అమ్మ తిట్టి రెండు తగిలించింది. ఇంట్లో బువ్వ లేదంది. పని చేసి నాలుగు మెతుకులు తిని రమ్మంది. కానీ ఆ ఇంటాయన సంగతి నేనెట్లా చెప్పేది? ఆయన మమ్మల్ని ఏమయినా చేస్తే? మా అమ్మని పనిలో నుంచి తీసేయిస్తే? – ఇలాంటి ఆలోచనలతో పనికి పోక తప్పింది కాదు.

ఆ ఇంటాయన బయటకు పోయేవాడు కాదు. భార్యాభర్తలు గొడవ పడుతుండేవాళ్లు. భార్యా పిల్లలు బయటకు పోయాక నన్ను గదిలోకి లాక్కుపోయేవాడాయన. తను చెప్పినట్టు చేయకపోతే గదిమేవాడు. గిచ్చేవాడు. నా శరీరాన్ని నలిపేసేవాడు. ఒక్కోసారి జనం లేని చోట్లకి తీసుకుపోయి పాడుచేసేవాడు. కానీ కడుపు నిండా అన్నం పెట్టేవాడు. అప్పుడప్పుడూ తినడానికి ఏదైనా ఇచ్చేవాడు. డబ్బులు కూడా చేతిలో పెట్టేవాడు.

• ❖ •

నెలరోజుల తర్వాత – నన్నూ మా అమ్మనూ పోలీసులు స్టేషన్‌కి తీసుకుపోయారు. మా అమ్మ భయంతో ఒణికిపోయింది.

ఆ ఇంటాయన గురించి చాలా ప్రశ్నలు వేశారు నన్ను. మా అమ్మను తిట్టారు. చిన్న పిల్లల్ని పనిలో పెట్టకూడదంట. చట్టం ఒప్పుకోదంట. మా అమ్మ తప్పు చేసిందంట. పోలీసులు ఇట్టా చెబుతుంటే మా అమ్మ కొంగుతో కళ్లు అద్దుకుంటూ కిక్కురుమనలేదు.

ఆ రోజు నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు జరిపారు. ఇంటాయనపై కేసు పెట్టారు. ఆ ఇంటాయన నన్ను పాడు చేసినట్టు వాళ్ల ఆవిడే పోలీసులకు చెప్పిందంట. అంటే జరిగిందంతా ఆవిడకు తెలుసన్నమాట!

ఆ రోజు మా అమ్మ బాగా ఏడ్చింది. తను అంతగా ఏడవడం ఎప్పుడూ చూడలేదు నేను. ఏడుస్తూనే ఇల్లొదిలి పోయిన మా నాన్నను చావు తిట్లు తిట్టింది. కసి తీరా కేకలేసింది.

• ❖ •

నన్ను ఓ ఎన్జీవోకి చెందిన హాస్టల్‌కి పంపారు. అక్కడ ఆరునెలలపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓ రోజు బడికి పంపిస్తామంటే వద్దని ఏడ్చి మొత్తుకున్నాను. మరి కొన్నాళ్లు కౌన్సెలింగ్ ఇచ్చి.. బడికి పోయేదానికి ఒప్పించారు.

బళ్లో నాకెవ్వరూ దోస్తులుండేవాళ్లు కాదు. అసలు నేనెవ్వరితో మాట్లాడలేకపోయేదాన్ని. ఎవ్వరితో కలవలేక పోయేదాన్ని. ఏమీ చదవలేకపోయేదాన్ని. అందరూ అదోలా చూస్తుంటే భయంతో ముడుచుకుపోయేదాన్ని. చదువుపై ధ్యాస లేకపోవడంతో పదో తరగతి తప్పాను. దీంతో నాకు కంప్యూటర్ ట్రెనింగ్ ఇప్పించారు.

ఇప్పుడు ఉద్యోగం చేసుకుంటున్నా.

నా చెల్లెళ్లకి ఆసరా అవుతున్నా.

నన్ను ఆగం చేసిన వాడికి శిక్ష పడింది.

ఇప్పుడు నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. కానీ పెళ్లి చేసుకోవాలనిపించడం లేదు. చేదు గుర్తుల బరువు మోయలేకపోతున్నాను. నన్ను నేను గౌరవించుకోలేకపోతున్నాను. ఒక్కోసారి నా మీద నాకే కోపమొస్తుంది.

నా జీవితం ఎట్లా ఉండబోతుందో.. అనే ఆలోచన వచ్చినప్పుడు చాలా భయం పుడుతోంది.
(నిర్మల కేస్ స్టడీ)

– హృదయ

సహాయాలన్నీ వెంటనే అందాలి



నిర్మల లాంటి బాలికలు కుటుంబాల్లో, నివాస ప్రదేశాల్లో హింసను చూస్తూ పెరుగుతున్నారు. లైంగిక హింస సహా రకరకాల హింసలకు గురవుతున్నారు. అయితే దీన్ని హింస అంటారనీ, దీన్ని వ్యతిరేకించాలనీ వాళ్లకి తెలియదు. చూడటానికి వాళ్లు మామూలుగానే కనిపిస్తారు. మామూలుగానే మాట్లాడతారు. వాళ్లల్లో విచారం కనిపించదు. హింసాత్మక అనుభవాల గురించి వాళ్లు ఏమీ చెప్పుకోరు. మాట్లాడరు. వాళ్ల చుట్టూ ఉండే జనానికి వాటి గురించి వినే టైమ్ గానీ / ఆలోచించే తీరిక గానీ ఉండవు. ఇప్పుడున్న స్థితి పట్ల అభ్యంతరాలూ ఉండవు. దీని వెనుక వ్యవస్థాగత కారణాలున్నాయి. ఇలాంటి నేపథ్యం ఉన్న చోట నిర్మల లాంటి పిల్లల్ని అమాయకత్వమూ నిస్సహాయత్వమూ ఆవరించి ఉంటాయి. సాంఘికంగా చితికిపోయిన, మానసికంగా డిప్రెస్డ్‌గా ఉన్న ఈ బాధితులకు ఎంతో శక్తి ఇవ్వాల్సి వుంది. వీళ్ల చేత హింసను గుర్తింపచేయడం, దాని బారి నుంచి బయటకు లాగడం ఒక పెద్ద సవాల్. వీళ్లకి చట్టపరమైన సాయమొక్కటే చాలదు. శారీరక – మానసిక – ఆర్థికపరమైన సాంత్వన కల్పించడం చాలా అవసరం. ఇలాంటి వాళ్లందరినీ రీహాబిలిటేషన్ సెంటర్లకు తరలించడం సరి కాదు. వారిని మెయిన్ స్ట్రీమ్‌లోనే ఉంచాలి. పని విషయంలో వాళ్ల ఎంపికను గౌరవించాలి. వాళ్లకు షెల్టర్ ఉండాలి. బాధితులకు ఇలాంటి సాయాలన్నీ తక్షణం అందాలి. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి. 'రేప్' చుట్టూ అల్లుకున్న భావజాలాన్నీ భాషనూ మార్చడం అతి పెద్ద కర్తవ్యం.

– వంగూర్ ఉషారాణి, డైరెక్టర్, 'సన్నిహిత'

రక్షించుకునే శిక్షణ ఇవ్వాలి



సాధారణంగా పిల్లల్ని లైంగికంగా లోబరచుకునేవాడు అందరి ముందూ వాళ్లను తిడుతుంటాడు. ఎవ్వరూ లేనప్పుడు ప్రేమ కరబరుస్తుంటాడు. చాక్లెట్లో ఇంకోటో పెట్టి లొంగదీసుకోవాలని చూస్తుంటాడు. ఎవ్వరికీ చెప్పొద్దని బెదిరిస్తుంటాడు. ఈ విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి. చూపులు – స్పర్శ – మాటలు – ప్రవర్తన వంటి వాటిల్లో తేడాలను గమనించగలిగే శిక్షణ ఇవ్వాలి. ఏం జరిగినా / జరుగుతున్నా దాచిపెట్టవద్దని, మౌనంగా ఉండొద్దని చెప్పాలి. ఈ విషయాల్లో తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వడం చాలా అవసరం. తెలిసినవారి చేతుల్లోనే పిల్లలు అత్యాచారాలకు గురవుతున్న కేసులు భారీగా చోటు చేసుకుంటున్న నేపథ్యంలో – వారికి సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తల్లిదండ్రులకు వివరించాలి. ఇంట్లో అయినా, బయట అయినా వాళ్లని ఒంటరిగా వదిలిపెట్టరాదనే విషయాన్ని గుర్తింపచేయాలి. తమ మనోభావాల్ని, భయాల్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయగల వాతావరణాన్ని ఇంట్లో నెలకొల్పాలి. పిల్లలపై జరిగిన లైంగిక దాడుల్ని 'పరువు' పేరిట ఏ ఒక్కరికీ చెప్పకుండా దాచిపెడదామనుకుంటే, బాధితులకు తగిన సపోర్ట్ ఇవ్వకుంటే మొదటికే మోసమొస్తుంది. బాధితురాలి జీవితమే ప్రమాదంలో పడుతుంది. ఈ కర్తవ్యాలు నిర్వహించాల్సింది ప్రధానంగా ప్రభుత్వాలే. పిల్లల భద్రతకు గ్యారెంటీ ఇవ్వాల్సింది ప్రభుత్వాలే. ప్రమాదాల్లో ఉన్న పిల్లలకోసం హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేస్తే చాలదు. దానిపై తగిన ప్రచారం కూడా కల్పించాలి. తప్పు చేసిన వాళ్లకు శిక్షలు పడాలి.

– సిస్టర్ లిస్సీ జోసెఫ్, ప్రెసిడెంట్, నేషనల్ వర్కర్స్ మూవ్‌మెంట్

బిగ్ ఫైట్

కుదురులేని భర్తతో.... ఎదురీదడమూ...

స్వాతంత్ర్య సంగ్రామమే!

ఈ కథ స్వాతంత్ర్యానికి పూర్వం ప్రారంభమైంది. బంగ్లాదేశ్‌లో ఒక మారుమూల ప్రాంతం. ఆమె వయసు నాలుగు సంవత్సరాలు. తల్లి మరణించింది. తండ్రి మరో వివాహం చేసుకోలేదు. అత్యంత సంపన్నురాలైన తన సోదరికి పిల్లను అప్పచెప్పాడు. మేనత్త ఆమెను రాకుమార్తెలా పెంచింది. అయినా తన తోటివారు తల్లిదండ్రులతో సంతోషంగా ఆడుకుంటుంటే, ఆ పసి హృదయానికి తల్లిదండ్రులు గుర్తుకు వచ్చేవారు. అలాగే పెరిగి పెద్దదైంది. ఆమె చాలా తెలివైనది, అందమైనది. వంద గ్రామాలకు అధిపతి అయిన ఒక జమీందారుతో ఆమెకు 14వ ఏటే 1945లో వివాహం జరిగింది. ఏ లోటూ లేకుండా జీవితం హాయిగా సాగింది.

భర్తకు ఉద్యోగం ఇప్పించింది!

రెండో ప్రపంచం ముగుస్తున్న ఆ కాలంలో.. బెంగాల్... తూర్పు బెంగాల్, పశ్చిమ బెంగాల్‌గా చీలిపోయింది. సంపన్నులందరూ తక్కువ ధనంతో పశ్చిమ బెంగాల్ చేరుకున్నారు. ఆమె కూడా భర్తతో కలిసి కలకత్తా నగరం చేరుకుంది. అయితే గత వైభవం లేకపోవడంతో జీవితం దుర్భరంగా మారింది. సంపద పోయినా భర్తలో జమీందారీతనం పోలేదు. ఒక్క పైసా కూడా సంపాదించకుండా, ఆమె మీద అజమాయిషీ చేయడం ప్రారంభించాడు. ఆమె ఎంతో కష్టం మీద భర్తకు ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం వేయించింది. చేరిన కొద్ది రోజులకే ఆ ఉద్యోగం మానేశాడు. అప్పటికే వారికి ఐదుగురు సంతానం. కొత్త ఉద్యోగం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు.



దీపాలీ ఘోష్

మామగారు షాపు పెట్టించాడు

కూతురి కష్టాల్ని కళ్లారా చూస్తున్న ఆమె తండ్రి... తాను దాచుకున్న సొమ్ములన్నీ అమ్మేసి, అల్లుడికి ఒక పెద్ద షాపు ఇచ్చాడు. అది కూడా నిలబెట్టుకోలేకపోయాడు భర్త. డబ్బు లేకుండా ఐదుగురు పిల్లల్ని ఎలా పెంచాలా అనే ఆలోచనతో ఆమెకు రాత్రుళ్లు నిద్రపట్టేది కాదు. భర్తను ఎలాగో ఒప్పించి ఉత్తరప్రదేశ్‌లో ఉద్యోగంలో చేర్పించింది. అక్కడ కూడా ఉద్యోగం మానేసి, ఇంట్లో ఖాళీగా కూర్చోవడం ప్రారంభించాడు. ఇక ఆమె ధైర్యం చేయక తప్పలేదు. తాను ఉద్యోగం చేస్తానని తేల్చి చెప్పేసింది. అతడికి ఆ మాటలు నచ్చలేదు. విడాకులు ఇచ్చేస్తానని బెదిరించాడు. ఆమె అంగీకరించింది. ఇద్దరూ విడిపోయారు. ఐదుగురు పిల్లలతో ఆమె ఘజియాబాద్‌లో ఒక చిన్న ఇంట్లోకి మారింది.

> **ఆమె పేరు దీపాలి ఘోష్. ప్రేమను పంచే ఆమె మనసు, కష్టాలను ఎదుర్కొనగలిగే ఆమె ధైర్యం, ఒంటరిగా ఉన్నా ఎటువంటి మచ్చ పడకుండా గడిపిన ఆమె నిజాయితీ... ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలిచేలా చేశాయి.**

విడాకులు ఒడ్డుకు చేర్చాయి

ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు నిద్ర లేచేది. డబ్బు కోసం మైళ్ల కొలదీ దూరం నడిచేది. పని నుంచి ఇంటికి వచ్చాక, ఇంటి దగ్గర ట్యూషన్లు చెప్పేది. ఒక్కోసారి పిల్లలంతా భోజనం చేశాక, తనకు మిగిలేది కాదు. నిద్రకు కూడా దూరమైపోయింది. ఒక రాకుమార్తెలా పెరిగి, ఒక రాజకుమారుడిని పెండ్లాడి, అవసరాలు తీరడం కోసం రెండు ఉద్యోగాలు చేయడమంటే విధి పగ పట్టడమే కదా!

రోజూ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతూ ఉండేది. పనులన్నీ ఒంటరిగా చక్కబెట్టుకోవడం కష్టమని అర్థం చేసుకుంది. ఇంటి పనులు, చదువుకోవడం అన్నీ వారికి వారే చేసుకునేలా పిల్లలకు నేర్పింది.

ఆమెలేదు.. ఆదర్శం ఉంది

పిల్లల్ని పెంచడం కోసమే తన జీవితాన్ని అంకితం చేసింది. వచ్చిన ఆదాయంతో జాగ్రత్తగా జీవించడం అలవాటు చేసుకుంది. పిల్లల్ని వృద్ధిలోకి తీసుకువచ్చింది. నేడు పిల్లలంతా పెద్దవారయ్యారు, అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అందరూ మంచి హోదాలో ఉన్నారు. అయితే అవన్నీ చూడటానికి ఇప్పుడు ఆమె లేదు. నిద్రాహారాలు లేకుండా పనిచేయడంతో ఆమె ఆరోగ్యం క్షీణించి, కన్ను మూసింది.

(మనవరాలు సైనీ బెనర్జీ పాల్ ఈ విషయాలన్నీ ఇటీవలే వెల్లడించారు)

చెట్టు నీడ

ఈ క్షణంలో ఏం చేస్తున్నాం?

ఒక ఆశ్రమంలో చేరాడు ఒక యువకుడు. అక్కడ ధ్యానం గురించి ప్రత్యేకంగా బోధిస్తారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కేవలం ధ్యానం చేయించడమే శిక్షణ. ప్రతి శిష్యుడు గురువులకు శుశ్రూష చేస్తూ సాధన చేస్తాడు. ధ్యానం అంటే కేవలం ఒక అలౌకిక స్థితి మాత్రమే కాదనీ, భౌతిక జీవితం పట్ల పూర్తి స్వీయస్పృహ కలిగివుండటం కూడా ధ్యానమేననీ ఆ యువకుడికి చెప్పారు.

> **యువకుడు వెళ్లాల్సినరోజు బాగా వర్షం పడుతోంది. అందుకని పావుకోళ్లు వేసుకుని, గొడుగు పట్టుకుని ఆ గ్రామానికి వెళ్లాడు.**

యువకుడు పూర్తిగా నిమగ్నమైపోయాడు. అలా సాధనలో పదేళ్లు గడిచాయి.

అతడు శిష్యరికం వదిలి గురువుగా పదోన్నతి పొందే రోజు వచ్చింది. సమీప గ్రామంలో వున్న పిల్లలకు ధ్యానపాఠం చెప్పడానికి పెద్ద గురువు పిలిపించాడు. యువకుడు వెళ్లాల్సినరోజు బాగా వర్షం పడుతోంది. అందుకని పావుకోళ్లు వేసుకుని, గొడుగు పట్టుకుని ఆ గ్రామానికి వెళ్లాడు. తరగతి గదిలోకి వెళ్లేముందు చెప్పుల్నీ గొడుగునూ గోడ పక్కన వదిలి లోపలికి నడిచాడు.

పెద్ద గురువు చిరునవ్వుతో పలకరిస్తూ– 'ఇప్పుడు లోపలికి వచ్చావు కదా! నీ గొడుగును నీ పావుకోళ్లకు ఎడమవైపు నిలిపావా? కుడివైపా?' అని ప్రశ్నించాడు గురువు.

యువకుడు తత్తరపడ్డాడు. అతడి దగ్గర తక్షణం సమాధానం లేదు. ప్రతిక్షణం ధ్యానంలో ఉండటం తనకు ఇంకా అలవడలేదని గ్రహించాడు. మరింత సాధన కోసం మరో ఆరేళ్లపాటు మళ్లీ శిష్యుడిగానే ఉండిపోవాలని నిశ్చయించుకున్నాడు.

వండర్‌లాక్విజమ్

పలికెడిది ప్రతి వస్తువూనట! పలికించునది ఇందుశ్రీ అట



ఇందుశ్రీ వెంట్రిలాక్విస్ట్. ఊహూ.. ఈ మాట సరిపోదు. అంతర్జాతీయ వెంట్రిలాక్విస్ట్. ఈ మాట కూడా! ఇండియాలో మొట్ట మొదటి మహిళా వెంట్రిలాక్విస్ట్. ఎస్. ఈ మాట కరెక్ట్. ఈ ఏడాది జనవరి 20న న్యూఢిల్లీలో తొలి భారతీయ ఉమన్ వెంట్రిలాక్విస్ట్‌గా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఇందుశ్రీ 'ఇండియన్ ఉమెన్ అచీవర్స్'అవార్డు అందుకున్నారు. ఈ నెల 26, 27 తేదీలలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఉత్సాహవంతులైన యువతీయువకుల కోసం రవీంద్రభారతిలో నిర్వహించిన శిక్షణా శిబిరాలకు వచ్చి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సాక్షి 'ఫ్యామిలీ' ఇందుశ్రీని పలకరించింది. ఆ విశేషాలివి.

రెండేళ్ల వయసుకే 'పట్టు'!

ఇందుశ్రీ బెంగుళూరు అమ్మాయి. రెండేళ్ల వయస్సులో టీవీలో వెంట్రిలాక్విజమ్ చూసి, మాట్లాడే ఆ బొమ్మ కావాలని పట్టుపట్టింది. తర్వాత కొన్నాళ్లు మ్యాజిక్‌లో పడిపోయి, తిరిగి వెంట్రిలాక్విజమ్‌లోకి షిఫ్ట్ అయ్యారు ఇందుశ్రీ. ఆమెకు ఆ కళను ఎవ్వరూ నేర్పలేదు. తనకు తానుగా ఆడియో, వీడియోల్లో నేర్చుకొంటూ సాధన చేస్తూ వచ్చారు!

ఇష్టం కాబట్టి.. కష్టమనిపించలేదు

వెంట్రిలాక్విజంలో ఆర్టిస్టుగా నిలదొక్కుకోడానికి రేయింబవళ్లు కష్టపడ్డారు ఇందుశ్రీ. స్క్రిప్ట్ ప్రిపేర్ చేసుకోవడం, బొమ్మలు తయారు చేసుకోవటం పెద్ద పనులు. బొమ్మల తయారీలో, ఎంపికలో మొదటి నుంచి ఆమె తండ్రి రవీంద్ర సహకారం అందిస్తూ వస్తున్నారు. ఇప్పుడిప్పుడు తమ్ముడు లకితేష్, భర్త అశ్వత్ భేరి చేదోడుగా ఉంటున్నారు. ఇందులో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి కానీ, వాటిని నెగ్గకుని వచ్చారు ఇందుశ్రీ.

> **వెంట్రిలాక్విజమ్ మంచి కెరీర్. ఈ ఫీల్డులో అబ్బాయిలే ఉంటారని, అమ్మాయిలు రాకూడదని ఏ నిబంధనలూ లేవు. షోలు ఇస్తూనే ప్రస్తుతం నేను బెంగళూరులో ఎంఎస్ కమ్యూనికేషన్స్, బీఎఫ్ఏ కోర్సు చేస్తున్నాను. ఆసక్తి అమ్మాయిలకు, అబ్బాయిలకు వెంట్రిలాక్విజం నేర్పిస్తున్నాను. – ఇందుశ్రీ**



లైవ్‌లో డాగ్ వెంట్రిలాక్విజమ్!

బహుశా ఎవ్వరూ ఈ తరహా ప్రదర్శన చేసి ఉండరు. ఇందుశ్రీ చేశారు! బెంగళూరులో సోనీ, స్టార్, సీఎన్ఎన్ టీవీల్లో కుక్క బొమ్మతో కాకుండా, నిజంగా కుక్కతోనే వెంట్రిలాక్విజమ్ షో చేశారు. ముంబైలో అయితే 'ఇండియా హ్యాజ్ గాట్ టాలెంట్ షో'లో ఒకేసారి నాలుగు బొమ్మలతో .. (రెండు చేతుల్లో రెండు, రెండు కాళ్లతో రెండు) వెంట్రిలాక్విజమ్ చేశారు. ఒకోసారి ఆ ఈవెంట్‌ను ఎలా చేయగలిగానా అనిపిస్తుందట.

అభిమానులూ ఉన్నారు

2016లో బెంగళూరులో నారాయణ హృదయాలయంలో ఓ చిన్నారికి హార్ట్ ఆపరేషన్‌కు తేదీ నిర్ణయించారు డాక్టర్లు. కానీ ఆ చిన్నారి ఆపరేషన్‌కు రాను అంది. డాక్టర్లు కారణం అడిగారు. ''ఇందుశ్రీ అక్క వెంట్రిలాక్విజమ్ ప్రోగ్రామ్ ఉంది. చూడాలి అంది. డాక్టర్లు విస్తుపోయారు. ఇది తెలిసిన ఇందుశ్రీ వండర్ అయ్యారు.

22 ఏళ్లు.. 3,500 షోలు


బెంగళూరు సిటీకేబుల్‌లో ప్రోగ్రామ్స్‌తో పాటు, బయట 3,500 పై షోలు చేశారు ఇందుశ్రీ. వెంట్రిలాక్విజమ్‌లో 22 ఏళ్ల జర్నీ ఆమెది. అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, లండన్ లాంటి 16 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

టీ కప్పు, పుస్తకంతో కూడా మాట్లాడించగలిగారు. అలా అన్ని వస్తువులతో మాట్లాడించాలన్నదే ఆమె ఆశయం.

– కోన సుధాకర్ రెడ్డి, 'సాక్షి' సిటీ

సాక్షి ఫ్యామిలీ
సినిమా
నల్లగొండ
గురువారం
1-3-2018

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్..! నేను ఒక రోజు ఓ పెళ్లికి వెళ్లాను. ఆ పెళ్లిలో ఓ అమ్మాయిని చూశాను. చూడగానే నచ్చేసింది. తను నన్ను చూసి నవ్వింది. నేనూ తనని చూసి నవ్వాను. ఆ తరువాత తను కనిపించలేదు. ఏ పని చేస్తున్నా ఆమే గుర్తుకొస్తోంది. ప్లీజ్ హెల్ప్ చెయ్యండి. పెళ్లి జరిగిన ఊరు పేరు నల్లగుంట్ల. ఒకవేళ తను ఈ లవ్ డాక్టర్ చదివితే.. తనకు తెలుస్తుంది కదా తనని నేను ప్రేమిస్తున్నానని. సార్ ప్లీజ్ తనని కలవడం ఎలాగో చెప్పండి.

- మధు

♪ చూడు చెల్లమ్మా..! పాడు పిల్లోడు...!! ♪
నీకోసం గోల చేస్తాడు..!!

'ఏంటి సార్ ఆ పాట..?? దాంట్లో లవ్ లేదు సార్..! టీజింగ్ ఉంది..!?

♪ చూపులు కలసిన శుభవేళ.. ఎందుకు నీకీ
కలవరము..!? ♪

'ఏడ్చినట్టుంది సార్..! బ్లాక్ అండ్ వైట్ లవ్ స్టోరీ సార్ అది... మనకొద్దు!!'

♪ చూపులతో గుచ్చి గుచ్చి చంపకే.... ♪

'సార్!!! అమ్మాయి దొరికాక ఆ పాట పాడొచ్చు సార్.. అమ్మాయి మిస్సింగ్ సార్!'

♪ అరెరే ఎక్కడ.. ఎక్కడ.. ఎక్కడ.. ఎక్కడ.. ఎక్కడ.. నా ప్రాణం... ఈ ప్రశ్నకు నువ్వేలే సమాధానం...! ♪

'ఇప్పుడు వచ్చారు సారు ట్రాక్‌లోకి.. ఏసుకోండి ఇంకొకటి..!'

♪ ఎక్కడున్నావమ్మా ఓ ప్రియతమా... ఏది
అనుకోనమ్మా నీ చిరునామా!? ♪

'సూపర్ సార్ ఇంకొకటి...!'

♪ అడిగా.. అడిగా.. ఎదలో లయనడిగా.. కదిలే క్షణమా చెలి ఏదని...
నువ్వే లేని నన్ను ఊహించలేను. నా ప్రతి ఊహలోనూ వెతికితే మన కథే.. అడిగా అడిగా... ♪

'సార్ అడిగారు కదా..! అమ్మాయి రెస్పాండ్ అయ్యాక, నెక్స్ట్ కచేరీ పెట్టుకుందాం సార్!' అని నవ్వింది నీలాంబరి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

నేను నేనే

శ్రీదేవి తరచూ మీడియాతో మాట్లాడేవారు కాదు.. కానీ మాట్లాడినప్పుడల్లా పదే పదే మాట్లాడించాలనిపిస్తుంది. చదివేవాళ్లకూ పదే పదే చదవాలనిపిస్తుంది. అలాంటి కొన్ని 'సిరిమల్లె పువ్వులు' మీకోసం...

■ 'రియల్ శ్రీదేవి' ఎలా ఉంటారు?

నేను అందరిలానే సాధారణ మనిషిని. నేనంత ఇంట్రస్టింగ్ కూడా కాదు. ఇంకో తల్లిదండ్రుల బిడ్డను. 'రియల్ శ్రీదేవి' అంటే ఏంటో తెలియాలంటే నా ఇంటికి వచ్చి నన్ను చూడాలి. నాకు చాలా సిగ్గు. అంత త్వరగా ఎవరితోనూ కలవలేను. మాట్లాడలేను. కొత్త వాళ్లతో మాట్లాడాలంటే నాకు అన్ఈజీగా ఉంటుంది. సినిమాల్లో మాట్లాడేలా గలగలా మాట్లాడలేను. తక్కువగా మాట్లాడతా.

■ 'స్టార్‌డమ్'కి చేరుకున్నాక మీ ఫీలింగ్?

చిన్నప్పటి నుంచి నాకేదైనా ఇష్టం అంటే అది నా దగ్గరకు వచ్చేసేది. ఫర్ ఎగ్జాంపుల్ నాకేదైనా చీర నచ్చితే దానికోసం నేను షాప్‌కి వెళ్లక్కర్లేదు. అదే నా దగ్గరకు వచ్చేది. కోరుకున్నది మన దగ్గరికే వచ్చినప్పుడు జీవితం గురించి తెలుసుకునే చాన్స్ ఉండదు. ఆ విధంగా 'స్టార్‌డమ్' నాకు జీవితం గురించి తెలుసుకునే అవకాశం ఇవ్వలేదు.



● భర్తతో...

మాట్లాడమని బోనీజీ బతిమాలేవారు

మీరు స్వతహాగా మితభాషి కదా. ఇంట్లో కూడా అంతేనా?

నేను తక్కువగానే మాట్లాడతాను. కానీ నాకు క్లోజ్‌గా ఉన్నవారితో బాగానే మాట్లాడతా. వర్క్ చేసే దగ్గర వర్క్ గురించే మాట్లాడటం ముఖ్యమని భావిస్తా. చెబితే నమ్మరు కానీ కాస్త ఎక్కువగా మాట్లాడమని బోనీజీ మొదట్లో బతిమాలేవారు. ఆ తర్వాత మాత్రం సీన్ రివర్స్ అయ్యింది. మేం ఇద్దరం ఉన్నప్పుడు నేనే ఎక్కువగా మాట్లాడతా.




● పిల్లలతో...

పిల్లలు నన్ను వదిలి ఉండలేరు

● మీ పిల్లలు, మీరు అమ్మాకూతుళ్లలా కాకుండా అక్కచెల్లెళ్లలా ఉంటారు...

మేం సిస్టర్స్‌లానే బిహేవ్ చేస్తాం. నేనెక్కడికైనా వెళితే చాలు జాన్వీ పదే పదే ఫోన్లు చేస్తుంటుంది. ఖుషీ కూడా అంతే. నన్ను వదిలి ఉండలేరు. వాళ్లు నాతో అలా క్లోజ్‌గా ఉండటం, నా మీద ఆధారపడటం, చిన్న చిన్న విషయాల్లో నన్ను డిస్టర్బ్ చేయడం నాకెంతో ఫన్నీగా, హ్యాపీగా ఉంటుంది.

● జాన్వీ సినిమాలో నటిస్తోంది కదా.. తనకు మీరిచ్చిన సలహా?

మైండ్‌తో కాదు... హార్ట్‌తో వర్క్ చేయమని జాన్వీకి చెప్పాను. 'నో పెయిన్ నో గెయిన్' అని కూడా చెప్పాను.

అమ్మా... నీ విజయాలకు నేనే సాక్ష్యం

డియర్ మామ్..
నీ కీర్తి ప్రతిష్టలు, అంకితభావం, నిజాయితీ, స్ఫూర్తి గురించి వింటూ పెరుగుతున్నాను. నువ్వు సాధించిన విజయాలకు నేనే సాక్ష్యంగా ఉండటం నాకు ఆనందంగా ఉంది. జీవితంలో అన్నీ సాధించావు. నువ్వు సాధించిన ఈ ఘనత నన్ను ఈ ప్రపంచంలోనే గర్వపడే కూతుర్ని చేసింది.
నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాను...

- నీ కూతురు జాన్వీ

ఓ సందర్భంలో శ్రీదేవికి ఓపెన్ లెటర్ రాయమని ఓ పత్రిక ఆమె పెద్ద కుమార్తె జాన్వీని కోరగా ఆమె పై విధంగా రాశారట. తల్లంటే జాన్వీకి ఎంత ప్రేమ, గౌరవం ఉన్నాయో అర్థమవుతోంది కదూ.

■ నటిగా మీకు నచ్చని విషయం ఏంటి?

మీరు ఫలానా సినిమాలో అందంగా ఉన్నారని అభినందిస్తే నాకు నచ్చదు. ఆ కాంప్లిమెంట్‌కి రియాక్ట్ అవ్వను. అదే 'మీరు ఆ సినిమాలో చాలా బాగా యాక్ట్ చేశారు' అంటే అప్పుడు చాలా ఆనందపడతా. ప్రౌడ్‌గా ఫీల్ అవుతాను.

■ మీలా అందంగా, స్లిమ్‌గా కనిపించాలంటే ఏం చేయాలి?

అందంగా ఉండటమంటే డైట్ ఫాలో అవ్వడం, జిమ్‌కు వెళ్లడం కాదు. మానసికంగా సంతోషంగా ఉండటం. మన స్టేట్ ఆఫ్ మైండ్ ఎలా ఉందనేది మన లుక్స్ నిర్దేశిస్తాయి. లోపల సంతోషంగా లేనప్పుడు డైట్ ఫాలో అయ్యి, ఎంత జిమ్ చేసినా ఉపయోగం ఉండదు.

■ వేరే హీరోయిన్స్‌తో పోటీ?

పోటీ అనేది సమఉజ్జీల మధ్య ఉంటుంది. ప్రస్తుతానికి నా సమఉజ్జీ శ్రీదేవీయే. నాకు నేనే పోటీ.

■ మీ సినిమాల గురించి జాన్వీ, ఖుషీలు ఏమంటారు?

నేను నటించిన పాత సినిమాలను జాన్వీ, ఖుషీ అంతగా చూడలేదు. కానీ ఎప్పుడైనా టీవీల్లో వచ్చినప్పుడు మాత్రం తప్పకుండా చూస్తారు. ఆ సినిమాల్లో నేను వేసుకున్న డ్రెస్‌లను అబ్జర్వ్ చేస్తారు. నేను కొన్ని సినిమాలకు ట్రెండీ డ్రెస్‌లను వాడాను. అవి బాగున్నాయంటారు. బాగా యాక్ట్ చేశావని కాంప్లిమెంట్స్ ఇస్తారు.

■ సినిమాలంటే మీకు చాలా ఇష్టమా?

నాలుగేళ్ల వయసు నుంచే నటించడం స్టార్ట్ చేశాను. అందరి అమ్మాయిల్లా నేను పెరగలేదు. నా చిన్నతనంలో స్టూడియోస్‌లోనే ఎక్కువ టైమ్ స్పెండ్ చేసేదాన్ని. ఒకవేళ స్టూడియో వాతావరణాన్ని ఇష్టపడకపోయి ఉంటే ఎప్పుడో సినిమాలు వదిలేసేదాన్నేమో. ఒక సినిమా చేయాల్సి వచ్చినప్పుడు ఎంత కష్టాన్నయినా ఇష్టంగా భావిస్తాను.

■ మీ భర్త బోనీకపూర్ మిమ్మల్ని ఆటపట్టిస్తారా?

నేను క్రమశిక్షణగా ఉంటాను. బోనీజీ 'నువ్వేమైనా సాధువులా జీవిస్తున్నావా?' అని ఆటపట్టిస్తారు. కానీ నా ఇష్టాలను ఆయన ఎప్పుడూ కాదనలేదు.

■ యంగర్ జనరేషన్‌కి మీరిచ్చే సలహా?

సక్సెస్‌నే కాదు ఫెయిల్యూర్‌నూ తట్టుకోగల మైండ్ సెట్‌ను ఇంప్రూవ్ చేసుకోవాలి. లైఫ్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కృతజ్ఞతాభావం, మానవత్వం ఉండాలి.

మరణం తర్వాత...

మీరు బాధపడే విషయం :	మరణం తర్వాత జీవితం ఉండదని
మీ విలువైన ఆస్తి :	నా ఫ్యామిలీ
మీకు బోర్ కొట్టించేది :	షూటింగ్‌లో ఏదైనా జరిగినప్పుడు హాస్పిటల్‌కు పరిగెత్తడం
మీ సెక్స్ అపీల్ :	నా జీన్స్ (జన్యువులు)
మీ బలం :	ఏది జరిగితే దాన్ని ఆమోదించడం
మీకు నచ్చే మీ ఫేవరెట్ క్వాలిటీ :	నా ఎమోషన్స్
మిమ్మల్ని చిరాకు పెట్టించేది :	రీ-మేక్ మూవీస్‌లో రీ-టేక్స్ తీసుకోవడం
బర్త్‌డే అంటే :	ఎడ్జ్‌కు ఇంకొంచెం దగ్గరకి వచ్చేశాం అని గుర్తు చేసే రోజు


రేపటి నుంచి సినిమాల ప్రదర్శన బంద్


● ముత్యాల రాందాస్
కేఎల్ దామోదర్ ప్రసాద్

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (క్యూబ్, యూఎఫ్‌ఓ) వసూలు చేస్తున్న వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్) తగ్గించనందుకు నిరసనగా శుక్రవారం నుంచి థియేటర్స్‌లో సినిమాల ప్రదర్శన నిలిపివేస్తున్నట్లు 'దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)' స్పష్టం చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ డిజిటల్ కమిటీ చైర్మన్ కె.ఎల్. దామోదర్ ప్రసాద్, తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ ముత్యాల రాందాస్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ– ''2007–2008 కాలం నుంచి సినిమా ప్రింట్ నుంచి డిజిటల్‌లోకి మారుతూ వచ్చింది. వీపీఎఫ్ నామమాత్రమే చెల్లించండి.. ఐదేళ్ల తర్వాత చెల్లించాల్సిన అవసరం లేదు.. ప్రకటనల రూపంలో మేం ఆదాయం సమకూర్చుకుంటామంటూ చెప్పిన క్యూబ్, యూఎఫ్‌ఓ యాజమాన్యాలు ఇప్పుడు మాట మారుస్తున్నాయి. ప్రకటనల ద్వారా అధిక ఆదాయం పొందడంతో పాటు వీపీఎఫ్‌నూ అధికంగా వసూలు చేస్తున్నాయి. ఇది సినిమా వర్గాలకు భారంగా మారుతోంది. కొన్ని సినిమాలకు వీపీఎఫ్ డబ్బులు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీనిపై కలిసికట్టుగా పోరాటం చేసేందుకు ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళ చిత్రవర్గాలు నిర్మాత డి.సురేశ్‌బాబు చైర్మన్‌గా, నిర్మాత కిరణ్ కన్వీనర్‌గా 'దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ'ని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ అధ్యక్షతన ఫిబ్రవరి 16న చెన్నైలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశం నిర్వహించాం. ప్రస్తుతం వసూలు చేస్తున్న వీపీఎఫ్‌ని 25శాతానికి తగ్గించి.. ఏడాది తర్వాత ఆ ఫీజు మొత్తం వసూలు చేయకూడదనీ.. రెండు సినిమా యాడ్స్ మాకు ఇవ్వాలనీ.. వాణిజ్య ప్రకటనలు 8 నిమిషాలకు మించి ప్రదర్శించరాదని చెప్పాం. ఫీజును 10 శాతం తగ్గిస్తామని వారు అంటే ఒప్పుకోలేదు. ఫిబ్రవరి 23న బెంగళూరులో మరో సమావేశం నిర్వహించగా, 9శాతం మాత్రమే తగ్గిస్తామన్నారు. సినిమా ఇండస్ట్రీ మీద ఆధారపడి బ్రతికే ఓ వ్యక్తి 'ఆల్ ది బెస్ట్ టు ఇండస్ట్రీ' అని వ్యంగ్యంగా అంటూ సమావేశం నుంచి వెళ్లిపోయాడు. మా డిమాండ్లకు ఒప్పుకోకుంటే మార్చి 2నుంచి సినిమా ప్రదర్శన నిలిపివేస్తామని వారికి స్పష్టం చేశాం. మా నిర్ణయానికి సౌత్ ఇండస్ట్రీలోని నిర్మాతలు, ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్ అందరూ మద్దతు పలికారు. తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కొత్త డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నా క్యూబ్, యూఎఫ్‌ఓ కంపెనీలు అడ్డుకుంటున్నాయి. ప్రస్తుత డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు మా డిమాండ్లు ఒప్పుకుంటే సినిమాల ప్రదర్శన ఉంటుంది. వారు ఒప్పుకున్నా కొత్త డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు వెనకడుగు వేయం'' అన్నారు.

నాలో జాన్వీని చూశారు

'ఇంగ్లిష్–వింగ్లిష్'తో కమ్‌బ్యాక్ తర్వాత శ్రీదేవి 'పులి' చిత్రంలో నటించిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీదేవి కూతురుగా నటించిన హన్సిక నిజంగా కూడా తనని ఓ కూతురిలానే చూశారని చెప్పారు. శ్రీదేవి గురించి మాట్లాడుతూ...


● హన్సిక

● నేనొక్కదాన్నే కాదు శ్రీదేవి మేడమ్‌ను చూసి చాలామంది ఇన్‌స్పైర్ అయ్యారు. తనొక లెజెండ్. ఇండియన్ సినిమాకి ఇదొక డార్క్ డే అనుకోవచ్చు. ఒక గొప్ప టాలెంటెడ్ యాక్టర్‌ను కోల్పోయింది. శ్రీదేవిగారితో యాక్ట్ చేసే అదృష్టం నాకు దక్కినందుకు చాలా గర్వంగా ఉంది. శ్రీదేవిగారితో స్క్రీన్ షేర్ చేసుకోవడాన్ని చాలా ఎంజాయ్ చేశాను.

● తను చాలా కైండ్, పొలైట్, ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తూ ఉంటారు. తనతో నేను మాట్లాడినప్పుడు 'జాన్వీ, నేను ఇలానే మాట్లాడుకునేవాళ్లం, జాన్వీని నేను చాలా మిస్ అవుతున్నాను' అనేవారు. మా ఇద్దరి స్టార్ సైన్స్ (రాశులు) ఒక్కటే. మేం బాగా కలిసిపోయాం. అంత త్వరగా దేవుడు శ్రీదేవిగారిని తీసుకువెళ్లిపోవటం అన్యాయం. శ్రీదేవిగారు ఎక్కడున్నా ఆవిడ ఆత్మ శాంతిస్తుందనే అనుకుంటున్నాను. ఇండియన్ సినిమా డెఫినెట్‌గా ఒక లెజెండ్‌ను మిస్ అవుతుంది'' అన్నారు.

పిల్లల ముఖాలు చూడలేకపోయా


● అశ్వినీదత్

ఆఖరి పోరాటం, జగదేకవీరుడు అతిలోక సుందరి, గోవిందా గోవిందా... శ్రీదేవి కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఈ మూడు చిత్రాలకూ ప్రత్యేకమైన స్థానం ఉంది. వైజయంతీ మూవీస్ పతాకంపై ఈ చిత్రాలను నిర్మించిన అశ్వినీదత్ ముంబై వెళ్లి, శ్రీదేవి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్రీదేవి కూతుళ్లు జాన్వీ, ఖుషీ ఎలా ఉన్నారు? అని అడిగిన 'సాక్షి'తో ''పిల్లల ముఖాలు చూడలేకపోయాను. ఆ కుటుంబం మొత్తం బాధలో ఉంది. శ్రీదేవి మరణం ఆ కుటుంబానికే కాదు.. అందరికీ పెద్ద షాక్'' అన్నారు. శ్రీదేవి ప్రొడ్యూసర్స్ ఆర్టిస్టేనా? ఎప్పుడైనా నిర్మాతలను ఇబ్బందిపెట్టారా? అని అడిగితే – ''హండ్రెడ్ పర్సెంట్ ప్రొడ్యూసర్స్ హీరోయిన్. అందుకు ఉదాహరణగా ఒకే ఒక్క సంఘటన చెబుతాను. 'గోవిందా గోవిందా' షూటింగ్ తిరుపతిలో జరిగినప్పుడు ఒకరోజు తెల్లవారుజాము నాలుగు గంటలకు లోబీపీతో శ్రీదేవి పడిపోయింది. అప్పుడు పెదవి పగిలి, రక్తం వచ్చింది. నేను చాలా కంగారుపడి, వెంటనే మద్రాసులో మంచి హాస్పటల్‌కి తీసుకెళ్లడానికి రెడీ అయ్యాను. కానీ షూటింగ్ డిస్టర్బ్ అవుతుందని తిరుపతిలో ఓ లోకల్ హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ చేయించుకుని షూటింగ్ చేసింది. పెదవి వాపు కనపడనివ్వకుండా మేకప్‌తో మేనేజ్ చేసింది. చాలా డిగ్నిఫైడ్‌గా ఉండేది. ఎన్టీఆర్‌గారు ఎంత డిగ్నిఫైడ్‌గా ఉండేవారో శ్రీదేవి అలా ఉండేది. ఒక్క మాటలో చెప్పాలంటే తను 'లేడీ ఎన్టీఆర్'. ఆమెలాంటి హీరోయిన్స్‌ని చూడలేం'' అన్నారు. పారితోషికం విషయంలో పట్టువిడుపుగా ఉండేవారా? డిమాండ్ చేసేవారా? అన్న ప్రశ్నకు – ''అసలు ఆ విషయాలేవీ శ్రీదేవికి తెలియదు. అంతా వాళ్ల అమ్మగారే చూసుకునేవారు. చెప్పిన టైమ్‌కి షూటింగ్‌కి రావడం, ఇబ్బంది పెట్టకుండా నటించడం.. ఇదే శ్రీదేవికి తెలుసు. ఆ క్రమశిక్షణే తనను పెద్ద స్థాయికి తీసుకెళ్లింది. ఎంత పెద్ద రేంజ్‌కి వెళ్లినా ఒదిగి ఉన్న హీరోయిన్. హిందీ సినిమాలు చేయడం మొదలుపెట్టాక అక్కడ బిజీగా ఉన్నా నేను అడగ్గానే కాదనకుండా 'ఆఖరి పోరాటం', 'జగదేకవీరుడు అతిలోక సుందరి' సినిమాలు చేసింది. ఆ రెండూ మా వైజయంతీ మూవీస్‌కి టర్నింగ్ పాయింట్ అయ్యాయి. ఆ తర్వాత చేసిన 'గోవిందా గోవిందా' కూడా సూపర్ హిట్'' అన్నారు.

ఆ విషయం శ్రీదేవిగారికి చెప్పాలని ఉంది

'నటిగా మీకెవరు ఇన్‌స్పిరేషన్?' అని శ్రియను ఓ ఇంటర్వ్యూలో 'సాక్షి' అడిగితే... 'శ్రీదేవి' అన్నారు. తనకు ఆదర్శంగా నిలిచిన శ్రీదేవి భౌతికంగా దూరం కావడం జీర్ణించుకోలేకపోతున్నా అన్నారు. శ్రియ మనోభావాలు ఈ విధంగా...


● శ్రియ

● నేనీ రోజు యాక్టర్ అయ్యానంటే శ్రీదేవి గారు కూడా ఒక కారణం. నాకు చిన్నప్పుడు చికెన్ పాక్స్ వస్తే ఇంటిపట్టున ఉండాల్సి వచ్చింది. దాంతో కొద్దిసేపు శ్రీదేవిగారి డ్యాన్స్ చూసి, ఆ తర్వాత కొంచెంసేపు చదువుకునేదాన్ని. నేను చదువుకోవటానికి మా పేరెంట్స్ నాకు ఇచ్చిన లంచం 'శ్రీదేవిగారి డ్యాన్స్ వీడియోలు'. జస్ట్ ఒక్క నిమిషం వీడియోలో కూడా శ్రీదేవిగారు చేసే మ్యాజిక్ ఎవ్వరూ చేయలేరు. ప్రస్తుతం మీడియా (అందరూ కాదు) తనకు ఏం చేస్తోందో చూస్తుంటే చాలా విచారంగా ఉంది. తన ఇమేజ్‌ను ముక్కలు ముక్కలుగా చింపేస్తున్నారు. తన పర్సనల్ లైఫ్ ఏదో సేల్‌కు ఉన్నట్లుగా... ఇప్పుడైనా తన ఆత్మను శాంతంగా ఉండనీయండి ప్లీజ్. ● హీరోయిన్ రోల్‌లో కూడా హీరో అంత డైనమిక్‌గా ఉండగల ఓకే ఒక ఉమన్ శ్రీదేవి. మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీలో థియేటర్లకు జనాల్ని రప్పించగల క్రౌడ్‌పుల్లర్ శ్రీదేవి. చాలా త్వరగా విడిచి వెళ్లిపోయారు. ఇది చాలా అన్యాయం. శ్రీదేవిగారు చనిపోయారనే విషయం తెలియగానే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ కన్నీళ్లు నేను ఆమెకు అందించిన నివాళి. నాకొక్క అవకాశం వస్తే తనను నేనెంతగా ఆరాధించానో, అభిమానించానో శ్రీదేవిగారికి చెప్పాలనుంది. ఆమె మనందరి మదిలో ఒక బ్యూటిఫుల్ మెమొరీ. ఎవరో మన చైల్డ్‌హుడ్ బ్యూటిఫుల్ మెమొరీని లాక్కెళ్లిపోయినట్టుగా ఉంది.



సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ
గురువారం
1-3-2018

అన్నం వండి ఆర్సెనిక్ వార్చేయండి!


వరి అన్నంలో ఆర్సెనిక్ విషం ఉంటుందంటున్న నిపుణులు

మీరు నమ్మినా, నమ్మకున్నా మనం తినే అన్నంలో భయంకరమైన విషం ఉందంటున్నారు ఆహార, రసాయన నిపుణులు. దాని పేరే ఆర్సెనిక్. ఆ విషం విషయమేమిటో తెలుసుకోవాలంటే అసలు ముందుగా ఆర్సెనిక్ అంటే ఏమిటో తెలుసుకుంటే మంచిది. పూర్వకాలంలో రాజరిక పరిపాలన సమయంలో, అంతఃపుర కుట్రల్లో ప్రత్యర్థులను నిశ్శబ్దంగా మట్టుబెట్టడానికి ఉపయోగించే విషమే ఆర్సెనిక్. ఇది ఎంత ప్రభావవంతమైనదంటే నెమ్మదిగా ఇస్తూపోతే స్వాభావిక మరణంలా అనిపించేలా మృత్యువు పాలవుతారు. లేదా పెద్దమోతాదులో ఇస్తే తక్కున మృతిచెందుతారు. ప్రముఖ నియంత నెపోలియన్ ఆర్సెనిక్ పాయిజనింగ్‌తో మరణించాడనే మాట ఒకటి ప్రచారంలో ఉంది. ఇక జేమ్స్‌బాండ్ సినిమాల్లోని గూఢచారులు శత్రువుల చేతికి చిక్కినప్పుడు ఒక విషపు మాత్రను నోట్లో వేసుకొని మరణిస్తుంటారు. ఇందుకోసం ఉపయోగించే విషాలలో ఒకటి సైనైడ్ కాగా రెండోది ఆర్సెనిక్. అయితే శత్రువులను తుదముట్టించడం కోసం ఉపయోగించేందుకు ఆర్సెనిక్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా అన్నం పెడితే సరిపోతుందా అన్న పరిస్థితి ఇటీవల మన సమాజం ముందుంది. కాస్త అతిశయోక్తిగా అనిపించినా ఇది నిజం అంటున్నారు ఆహార, రసాయన నిపుణులు.

రసాయన ఎరువులు, పురుగుమందులతో మట్టిలోకి అన్ని విషాలతో పాటు ఆర్సెనిక్ ఇంకుతోంది. అది మళ్లీ మొక్కల్లోంచి మనుషుల దేహాల్లోకి వచ్చి ప్రమాదఘంటికలను మోగిస్తోందని వారు హెచ్చరిస్తున్నారు. ఆ ప్రమాదం నుంచి తప్పుకోవడం ఎలాగో కూడా సూచిస్తున్నారు. ఆ విషయాలను తెలుసుకునేందుకు పుణేలోని నేషనల్ కెమికల్ లేబరేటరీకి చెందిన నిపుణులు చెబుతున్న అంశాలివి...

రసాయనిక ఎరువుల, పురుగుమందుల విస్తృత ఉపయోగంతో మనం తినే వరి అన్నం, బంగాళదుంపలు తదితర ఆహార పదార్థాల్లోకి విషం... అందునా ప్రమాదకరమైన ఆర్సెనిక్ విషం చేరే అవకాశాలు ఎక్కువ. దీనివల్ల డయాబెటిస్, క్యాన్సర్ వ్యాధులు వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని హెచ్చరిస్తున్నారు పుణేలోని ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ కెమికల్ లేబరేటరీ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఓ. జి. బి. నంబియార్. మనం తినే ఆహారంలోని విషపదార్థాలపై అనేక ఆసక్తికరమైన అంశాలను ఆయన వెల్లడించారు. మన దేహం నుంచి వ్యర్థాల రూపంలో విసర్జితమైపోయే ఆర్సెనిక్‌తోపాటు మనకు అవసరమైన థయామిన్ పోషకం దేహం నుంచి అతిగా బయటకు వెళ్లిపోతుండడం వల్ల డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఆయన చెప్పారు. అయితే దీనికి విరుగుడు కూడా ఆయన సూచిస్తున్నారు. వరి అన్నం వండినప్పుడు గంజి వార్చితే బియ్యంలోని ఆర్సెనిక్ విషం చాలా వరకు పోతుందని ఒక పరిష్కారం చెబుతున్నారు. అయితే మరికొన్ని ప్రత్యామ్నాయ ఆహారాలను ఆయన సూచిస్తున్నారు. థయామిన్ పుష్కలంగా ఉండే కొర్రలు వంటి చిరుధాన్యాలను ప్రధాన ఆహారంగా తీసుకుంటే ఆర్సెనిక్ బాధ తప్పుతుందని, థయామిన్ కొరత ఉండదు కాబట్టి డయాబెటిస్ సమస్య కూడా రాకుండా ఉంటుందని ఆయన అంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రకృతి ఆహారోత్సవంలో పాల్గొన్న డాక్టర్ నంబియార్ 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. వివరాలు.. ఆయన మాటల్లోనే..

- మనిషి దేహంలోకి వరి అన్నం, బంగాళదుంపల ద్వారా ఆర్సెనిక్ విషం ప్రవేశిస్తుంది. అలా ప్రవేశించే ఆ ఆర్సెనిక్ రక్తంలోని థయామిన్‌ను మూత్రం ద్వారా అతిగా బయటకు వెళ్లిపోయేలా చేస్తుంటుంది. థయామిన్ మనకు ఉపయోగకరమైన, అత్యంత కీలకమైన పోషకం. అది పోవడం మనకు నష్టం.
- ఆహారంలో ఆర్సెనిక్ ఉన్నప్పుడు థయామిన్ ఎంత ప్రభావపూర్వకంగా పనిచేయాలో అంతగా పనిచేయదు. దాంతో మన శరీరంలో స్రవించిన ఇన్సులిన్ కూడా ఎంత ప్రభావవంతగా ఉండాలో అంత ప్రభావవంతంగా తన కార్యకలాపాలు సాగించలేదు. ఫలితంగా 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' వస్తుంది. సరిగ్గా ఇలాంటి పరిణామమే టైప్–2 డయాబెటిస్‌లోనూ ఉంటుంది.
- ఇక డయాబెటిస్ రోగుల దేహంలో వారి అవసరాలతో పోలిస్తే కేవలం 20% మాత్రమే థయామిన్ అందుబాటులో ఉంటుంది.
- థయామిన్ గ్లూకోజ్‌తో జత చేరినప్పుడే జీవక్రియ సక్రమంగా జరుగుతుంది. అయితే థయామిన్ లోపం వల్ల జీవక్రియలు సక్రమంగా జరగకపోవడంతో పాటు అనేక వరస పరిణామాలు సంభవిస్తాయి.
- 2012–15 మధ్యకాలంలో అమెరికాకు చెందిన ఎఫ్.డి.ఎ. 1200 రకాల వరి బియ్యంపై అధ్యయనం చేసి... వరి బియ్యంలో అధికపాళ్లలో ఆర్సెనిక్ విషం ఉందని నిర్ధారణ చేసింది.
- చాలా మంది ఆరోగ్యం కోసం పాలిష్ చేసిన బియ్యం కంటే పాలిష్ చేయని ముడిబియ్యాన్ని వాడుతుంటారు. పాలిష్ చేసిన బియ్యంలో పోషకాలు వెళ్లిపోతాయని, అదే ముడిబియ్యంలో పోషకాలు చాలావరకు పోవని చాలామందిలో ఒక అభిప్రాయం ఉంది. అయితే పాలిష్ చెయ్యని ముడిబియ్యంలో ఆర్సెనిక్ విషం మరింత ఎక్కువగా ఉంటుంది. బియ్యం పైపొరలో ఆర్సెనిక్ విషం ఎక్కువగా ఉంటుంది. ●



ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి



ఆర్సనిక్ విష ప్రభావాలు తగ్గించే దిశగా మరికొన్ని పరిశోధనలూ జరుగుతున్నాయంటున్నారు డాక్టర్ నంబియార్. వాటి గురించి ఆయన చెబుతున్న అంశాలివి...

- రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నప్పటి నుంచి, అధిక దిగుబడి వరి వంగడాలను వాడుతున్నప్పటి నుంచి ఆర్సెనిక్ విషం వరి అన్నంలో ఎక్కువ మోతాదులో ఉంటున్నదేమో అనే విషయంపై ఇంకా అధ్యయనం చేయాల్సి ఉంది.
- ఒక బాక్టీరియా ద్రావణాన్ని ఉపయోగించడం ద్వారా వరి మొక్కల వేళ్లు ఆర్సెనిక్ విషాన్ని మట్టి నుంచి పీల్చుకోకుండా ఉండే ఒక సాగు పద్ధతిపై నా అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. ఇది విజయవంతమైతే ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు మేలు జరుగుతుంది. అయితే ఈ పరిశోధన పూర్తికావడానికి ఇంకా కొన్నాళ్ల సమయం పడుతుంది
- వరి బియ్యం, బంగాళదుంపలు, ఇతర ధాన్యాలు, మూత్రం, నీరు, గోళ్లు, వెంట్రుకలలో ఆర్సెనిక్ ఎంత ఉన్నదీ 20 నిమిషాల్లో తెలిపే ఒక కిట్ (క్వాంటిటేటివ్ ఆర్సెనిక్ మోనిటర్)ను నేను కనుగొన్నాను. యునిసెఫ్ ఆర్థిక సహాయంతో బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్‌లలో తాగునీటిలో ఆర్సెనిక్‌పై పరిశోధనలో భాగంగా 2000 సంవత్సరంలో దీన్ని కనుగొన్నాను. దీన్ని సాధారణ వ్యక్తి ఎవరైనా ఉపయోగించి ఆయా ఆహార పదార్థాల్లో ఆర్సెనిక్ ఎంత ఉందో తెలుసుకోవచ్చు
- డయాబెటిక్ రోగులు బెన్ ఫో థయామిన్ (విటమిన్ బి1) 200 ఎం.జి. టాబ్లెట్‌ను భోజనంతో పాటుగా (రోజుకు రెండు) తీసుకోవచ్చు. వట్టి థయామిన్ మాత్ర తీసుకోవడం కన్నా కొవ్వులో కరిగే థయామిన్ డెరివేటివ్‌ను వాడటం మంచిది.

భయం లేదు... జాగ్రత్తలివే...



- కొర్రలు వంటి చిరుధాన్యాలు థయామిన్ అధికపాళ్లలో కలిగి ఉంటాయి గాకీ ఆర్సెనిక్‌ను ఏమాత్రం కలిగి ఉండవు. ఇలాంటి విషం లేని వాటిని ప్రధాన ఆహారంగా తీసుకుంటే సమస్య ఉండదు. అయితే, వరి బియ్యం తినటం అనేది అనాదిగా మన ఆహారపు అలవాటు. వరి బియ్యం తినటాన్ని వెంటనే మానుకోలేం. కాబట్టి వరి బియ్యాన్ని ఆరు రెట్లు ఎక్కువ నీరు పోసి ఉడికించి... గంజి వార్చి పారబోస్తే అన్నంలోని ఆర్సెనిక్ చాలా వరకు పోతుంది. అయితే ఇలా వార్చిన గంజి పశువులకు కూడా మంచిది కాదు.
- వరి మొక్కల వేళ్ల మాదిరిగానే బంగాళదుంప మొక్కల వేళ్లు కూడా ఆర్సెనిక్ విషాన్ని మట్టి నుంచి ఎక్కువగా గ్రహిస్తుంటాయి. బంగాళదుంపల్లో 70 శాతం నీరుంటుంది. బంగాళదుంప చిప్స్‌లో ఆర్సెనిక్ విషం పాళ్లు ఎక్కువగా ఉంటాయి. బంగాళదుంపను కోసి బాగా కడిగితే ఆర్సెనిక్ పోతుంది. కడగకుండా అలాగే వేపితే ఆర్సెనిక్ అందులోనే ఉండిపోతుంది.
- గర్భవతులు వరి బియ్యంతో వండిన అన్నం అసలు తినకుండా చిరుధాన్యాలు తదితర ఆహార ధాన్యాలు తినటం మంచిది. ఐదేళ్ల లోపు పిల్లలకు కూడా వరి అన్నం తినిపించకుండా ఉంటేనే మంచిది. వారికి మొదటినుంచి చిరుధాన్యాలతో చేసిన వంటకాలు తినిపించడం మంచిది.

కౌన్సెలింగ్

అమ్మాయే మనకు ముఖ్యం పరువు అనే ఆలోచనే వద్దు





ప్రతీకాత్మక చిత్రం

ప్రశ్న: మాది ప్రకాశంజిల్లా. నా చిన్న కూతురు మా వూర్లోనే ఉండే మా బంధువుల అబ్బాయి మాయలోపడి అతనితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆ దిగులుతో నా భర్త ఇటీవలే అనారోగ్యంతో చనిపోయాడు.

మైనర్‌గా ఉన్నప్పుడే అతనిని పెళ్లిచేసుకుంటానని మా అమ్మాయి మమ్మల్ని అడిగితే... 'నీదింకా చిన్నవయసు. పెళ్లీడు కూడా రాలేదు. ముందు చదువుకొమ్మ'ని చెప్పాం. అతనికి ఏ ఉద్యోగమూ లేదు. నిన్నెలా పోషిస్తాడంటూ ఆమెను సర్దిచెప్పే ప్రయత్నం చేశాం. ఆ తర్వాత కూడా ఆ అబ్బాయి మా అమ్మాయి వెంటపడటం ఆపలేదు. మా అమ్మాయికి కూడా చదువు మీద శ్రద్ధ పోయింది. ఎంతో కష్టపడి బతికేవాళ్లం. పెద్దమ్మాయిని టెంత్‌తోనే ఆపేయించాం. కనీసం ఈ అమ్మాయినైనా చదివించాలనుకున్నాం. కానీ మమ్మల్ని కాదని అతని వెంట వెళ్లిపోయింది. సమస్య అది కాదు. అమ్మాయి అతనితో వెళ్లిపోయి 9 నెలలు కావస్తోంది. కానీ ఇంత వరకూ అతను పెళ్లి చేసుకోలేదు. అంతేకాదు వాళ్లింటికి కూడా తీసుకురాకుండా మా వూరికి 15 కి.మీ. దూరంలో ఉన్న టౌన్‌లో ఉంచాడని విన్నాం.

ఈ మధ్య అబ్బాయి వాళ్లమ్మానాన్న అతనికి వేరే సంబంధాలు వెతుకుతున్నారని తెలిసింది. ఇదేంటని అడిగితే 'ఐదు లక్షలిస్తే మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా'నని రాయబారం పంపాడు. అయితే ఈ మధ్యే మా అమ్మాయికి అబార్షన్ కూడా చేయించాడని తెలిసింది. అమ్మాయి ఆరోగ్యం ఎలావుందోననే బెంగ ఒకవైపు, నా భర్తపోయిన దిగులు మరోవైపు... నాకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఒకవైపు లోకం కాకై పొడుస్తోంది. బయటకెళ్లాలంటే నరకంగా ఉంది. కనీసం వాళ్లిద్దరూ కలిసి ఏదో కష్టం చేసుకొని బతుకుతారనుకుంటే వాళ్ల తల్లీదండ్రీ వేరే సంబంధాలు వెతుకుతున్నారు. ఆ అబ్బాయిని నమ్మి వెళ్లినందుకు నా కూతురి జీవితం నా కళ్ల ముందే నాశనం అవుతున్నా ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. మా సమస్యకు పరిష్కారం చూపి, నా బిడ్డ జీవితాన్ని కాపాడండి.

- ఒక అభాగ్యురాలు

జ: వుమన్ ప్రొటెక్షన్ సెల్‌లో కంప్లెయింట్ చేయాలి. ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇప్పించాలి. కౌన్సెలింగ్ ద్వారా పరిస్థితిలో మార్పు వస్తుందేమో చూడాలి. కానీ ఇటువంటి కేసుల్లో ఇది అంత తేలిక కాదు. నా అనుభవంలో చాలా కేసులు చూసాను. బలవంతంపైన పెళ్లి చేసుకున్నా, రేపు సరిగ్గా ఉంటాడన్న నమ్మకం లేదు. వద్దు వద్దు అంటే బలవంతంగా పెళ్లి చేయడం అనవసరం. కానీ, చేసిన ద్రోహానికి అతను శిక్ష అనుభవించితీరక తప్పదు. ముందు ఆ అమ్మాయిని అతని కస్టడీలోంచి బయటపడేయాలి. లేదంటే చాలా ప్రమాదం. ఆమెకి అబార్షన్ అయినంత మాత్రాన ఏదో కొంపమునిగిపోయినట్టు భావించాల్సిన పనిలేదు. సామాజిక గౌరవాలూ, పరువూ అంటూ మోరలిస్టిక్‌గా ఆలోచించడం మానుకొని, ఆ అమ్మాయిని కాపాడే ప్రయత్నం చేయాలి. అంతేగానీ ఒకసారి బయటకు వెళ్లింది కాబట్టి అతడితోటే ఉండాలని అనుకోవద్దు. అమ్మాయి చిన్న పిల్ల. అతనితో వెళ్లాకకానీ అతని స్వభావం తెలియలేదు. యిప్పుడు నీతిబోధల కంటే ఆ అమ్మాయి ప్రాణాలు ముఖ్యం. తక్షణమే ఆ అమ్మాయిని ఇంటికి తెచ్చుకోండి. అందుకే పిల్లలకు మంచి చెడులను గుర్తించే జ్ఞానాన్నివ్వాలి. తమంత తాము నిర్ణయాలు తీసుకునేటప్పుడైనా అది పనికివస్తుంది.



- కల్పన కన్నాభిరాన్, డైరెక్టర్,
కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్

మాకు పంపండి: ఒక మహిళగా మీరు గృహహింస వంటి వేధింపులకు గానీ, సామాజికంగా వివక్షకుగానీ లేదా సంబంధిత ఇతర సమస్యలతో బాధపడుతున్నారా? మీ సమస్యను రాసి మాకు మెయిల్ ద్వారా పంపించండి. ఆయా రంగాలకు చెందిన నిపుణులతో మీకు తగిన సూచనలు / సలహాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. మీరు మీ ప్రశ్నలను పంపాల్సిన మెయిల్ ఐడీ : nenusakthiquestions@gmail.com

---

మళ్లీ చెప్పకుందాం! రీటోల్డ్ కథలు - 19

మామూలుకు శిక్ష



● రంగనాయకమ్మ





బాత్‌రూమ్‌లో అరగంటకు పైగా చాటింగ్ అయిపోయింది. ముద్దులు అయిపోయాయి. గుడ్‌నైట్‌లు ముగిశాయి. ఇంకా సమయం తీసుకుంటే అనుమానం వస్తుందని స్నానం ముగించి పైజమా టీ షర్ట్ వేసుకుని డైనింగ్ టేబుల్ మీద డిన్నర్‌కి కూచుంటే తల్లి వచ్చి సొరకాయ పాయసం పెట్టింది.

పాలు, చక్కెర వేసి, వేయించిన జీడిపప్పులు తేలుతుండగా సువాసనలీనుతున్న లేతాకుపచ్చ పాయసం.

గతుక్కుమంది.

'ఏంటమ్మా విశేషం?'

'తినరా మాట్లాడదాం'

పై ప్రాణాలు పైనే పోయాయి.

ఇంట్లో తీపి చేయడం మామూలే. భార్య చేస్తుంది. పెళ్లయినప్పటి నుంచి తల్లిని వంటింట్లోకి రానివ్వకుండా తల్లే అన్నంత బాగా చూసుకుంటూ వంట తనే చేస్తుంది. తీపి కూడా చేస్తుంది. కాని తల్లి వంటగదిలో దూరి ఈ పాయసం చేసిందంటే ఆ సూచన మంచిది కాదు. ఏదైనా నిర్ణయం తీసుకున్నప్పుడే అలా చేస్తుంది.

'ఏమైనా గుర్తుకు వచ్చిందా?' అడిగింది.

'ఊ'.. అన్నాడు కొంచెం భయపడుతూ.

పదమూడేళ్ల వయసు ఉండగా తండ్రి రెండో పెళ్లి చేసుకున్నాడు. వానాకాలం అది. మంచివానలో తడిచి వచ్చి ఆ సంగతి చెప్పి వారం తర్వాత వస్తానని బట్టలు సర్దుకొని పోబోయాడు. తల్లి అడ్డు నిలిచింది. దీనికి అంగీకరించను అంది. ఇప్పుడేం కొంప మునిగిపోయిందని... నిన్ను ఎప్పట్లానే చూసుకుంటానుగా అన్నాడు తండ్రి. ఇల్లు ఇచ్చి, నెల నెలా ఇంటి ఖర్చులు ఇచ్చి, అప్పుడప్పుడు ఇంటికి వస్తూ పోతూ ఉంటానని తండ్రి హామీ. దానికి అంగీకరిస్తుందా ఏ తల్లైనా? తండ్రి వెళ్లిపోయాడు. తల్లి ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లిపోయింది.

'నన్ను వద్దనుకున్నప్పుడు నాకు మాత్రం అతనెందుకు' అనుకుంది చివరకు.

'ఏమంటావు నాన్నా' కొడుకును అడిగింది.

ఇలాంటివి చిన్నపిల్లలకే అర్థమైపోతాయి. పదమూడేళ్లంటే పూర్తి అవగాహన కలిగి ఉండే వయసు.

'వద్దమ్మా. నాన్న వద్దు. నేను నీతో ఉంటాను. మనకు నాన్న వద్దు' ఆవేశంగా జవాబు చెప్పాడు.

ఇద్దరూ కలిసి నిర్ణయం తీసుకున్నాక ఆమె పూర్తిగా తెరిపిన పడింది.

'ఏదైనా తీపి చేస్తానురా' అంది సంతోషంలో.

ఇంట్లో సొరకాయ మాత్రమే ఉంది. దాంతోనే పాయసం చేసింది. ఆ ఇంట్లో వాళ్లిద్దరూ కలిసి ఆరగించిన ఆఖరి పదార్థం అది.

అన్నాళ్ల తర్వాత మళ్లీ ఇవాళ టేబుల్ మీద. దానినీ భార్యనూ మార్చిమార్చి చూశాడు.

భార్య తలొంచుకుని ఉంది.

'నువ్వెందుకు తలొంచుకుంటావ్. వాడు కదా తలొంచుకోవాల్సింది' అంది తల్లి.

'ఇప్పుడు ఏం చేశాననమ్మా' అడిగాడు.

'ఏం చేయాలి? ఇంట్లో ఉంటున్నావా నువ్వు. భార్యతో మాట్లాడుతున్నావా కనీసం. నా పక్కన పది నిమిషాలైనా కూచుంటున్నావా'

'ఏం చేయనమ్మా... నువ్వే చూస్తున్నావుగా. పెళ్లయిన నాటి చిన్న ఉద్యోగిని అనుకున్నావా సాయంత్రం ఆరు కొట్టేసరికి ఇల్లు చేరడానికి. జీఎం అయ్యాను. కారిచ్చారు. ఇల్లిచ్చారు. ఇంకా చాలా ఇచ్చారు. దీనికి బదులు మొత్తం టైమ్ వాళ్లే తీసుకున్నారు. వేలు పట్టుకు తిరగడానికి, షికార్లకు తిప్పడానికి వీలు కాదమ్మా. పెద్ద హోదాలోకి వెళ్లాక ఇలా బిజీ కావడం మామూలే'...

'మరి ఆ అమ్మాయి విషయం?'

'ఏ అమ్మాయి?'

'ఎంతమంది అమ్మాయిలున్నారు?'

'ఆ అమ్మాయా... ఏంటమ్మా కొత్తగా మాట్లాడతావు. ఆఫీసులో నా వ్యవహారాలన్నీ చూసుకోవాల్సింది ఆ అమ్మాయే. ఇంటికి తీసుకువచ్చాను. నీకు పరిచయం చేశాను. తనకు పరిచయం చేశాను. మీరంతా ఒక ఫ్యామిలీలాగా మారిపోతారని అనుకున్నాను. మీటింగ్స్ అటెండ్ చేయాలన్నా బిజినెస్ ట్రిప్‌లకు వెళ్లినా తన అసిస్టెన్స్ నాకు తప్పనిసరి. అందుకే క్లోజ్‌గా ఉంటాను. ఆ అమ్మాయి కూడా– మీ వైఫ్‌కి ఇది తీసుకోండి... అది తీసుకోండి అని ఒక ఫ్యామిలీ మెంబర్‌లాగా ఎంత కన్సర్న్ చూపిస్తుంది. ఇంత క్లోజ్ అయ్యాక తన ఎమోషన్స్ కూడా షేర్ చేసుకోవాలి కదా. అందుకే మాట్లాడుతుంటాను. కార్పొరేట్ లెవల్‌లో ఇవన్నీ మామూలేనమ్మా'

'రేయ్... లక్షలు కట్నం ఇస్తానంటే కాదని ఈ పిల్లను ఇష్టపడి విలువలకి కట్టుబడి పైసా కట్నం లేకుండా చేసుకున్నవాడివిరా నువ్వు. ఆ మనిషీ ఈ మనిషీ ఒకడివేనా అని సందేహం వస్తోంది'

'ఇప్పుడు ఏం అపకారం చేస్తున్నానమ్మా. బాగానే చూసుకుంటున్నాగా తనని'

'శభాష్. అచ్చు మీ నాన్నలాగా మాట్లాడావురా' కోడలి వైపు తిరిగింది.

'నీకెందుకు సిగ్గు లేదు? నీ భర్తను ఎందుకు నిలదియ్యవు. నీకు నా మీద ప్రేమ చచ్చిపోయింది.. అందుకే నన్ను నిర్లక్ష్యం చేసి ఎవరితోనో తిరుగుతున్నావు.. నువ్వు నాకు వద్దు అని ఎందుకు చెప్పలేకపోతున్నావు? సరే... నీ సమస్యలేవో నీకున్నట్టున్నాయి. నాకు లేవు' అని కొడుకువైపు తిరిగింది.

కొడుకు భయంగా చూశాడు.

'ఈ మాట నీకు ముందే చెప్పాల్సింది. కాని నాకు సపోర్ట్ చేయడానికి అప్పట్లా నువ్వు లేవుగా. ఒక్కదాన్నే నిర్ణయం తీసుకోవాలంటే టైమ్ పట్టింది. మీ నాన్నకు రెండో పెళ్లి చేసుకోవడం మామూలు. నీకు భార్య ఉండగానే తల్లి ఎదురుగా భార్య ఎదురుగా ఇంకో అమ్మాయితో రాసుకు పూసుకు తిరగడం మామూలు. ఆ అమ్మాయితో క్యాంపులకెళ్లడం దేశాలు తిరగడం మామూలు. ఇవన్నీ తేలిక విషయాలుగా భ్రమింపజేస్తూ పబ్బం గడుపుకునే మగాళ్ల లిస్టులో నువ్వు కూడా చేరతావని నేను అనుకోలేదు. మీ నాన్నతో రాజీ పడలేనిదాన్ని నీతో సర్దుకుపోతాననుకున్నావా? చస్తే జరగదు. జాగ్రత్తగా విను. నిన్ను నేను విడిచిపెట్టేస్తున్నాను. ఇక నువ్వు నాకు వద్దు. నా దారి నేను చూసుకుంటాను. ఏయ్ అమ్మాయ్... నువ్వూ వస్తావా... నిన్నూ తీసుకెళతాను' అని హూంకరించింది.

దెబ్బకు అక్కడ భూకంపమే వచ్చింది.

ఇన్నాళ్లు ఎప్పుడూ ఏడ్వని భార్య, ఎంతో ఇష్టంగా చూసుకునే భార్య, గౌరవంగా చూసుకునే భార్య ధారాపాతంగా ఏడుస్తూ ఉంది.

అదిరిపడిపోయాడు. ఏదో కెలికినట్టయ్యి విలవిలలాడిపోయాడు. ఒక్క ఉదుటున లేచి భార్య పక్కన చేరి చెంపలు తుడుస్తూ 'ఊరుకో.. ఊరుకో... ఇక మీదట అలా జరగదు.. అలా జరగనే జరగదు' అని తల్లి దగ్గరకు వచ్చి చేతులు కట్టుకుని బెదిరిన గొడ్డు వలే తల వొంచుకు నిలబడ్డాడు.

కథ ముగిసింది.

రంగనాయకమ్మ రాసిన 'మురళీ వాళ్లమ్మ' కథ ఇది.

మైక్రో ఫ్యామిలీలు వచ్చి ఇంటి పెద్దల్ని సక్సెస్‌ఫుల్‌గా ఇంటి బయటకు నెట్టాయి. మగాణ్ణి అదలించే, కట్టు తప్పితే కట్టులోకి తెచ్చే, మొటిక్కాయలు వేసే తల్లులూ తండ్రులూ ఉండాలి. మౌనం ఎప్పుడూ మంచిది కాదు. చూసి చూడనట్టు ఉందాం అనుకోవడమూ మంచిది కాదు. లోలోపల నలుగుబాటూ మంచిది కాదు. నిర్ణయం తీసుకోండి. పాయసం వండి టేబుల్ మీద పెట్టండి. తర్వాతి కథ అదే జరుగుతుంది.

పునః కథనం: **ఖదీర్**

70వ

పీఠాధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతి



సాక్షి, చెన్నై: జయేంద్ర సరస్వతి శివక్యైం పొందడంతో కంచి కామకోటి మఠం 70వ పీఠాధిపతిగా శంకర విజయేంద్ర సరస్వతికి పట్టాభిషేకం చేయనున్నారు. ఈయన అసలు పేరు శంకరనారాయణన్. 1969 మార్చి 18న జన్మించారు. తిరువళ్లూరు జిల్లా ఆరణి సమీపంలోని పెరియపాళయం గ్రామం ఆయన స్వస్థలం. 1983 మే 29న పోలూరులో ఆధ్యాత్మిక గురువయ్యారు. జయేంద్ర సరస్వతితో కలసి అడుగులు వేశారు. వివాదాల్లోనూ, కారాగారవాసంలోనూ తోడుగానే నిలబడ్డారు. మేఘాలయ వరకు పర్యటించి ఆధ్యాతిక బోధనలు చేశారు. పెడదారి పడుతున్న యువతను సన్మార్గంలో నడిపించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపు, దేశంలో సాంస్కృతిక, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, కొరవడుతున్న నైతిక, మానవీయత విలువల్ని రక్షించే రీతిలో ఆయన పయనం సాగించారు. యువకుల్లో చైతన్యం లక్ష్యంగా ఎక్కువ సమయాన్ని కేటాయించారు. పురాతన సాహిత్యాన్ని కాపాడడం, భారతీయ, విదేశీ భాషల్లో భక్తుల కోసం అనేక ప్రచురణలను తీసుకొచ్చారు.

పంచ భూతాల్లో పృథ్వీ క్షేత్రం.. కాంచీపురం



సాక్షి, చెన్నై: దక్షిణ భారతంలో ఉన్న శివ ఆరాధనలో పంచ భూతాల్లో పృథ్వీ క్షేత్రంగా కాంచీపురం అలరారుతోంది. ఈ క్షేత్రంలోని కంచి కామకోటి పీఠానికి విశిష్ట చరిత్ర ఉంది. ఆది శంకరాచార్య చేతుల మీదుగా ఆవిర్భవించిన ఈ మఠం ద్వారా హిందూ మత సేవలో రెండు దశాబ్దాలకు పైగా జయేంద్ర సరస్వతి నిమగ్నమయ్యారు. భౌగోళికంగా భూమి(కాంచీపురం), ఆకాశం(కడలూరు జిల్లా చిదంబరం), గాలి(చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి), అగ్ని(తిరువణ్ణామలై), నీరు(తిరువన్నై కోయిల్) క్షేత్రాలను పిలుస్తుంటారు. వీటన్నింటి సమ్మేళనంతో శ్రీ కంచి కామకోటి పీఠం ఆవిర్భవించినట్టు చరిత్ర చెబుతోంది. ఈ మఠానికి తల భాగంగా శంకరాచార్య వారిని అభివర్ణిస్తుంటారు. క్రీ.శ 482లో ఆది శంకర భగవత్పదచార్య స్వామి ఈ మఠాన్ని నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. ఈ కామకోటి పీఠం సంప్రదాయంగా కామాక్షి అమ్మవారిని సూచిస్తుంటుంది. కామకోటి దుర్గాదేవిని సూచిస్తుంది. శ్రీ శంకర భగవత్పాద(శ్రీశంకరాచార్య) స్వామి వారు కంచిలో స్థిరపడుతూ తన కంటూ ఓ సొంత నివాసంగా ఈ మఠాన్ని నెలకొల్పారు. ఆయన అడుగు జాడల్లో శిష్యులైన శ్రీ సురేశ్వర చార్య, సర్వజ్ఞాత్మాన్, సత్య భోదేంద్ర సరస్వతి, జ్ఞానందేంద్ర సరస్వతి, సుధానందేంద్ర సరస్వతి వంటి పీఠాధిపతుల నేతృత్వంలో సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో ఈ పీఠం ముందుకు సాగింది. ఇది వరకు ఉన్న 68 మంది పీఠాధిపతులతో పోల్చితే, జయేంద్ర సరస్వతి ఈ పీఠం పరిరక్షణకు, హిందూ ధర్మ ప్రచారంలో విశిష్ట సేవల్ని అందించారు. ఆధ్యాత్మికమే కాదు, విద్య, వైద్య, సేవాపరంగానూ ఈ మఠాన్ని ఉన్నత స్థానానికి తీసుకెళ్లిన ఘనత ఆయనదే.

సేవల స్వామీజీ

వైద్య, విద్యతో ప్రజాసేవ


తిరువళ్లూరు (తమిళనాడు): తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన కంచి కామకోటి 69వ పీఠాధిపతిగా సేవలు కొనసాగించిన స్వామి జయేంద్రసరస్వతి శివైక్యం చెందడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయన భక్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. పీఠాధిపతిగా తన సేవలను ఆధ్యాత్మికకే పరిమితం కాకుండా నిరుపేదలకు సేవ చేస్తూ సేవల స్వామీజీగా పేరు సంపాదించుకున్నారు. ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్న ఉద్దేశంతో వైద్యశాలలు, పాఠశాలలు డీమ్డ్ యూనివర్సిటీ, గోశాల, వృద్ధాశ్రమం ప్రారంభించి తమ సేవలను అన్ని వైపులా విస్తరించారు. రాష్ట్ర వ్యాప్తంగా శిథిలావస్థకు చేరుకున్న పలు ప్రసిద్ధ ఆలయాలను పునరుద్ధరించి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు.

■ సేవలు చిరస్మరణీయం

కంచి మఠం పీఠాధిపతిగా బాధ్యతను నిర్వహిస్తూనే సేవలకు అపరిమత ప్రాధాన్యతను ఇచ్చారు. కాంచీపురం సమీపంలోని ఏనత్తూరు గ్రామం వద్ద 1993లో కంచి మఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ చంద్రశేఖర సరస్వతి విశ్వ విద్యాలయం ద్వారా తక్కువ ఫీజుతో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారు. 1994లో ఎడ్యుకేషన్ వింగ్ ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో 22 పాఠశాలలను ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు విద్యను అందిస్తున్నారు.

■ నిరుపేదలకు వైద్య సేవలు

మానవ సేవే మాధవసేవ అన్నది జయేంద్రసరస్వతి నినాదం. 1978లోనే శంకరనేత్రాలయం ప్రారంభమైనా, జయేంద్రసరస్వతి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే సేవలు విస్తృతమయ్యాయి. శంకరనేత్రాలయ ద్వారా ఉచిత కంటి ఆపరేషన్‌తో పాటు కంటి అద్దాలు, భోజనం, రవాణా సదుపాయాలను సైతం అందిస్తున్నారు. ఈ వైద్యశాలలో రోజుకు 1,200 మందికి చిక్సిత, రెండు వందల మందికి ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారు. ఇండియన్ మిషన్ వైద్యశాల, చెన్నైలోని నుంగంబాక్కం వద్ద ఉన్న చైల్డ్ హాస్పిటల్, కోల్‌కతా, గువాహటి, రామేశ్వరం, తిరుపతిలోని వైద్యశాలలు సైతం జయేంద్రసరస్వతి ప్రత్యేక చొరవతోనే నిరుపేదలకు వైద్య సేవలను అందిస్తున్నాయి.



కంచి స్వామి శివైక్యం

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వాహకులు వివరించారు. దీనిని 'బృందావన ప్రవేశ కార్యక్రమం'గా పిలుస్తామని వారు తెలిపారు. కంచి కామకోటి మఠం ఆవరణలో మహాస్వామి చంద్రశేఖరేంద్ర స్వామిని అధిష్టానం చేసిన ప్రదేశం పక్కనే జయేంద్ర సరస్వతి భౌతిక కాయాన్ని కూడా శాస్త్రబద్ధంగా అధిష్టానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



జయేంద్ర సరస్వతి పార్థివదేహం

కంచి మఠానికి 69వ పీఠాధిపతి..

తమిళనాడులోని తిరువారూర్ జిల్లా ఇరుల్‌నీకి గ్రామంలో 1935 జులై 18న జన్మించిన జయేంద్ర సరస్వతి చిన్నతనంలోనే వేదాభ్యాసం, వివిధ శాస్త్రాల పఠనం పూర్తి చేశారు. స్వామీజీ అసలు పేరు సుబ్రహ్మణ్య మహాదేవ అయ్యర్. తన 19వ ఏట అనగా 1954 మార్చి 22న కంచి శంకర మఠానికి చేరుకుని బాలస్వామీజీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పట్లో మఠం బాధ్యతల్లో ఉన్న చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ ఈయనను తన వారసునిగా శిష్యబృందానికి స్వయంగా పరిచయం చేశారు. 1994లో చంద్ర శేఖరేంద్ర స్వామి కన్నుమూశాక జయేంద్ర సరస్వతి ప్రధాన పీఠాధిపతి బాధ్యతలను చేపట్టారు. హిందూ ధర్మ ప్రచారం, కంచి మఠ విస్తరణ, శిష్య పరంపర అభివృద్ధి, సేవా, ధార్మిక కార్యక్రమాల అమలు, ఆధ్యాత్మిక ప్రచార కార్యక్రమాలను జయేంద్ర సరస్వతి విస్తృతంగా చేపట్టారు. వివిధ సందర్భాలలో రాజకీయ వివాదాలు, కేసులు చుట్టుముట్టినా వాటిని అధిగమించి శిష్య పరంపరను ఏకతాటిపై నడిచేలా చేశారు. ఆధ్యాత్మిక, విద్యా, వైద్య సంబంధ విభాగాల్లో శంకర మఠం ట్రస్ట్‌ను ఎంతో అభివృద్ధి చేశారు. మఠం నిధులతో దక్షిణ భారత దేశంలోని ఎన్నో పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. విద్యా వ్యవస్థను పేదలకు అందుబాటులోకి తీసుకెళ్లి పేద, మధ్య తరగతి వర్గాలకు ఆరాధ్యనీయుడయ్యారు.1988లో నేపాల్ వెళ్లిన సందర్భంలో అప్పటి నేపాల్ రాజు జ్ఞానేంద్ర స్వామీజీని ఘనంగా సత్కరించారు. 1998లో స్వామి జయేంద్ర హిమాలయాల్లో ఉన్న మానస సరోవర్, కైలాసగిరి క్షేత్రాలను సందర్శించారు. ఆదిశంకరాచార్య తరువాత అక్కడికెళ్లిన పీఠాధిపతి ఈయనొక్కరే. 2000లో బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వెళ్లిన స్వామీజీ అక్కడున్న తగేశ్వరి ఆలయానికి సొంత నిధులతో స్వాగత తోరణం నిర్మించారు. 2004 లో వరదరాజ పెరుమాళ్ ఆలయ మేనేజర్ శంకర రామన్ హత్య కేసులో ఆరోపణలపై జయేంద్ర అరెస్టవడం దేశవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఆ తరువాత ఆయన నిర్దోషిగా విడుదలయ్యారు. నాలుగేళ్లుగా ఆయన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలల కిందట శ్వాస సంబంధ సమస్యలతో చెన్నైలోని రామచంద్రా ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నారు.



ఇటీవల శారదాపీఠానికి వచ్చిన జయేంద్ర సరస్వతి స్వామీజీ ఆశీర్వచనం తీసుకుంటున్న స్వరూపానందేంద్ర సరస్వతి (ఫైల్)

ఆయన జీవన విధానం ఆదర్శనీయం

- కొన ఊపిరి వరకూ ధర్మం కోసం పోరాటం చేశారు
- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

పెందుర్తి: కంచికామకోటి పీఠాధిపతి జగద్గురువు జయేంద్ర సరస్వతి మహాస్వామి పరమపదించడం తనను ఎంతో బాధకు, దిగ్భ్రాంతికి గురి చేసిందని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. జయేంద్ర సరస్వతి లేకపోవడం భారతదేశానికి తీరనిలోటని పేర్కొన్నారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలోని శారదాపీఠంలో స్వామీజీ విలేకరులతో మాట్లాడుతూ దేశంలో జయేంద్రసరస్వతి చేసిన ధర్మప్రచారం ఏ పీఠాధిపతి చేయలేదన్నారు. ధర్మం కోసం కొన ఊపిరి వరకు ఆయన పోరాటం చేశారని, తనలాంటి వారికి ఆయన జీవనవిధానం ఎంతో ఆదర్శప్రాయమన్నారు. వారి మార్గంలోనే శారదాపీఠం వంటి పీఠాలు ఆమోదయోగ్యంగా నడుస్తున్నాయని చెప్పారు. ఆదిశంకరాచార్యులు అనుసరించిన మార్గంలోనే కేవలం ఆధ్యాత్మిక చింతనే కాకుండా సామాజిక దృక్పథంతో పేదలకు సహాయం చేయాలన్న సదుద్దేశంతో కంటి ఆసుపత్రి, వైద్యశిబిరాలు, వేదపాఠశాలలు నడుపుతూ సమాజానికి మేలు చేకూర్చుతున్న జీవన్ముక్తులు జయేంద్రసరస్వతి అని కొనియాడారు. విశాఖ శ్రీశారదాపీఠానికి, కంచికామకోటి పీఠానికి ఎంతో అవినావభావ సంబంధం ఉందన్నారు. జయేంద్ర సరస్వతి ఎప్పుడు విశాఖ వచ్చినా శారదాపీఠానికి వచ్చి తమకు ఆశీర్వచనం అందించేవారని గుర్తు చేశారు. వారు (జయేంద్ర) మరికొంతకాలం ఈ లోకంలో ఉండి మా అందరినీ నడిపించాలని ఆకాంక్షించామని.. కానీ దైవం మరోలా తలచిందని విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు ఆదిశంకరాచార్యుల అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని ఆ శంకరులను ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు.

కంచి మఠం ఆస్తులు వేల కోట్లు

మఠం విస్తరణలో జయేంద్ర సరస్వతిదే కీలకపాత్ర

కాంచీపురం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

శివైక్యం చెందిన కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి హయాంలో కంచి మఠం ఆస్తులు గణనీయంగా వృద్ధి చెందాయి. వేలకోట్ల ఆస్తులు పెరిగి మఠం పేరు ప్రతిష్టలు దేశ, విదేశాలకు వ్యాప్తిచెందాయి. ప్రస్తుతం ఉన్న శిష్యగణంలో 40% అదనంగా శిష్యులు, భక్తులు పెరిగారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ స్థిర, చరాస్తులు పెరిగాయి. అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాల్లోనూ స్వామీజీ భక్తులు పెరిగారు. జయేంద్ర సరస్వతి కంటే ముందు 68 మంది పీఠాధిపతులు పనిచేయగా వీరంతా హిందూమత ప్రచారానికే పరిమితమయ్యారు. జయేంద్ర సరస్వతి మాత్రం కంచి కామకోటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మత ప్రచారంతో పాటు స్కూళ్లు, ఆస్పత్రులు నిర్మించారు. పారిశ్రామికవేత్తలను శిష్యులుగా చేర్చుకుని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి అధిక మొత్తంలో విరాళాలు రాబట్టారు. ఆయుర్వేద ఆస్పత్రి, వర్సిటీలు నిర్మించి.. గ్రామాల్లో మంచినీటి సదుపాయాలు, రోడ్లు వేయించారు. దేశవ్యాప్తంగా 38 శాఖలను ప్రారంభించి భక్తుల నుంచి వేల కోట్ల విరాళాలను ట్రస్ట్‌కు రాబట్టారు. ఈ సొమ్ములతో సేవా కార్యక్రమాలను చేపట్టడంతో ప్రముఖుల దృష్టి కంచి మఠం వైపు మళ్లింది.

ప్రధాని కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది..

మఠం మేనేజర్ సుందరేశ్ అయ్యర్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. పలు రాష్ట్రాల సీఎంలు, ప్రధాని కార్యాలయం నుంచి తమకు ఫోన్లు వచ్చినట్లు చెప్పారు. స్వామీజీ అధిష్టానం గురించి వారు వాకబు చేశారని వివరించారు. దీనికి ఎవరెవరు వస్తున్నారో తెలియపర్చలేదని తెలిపారు. బుధవారం రాత్రి తమిళనాడు ఉపముఖ్యమంత్రి పన్నీరు సెల్వం కంచి మఠానికి చేరుకుని జయేంద్రసరస్వతి పార్థీవదేహానికి నమస్కరించారు. స్వామీజీ ఆకస్మిక మరణం మనస్సును కలచివేసిందని చెప్పారు.



శంకర మఠం (శ్రీ కంచి కామకోటి పీఠం)

19 ఏళ్ల వయస్సులో యువ పీఠాధిపతిగా..

సాక్షి, చెన్నై: జయేంద్ర సరస్వతి 19 ఏళ్ల వయస్సులోనే కంచి మఠానికి యువ పీఠాధిపతిగా పట్టాభిషిక్తులయ్యారు. 1935 జూలై 18వ తేదీ తమిళనాడులోని నేటి తంజావూరు జిల్లాలోని ఇరుల్‌నీక్కి గ్రామంలో జన్మించిన జయేంద్ర సరస్వతి అసలు పేరు సుబ్రహ్మణ్య మాదే అయ్యర్. చిన్న తనంలోనే హిందూ మత పెద్దలతో కలిసి ఆధ్యాత్మిక బాటలో నడిచారు. అప్పటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి సుబ్రహ్మణ్య మాదే అయ్యర్‌ను 19 ఏళ్ల వయస్సుల్లో జయేంద్ర సరస్వతిగా నామకరణం చేస్తూ 1954లో మార్చి 22న కంచిమఠానికి యువ పీఠాధిపతిని చేశారు.

విదేశాల్లోనూ: 1988లో నేపాల్ పర్యటించారు. మానస సరోవరణాన్ని, ముక్తినాథ్‌ను సందర్శించారు. ఇక్కడకు అడుగు పెట్టిన తొలి ఆచార్యులు జయేంద్ర సర్వతి. మానస సరోవరంలో శంకరాచార్యుల విగ్రహాన్ని ప్రతిష్టించారు. 2000 సంవత్సరంలో బంగ్లాదేశ్‌లో పర్యటించారు.

ఆశీస్సుల కోసం : జయేంద్ర సరస్వతి పాదాన్ని తాకి పునీతులయ్యేందుకు ఎదురుచూసే భక్తులు దేశ విదేశాల్లోనూ ఎక్కువే. కంచిలోని కామాక్షి అమ్మవారిని దర్శించిన భక్తులు పక్కనే ఉన్న కంచి మఠంలో జయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సుల కోసం బారులుతీరే వారు.

చివరి పూజ: కామాక్షి అమ్మవారి సన్నిధిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ అమ్మ వారి సేవలో జయేంద్ర సరస్వతి పాల్గొంటూ వచ్చారు. మంగళవారం రాత్రి 9 గంటలకు అమ్మవారికి దీపారాధన చేసి మండపానికి వెళ్లారు. ఇదే స్వామి వారి చివరి పూజ.


మానవతా విలువలకు మారుపేరు

కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల జగన్ సంతాపం



కృష్ణా పుష్కరాల సందర్భంగా విజయవాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఆశీస్సులు అందుకుంటున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం చెందడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ధార్మికత, ఆధ్యాత్మిక చింతన, అత్యున్నత మానవతా విలువలను జీవితమంతా ఆచరించి ప్రబోధించిన శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు జగద్గురువుగా ఖ్యాతిపొందారని జగన్ అన్నారు. ఆదిశంకరుల వారసునిగా దాదాపు రెండున్నర దశాబ్దాలు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి కంచిపీఠానికి అందించిన సేవలు ఎన్నటికీ గుర్తుండిపోతాయని జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా జ్ఞాని అయిన శ్రీజయేంద్ర సర్వస్వతి శివైక్యం తీవ్ర దుఖానికి గురి చేసిందని పేర్కొంటూ జగన్ ఒక ట్వీట్ కూడా చేశారు.


@ysjagan

YS Jagan Mohan Reddy @ys... · 7h
Deeply saddened by the demise of Sri Sri Sri Kanchi Sankaracharya Jayendra Saraswati garu, the senior seer of Kanchi Kamakoti Peetham.




2004లో శ్రీవారి ఆలయ ధ్వజ స్తంభం వద్ద స్వామి వారికి బంగారు కిరీటాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా టీటీడీ అధికారులకు అందజేస్తున్న జయేంద్ర సరస్వతి



తిరుమల ఆస్థాన మండపంలోని ధార్మిక సదస్సులో ప్రసంగిస్తున్న జయేంద్ర సరస్వతి (ఫైల్)

■ దేశం గొప్ప ఆధ్యాత్మిక నేతను కోల్పోయింది: రాష్ట్రపతి కోవింద్



కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం పొందటం పట్ల రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తనకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. గొప్ప ఆధ్యాత్మిక నేతను, సాంఘిక సంస్కర్తను మన దేశం కోల్పోయిందన్నారు. ఈ మేరకు బుధవారం ట్విట్టర్‌లో సందేశం పోస్ట్ చేశారు.

■ ఆదర్శప్రాయులు: ఉపరాష్ట్రపతి వెంకయ్య



కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం చెందడం పట్ల ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మానవాళి సంక్షేమానికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు.

■ చిరస్థాయిగా నిలిచిపోతారు: ప్రధాని మోదీ



శ్రీ కంచి కామకోటి పీఠం జగద్గురు పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి శంకరాచార్య శివైక్యం చెందడం తనను తీవ్ర ఆవేదన కలిగించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉన్నతమైన ఆలోచనలు, విశిష్టమైన సేవల ద్వారా ఆయన లక్షలాది మంది మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ మేరకు బుధవారం ప్రధాని ట్వీట్ చేశారు.

■ దిగ్భ్రాంతి కలిగించింది: రాహుల్ గాంధీ



కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి శివైక్యం పట్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తనకు దిగ్భ్రాంతి కలిగించినట్లు బుధవారం ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

■ స్వామీజీ మరణం బాధాకరం: పన్నీరు సెల్వం



కంచి కామకోటి పీఠం మఠాధిపతి శ్రీ జయేంద్ర స్వామి సరస్వతి అకాల మరణం తమిళనాట ప్రజలందరికీ తీరని లోటని డిప్యూటీ సీఎం పన్నీరు సెల్వం అన్నారు. స్వామీజీ మరణం అత్యంత బాధాకరమన్నారు. బుధవారం సాయంత్రం హుటాహుటిన కాంచీపురం చేరుకున్న డిప్యూటీ సీఎం సెల్వం, మంత్రులు స్వామీజీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

■ జయేంద్ర సరస్వతి లేని లోటు తీరనిది: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు జయేంద్ర సరస్వతి శివైక్యం చెందడం పట్ల తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ విచారంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశేష భక్తజనానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జయేంద్ర సరస్వతి లేని లోటు తీరనిదని అన్నారు.

■ చంద్రబాబు సంతాపం



కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తీవ్ర విచారకరమన్నారు.

■ కేసీఆర్ సంతాపం



కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం చెందడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఆధ్యాత్మిక సేవలను గుర్తు చేసుకున్నారు. జయేంద్ర సరస్వతి అంతిమ సంస్కారాల్లో పాల్గొనేందుకు తెలంగాణ దేవాదాయశాఖ అధికారులు కంచికి బయల్దేరారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలు

దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో 2018-19కి గాను 1వ, 2వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. అలాగే 11వ తరగతిలో ప్రవేశాలను పదోతరగతి ఫలితాల తర్వాత కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నిబంధనల ప్రకారం దరఖాస్తులు ఆహ్వానిస్తారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు మార్చి 1, 2018 నుంచి; రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు(ఖాళీలను బట్టి మాత్రమే) ప్రవేశాలకు ఏప్రిల్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు చివరి తేదీ మార్చి 19, 2018. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఏప్రిల్ 9, 2018. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.kvsangathan.nic.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం



డీఆర్‌డీవో ఐటీఆర్

❖ ఖాళీలు: 30 ❖ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో).. ఒడిశాలోని చాందీపూర్‌లో ఏర్పాటుచేసిన ఇంటెగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్)లో 30 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
❖ పోస్టు: టెక్నీషియన్ అప్రెంటీస్(డిప్లొమా).
❖ శిక్షణ వ్యవధి: 12 నెలలు.
❖ స్టైపెండ్: రూ.3,542.
❖ విభాగాల వారీ ఖాళీలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఐటీ-7, ఎలక్ట్రానిక్స్-8, ఎలక్ట్రికల్-5, మెకానికల్-5, సివిల్-5.
❖ ఎంపిక: వాకిన్ ఇంటర్వ్యూ(ఇదే రోజు రాతపరీక్ష కూడా ఉంటుంది).
❖ దరఖాస్తు విధానం: అభ్యర్థులు మొదట www.mhrdnats.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం వెబ్‌సైట్‌లో చూపిన నమూనా దరఖాస్తు పత్రంలో వివరాలను నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
❖ వాకిన్ ఇంటర్వ్యూ తేదీ: మార్చి 28, 2018.
❖ వాకిన్ వేదిక: ఇంటెగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్), చాందీపూర్-756025, బాలాసోర్, ఒడిశా.
❖ వెబ్‌సైట్: www.drdo.gov.in

టీఎస్‌ఆర్‌జేసీ సెట్-2018

తెలంగాణలోని 8 గురుకుల(రెసిడెన్షియల్) జూనియర్ కాలేజీల్లో 2018-19కి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే 'తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ సెట్-2018: టీఎస్‌ఆర్‌జేసీ సెట్-2018) నోటిఫికేషన్ వెలువడింది.
❖ కోర్సు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం.
❖ విభాగాలు: ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ.
❖ అర్హతలు: మార్చి 2018లో తుది పరీక్షలు రాయబోతున్న తెలంగాణలోని 31 జిల్లాల అభ్యర్థులు అర్హులు.
❖ ఎంపిక: ప్రవేశపరీక్ష.
❖ దరఖాస్తు రుసుం: రూ.150.
❖ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
❖ దరఖాస్తుల ప్రారంభం: మార్చి 6, 2018.
❖ చివరి తేదీ: ఏప్రిల్ 9, 2018.
❖ వెబ్‌సైట్: http://tsrjdc.cgg.gov.in

నిమ్‌సెట్-2018

NIMCET

దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్‌ఐటీ)ల్లో ఎంసీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ ఎన్‌ఐటీ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2018(నిమ్‌సెట్-2018) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఏడాదికి నిమ్‌సెట్ నిర్వహణ బాధ్యతలను కర్ణాటకలోని సూరత్కల్‌లో ఉన్న ఎన్‌ఐటీ పర్యవేక్షిస్తోంది. ❖ కోర్సు: ఎంసీఏ.
❖ అర్హతలు: మ్యాథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా కనీసం 60శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో బీఎస్సీ/బీఎస్సీ(ఆనర్స్)/బీసీఏ/బీఐటీ/బీఈ/బీటెక్.
❖ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
❖ వెబ్‌సైట్: www.nimcet.in , www.nitk.ac.in

సవరణ: భవిత నిన్నటి (28.02.2018) జాబ్ పాయింట్ పేజీలో.. 'డీఆర్‌డీవో ఐటీఆర్' శీర్షిక కింద ఎయిర్ ఇండియా జాబ్స్ సమాచారం పొరపాటున కాపీ అయింది. పొరపాటుకు చింతిస్తున్నాం. ఈ రోజు విద్య, ఉద్యోగ సమాచారంలో డీఆర్‌డీవో ఐటీఆర్ జాబ్స్ వివరాలు అందించాం. గమనించగలరు.

హయ్యర్ ఎడ్యుకేషన్



సీయూ సెట్-2018

ఒకటే పరీక్ష.. పది సెంట్రల్ యూనివర్సిటీలు, మరో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం. అంటే.. పదకొండు పేరున్న విద్యాసంస్థల్లో అడ్మిషన్ కల్పించే పరీక్ష.. సీయూసెట్! సీయూ సెట్ ద్వారా బీటెక్, ఇంటిగ్రేటెడ్ ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ, ఇంటిగ్రేటెడ్ ఎంఏ(ఇంగ్లిష్,ఎకనామిక్స్), ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ, ఎంఏ, ఎల్ఎల్ఎం, ఎంఈడీ, ఎంఎస్సీ, ఎంఫార్మసీ, ఎంఫిల్, పీహెచ్‌డీ వంటి యూజీ, పీజీ, రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశంపొందొచ్చు! సీయూ సెట్‌గా పిలిచే..సెంట్రల్ యూనివర్సిటీస్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2018-19 నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో.. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న కోర్సులు, ప్రయోజనాల గురించి తెలుసుకుందాం..

సెంట్రల్ యూనివర్సిటీలు

ఉన్నత విద్యపరంగా ఔత్సాహిక విద్యార్థులకు ప్రధాన గమ్యం సెంట్రల్ యూనివర్సిటీలు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 47సెంట్రల్ యూనివర్సిటీలు ఉండగా.. వీటిల్లో ప్రవేశానికి ఆయా యూనివర్సిటీలు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. నచ్చిన కోర్సులో చేరడానికి పలు యూనివర్సిటీలకు దరఖాస్తు చేయాలి. వివిధ ఎంట్రెన్స్‌లకు హాజరుకావాలి. ఇది విద్యార్థులకు ఎంతో వ్యయప్రయాసగా మారుతోంది. ఈ నేపథ్యంలో అమల్లోకి వచ్చిన సీయూసెట్ ద్వారా పది సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు ప్రతిష్టాత్మక బెంగళూరు డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అందించే కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.

సీయూసెట్‌తో ప్రవేశం లభించే వర్సిటీలు..

సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హర్యానా, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ జమ్ము, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ జార్ఖండ్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ సౌత్ బిహార్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు, బెంగళూరు డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్. ఈ యూనివర్సిటీలన్నీ కలిసి ఒక కన్సార్షియంగా ఏర్పడి.. ప్రతిఏటా ఒక్కో యూనివర్సిటీ సీయూసెట్ బాధ్యతను చేపడుతుంది. ఈ ఏడాది.. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్ సీయూ సెట్ పర్యవేక్షణ బాధ్యతలు చేపడుతోంది.

యూజీ టు పీహెచ్‌డీ



సీయూ-సెట్ ద్వారా ఆయా యూనివర్సిటీల్లో ఇంటిగ్రేటెడ్/యూజీ, పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఆయా కోర్సుల ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సీయూ సెట్ ద్వారా 52 యూజీ ప్రోగ్రామ్స్; పీజీలో-ఆయా కోర్సులకు సంబంధించి మొత్తం 237 స్పెషలైజేషన్స్; పీహెచ్‌డీలో-ఆర్ట్స్, హ్యూమానిటీస్ వంటి సంప్రదాయ విభాగాలు మొదలు, కంప్యూటర్ సైన్స్ వరకు మొత్తం 202 పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో చేరొచ్చు.

ఎంట్రన్స్ టెస్ట్ ఇలా

- యూజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధించి.. సీయూ సెట్.. రెండు విభాగాలు (పార్ట్-ఎ, పార్ట్-బి)గా బహుళైచ్ఛిక విధానంలో వంద ప్రశ్నలతో ఉంటుంది.
- **పార్ట్-ఎ:** భాష పరిజ్ఞానం, జనరల్ అవేర్‌నెస్, మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ స్కిల్స్ నుంచి 25 ప్రశ్నలు ఉంటాయి.
- **పార్ట్-బి:** సంబంధిత సబ్జెక్టు నుంచి 75 ప్రశ్నలు అడుగుతారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో తాము ఎంపిక చేసుకున్న కోర్సుకు సంబంధించి నైపుణ్యాలను పరీక్షించే విభాగం.
- పలు ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు, ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఇతర ఏదైనా జనరల్ కోర్సులకు 100 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో ఒకే పేపర్ ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్/న్యూమరికల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్ అండ్ అనలిటికల్ స్కిల్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి.
- మొత్తం రెండు గంటల వ్యవధిలో వంద మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో నెగెటివ్ మార్కింగ్(1/4) విధానం కూడా అమలవుతోంది.
- ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉమ్మడి విభాగం(పార్ట్-ఎ)ను మినహాయిస్తే.. పార్ట్-బిలో మాత్రం అభ్యర్థి ఎంపిక చేసుకున్న ప్రోగ్రామ్‌కు అర్హతగా పేర్కొన్న కోర్సుకు సంబంధించిన సిలబస్ నుంచే ప్రశ్నలు ఉంటాయి. ఉదాహరణకు ఇంటర్మీడియెట్ అర్హతగా నిర్వహించే పరీక్షలో అభ్యర్థులు ఇంటర్మీడియెట్ స్థాయిలోని సిలబస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన సాధిస్తే సులభంగానే సమాధానాలిచ్చే అవకాశం ఉంటుంది. ఇదే తరహాలో పీజీ అభ్యర్థులకు బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లకు సంబంధించిన సిలబస్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

సీయూ సెట్ ఔత్సాహిక అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. నిర్దేశిత ఫీజును కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి. ఈ ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న కోర్సుల ప్రాథమ్యాన్ని పేర్కొనాలి. దీనిని అనుసరించే పరీక్ష ఉంటుంది.

సీయూ-సెట్ అర్హత



సీయూసెట్ ద్వారా ప్రవేశం కల్పించే వర్సిటీలు సొంతంగా అర్హత ప్రమాణాలను నిర్దేశిస్తున్నాయి. విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేయడానికి ముందే ఆయా యూనివర్సిటీల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, అందుకు పేర్కొన్న అర్హతలను సదరు వర్సిటీ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవాలి. సీయూ సెట్‌లో నిర్ణీత అర్హత మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు.. తర్వాత దశలో తమకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో ప్రవేశాల పరంగా పదకొండు యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి. దీనికి సంబంధించి ప్రతి యూనివర్సిటీ సీయూసెట్ ద్వారా ప్రవేశాల కోసం ప్రత్యేక నోటిఫికేషన్లు విడుదల చేస్తుంది. తర్వాత దశలో.. సదరు యూనివర్సిటీలు వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తాయి. పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఔత్సాహికులకు ఎంట్రన్స్ టెస్ట్‌తోపాటు ఇంటర్వ్యూ కూడా నిర్వహిస్తారు.

సీయూసెట్-2018 సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు:** ఫిబ్రవరి 19, 2018 నుంచి మార్చి 26, 2018
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ రూ. 800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 350
- **అడ్మిట్ కార్డ్ సదుపాయం:** ఏప్రిల్ 13, 2018
- **ఎంట్రన్స్ టెస్ట్ తేదీలు:** ఏప్రిల్ 28, 29
- **ఫలితాల వెల్లడి:** మే 25, 2018
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం
- **వివరాలకు వెబ్‌సైట్:** www.cucetexam.in

అవినీతి సూచీలో భారత్‌కు 81వ స్థానం

జాతీయం

కెనడా ప్రధాని భారత పర్యటన



భారత పర్యటనకు వచ్చిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో ఫిబ్రవరి 23న ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు, కెనడా ప్రధాని పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య పౌర అణు పరిజ్ఞానం, విద్య, ఐటీ, మేధోహక్కులు, క్రీడలు వంటి అంశాల్లో ఆరు ఒప్పందాలు కుదిరాయి. ప్రధానితో భేటీకి ముందు జస్టిన్ ట్రుడో భార్య, పిల్లలతో కలిసి తాజ్‌మహల్, స్వర్ణదేవాలయం తదితర ప్రదేశాలను సందర్శించారు.

కోల్ మైనింగ్‌లో ప్రైవేటు రంగం

ప్రధానమంత్రి నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ కమిటీ (సీసీఈఏ)వాణిజ్య అవసరాలకు బొగ్గును తవ్వేందుకు ప్రైవేటు కంపెనీలకు అనుమతిస్తూ ఫిబ్రవరి 20న నిర్ణయం తీసుకుంది. బొగ్గు రంగాన్ని 1973లో జాతీయీకరణ చేసినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థయిన కోల్ ఇండియా మాత్రమే వాణిజ్య అవసరాలకు బొగ్గును విక్రయిస్తోంది. కాగా, తాజా నిర్ణయంతో కోల్ ఇండియా గుత్తాధిపత్యానికి తెరపడింది. కోల్ మైనింగ్‌లో తీసుకొచ్చిన తాజా సంస్కరణతో బొగ్గు ధరలు తగ్గే అవకాశం ఉందని కేంద్ర బొగ్గు, రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ అభిప్రాయపడ్డారు.

అవినీతి సూచీలో భారత్‌కు 81వ స్థానం

'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అనే సంస్థ ప్రపంచ అవినీతి సూచీ-2017 నివేదికను ఫిబ్రవరి 21న విడుదల చేసింది. ప్రభుత్వ విభాగాల్లో అవినీతి, పత్రికా స్వేచ్ఛ ఆధారంగా మొత్తం 180 దేశాలకు ర్యాంకులు కేటాయించింది. 2016లో 79వ ర్యాంకు పొందిన భారత్..తాజా సూచీలో రెండు స్థానాలు దిగజారింది. న్యూజిలాండ్, డెన్మార్క్ అత్యంత తక్కువ అవినీతి కలిగిన దేశాలుగా(వరుసగా) తొలి రెండు స్థానాల్లో నిలవగా, సోమాలియా, దక్షిణ సూడాన్, సిరియా చివరి మూడు స్థానాల్లో ఉన్నాయి.



దేశం మొత్తానికి ఒకే ట్రిబ్యునల్!

దక్షిణాది రాష్ట్రాల మధ్య జలవివాదాలను పరిష్కరించే లక్ష్యంతో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి అర్జున్ రాం మేఘవాల్ నేతృత్వంలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో సమావేశం జరిగింది. దీనికి 6 దక్షిణాది రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, అధికారులు హాజరయ్యారు. జలవివాదాల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా ఒకే ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది.

అమ్మ టూవీలర్ పథకం ప్రారంభం

తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఫిబ్రవరి 24న అమ్మ టూవీలర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద తమిళనాడులోని మహిళలకు రాయితీపై ద్విచక్ర వాహనాలు అందిస్తారు.

అంతర్జాతీయం

సౌదీ సైన్యంలోకి మహిళలు

సౌదీఅరేబియా మహిళలను సైన్యంలోకి అనుమతిస్తూ ఫిబ్రవరి 26న చారిత్రక ప్రకటన చేసింది. మహిళా సాధికారతను పెంపొందించే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఆర్థికం

బుందేల్‌ఖండ్‌కు డిఫెన్స్ కారిడార్

వెనుకబడిన బుందేల్‌ఖండ్ ప్రాంతంలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులతో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. లక్నోలో ఫిబ్రవరి 21న ఉత్తరప్రదేశ్ పెట్టుబడుల సదస్సు-2018ను ప్రారంభించిన అనంతరం ఈ ప్రకటన చేశారు.

విశాఖలో భాగస్వామ్య సదస్సు

విశాఖపట్నంలో ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజులపాటు భాగస్వామ్య సదస్సు జరిగింది. దీనికి భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సును కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించాయి.

బీఎస్‌ఈలో చేరిన జీహెచ్‌ఎంసీ



హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) ఫిబ్రవరి 22న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో చేరింది.

సైన్స్ అండ్ టెక్నాలజీ

ధనుష్ క్షిపణి ప్రయోగం విజయవంతం

అణ్వాయుధాలను మోసుకెళ్లగలిగే బాలిస్టిక్ క్షిపణి ధనుష్‌ను ఫిబ్రవరి 23న ఒడిశా తీరంలోని నౌక నుంచి విజయవంతంగా పరీక్షించారు. 350 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని క్షిపణి విజయవంతంగా ఛేదించినట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి

కాంపిటీటివ్ గైడెన్స్ కరెంట్ అఫైర్స్

రాత్రి వేళలో పృథ్వీ-2 పరీక్ష విజయవంతం

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పృథ్వీ-2 క్షిపణిని రాత్రి వేళ విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని చాందీపూర్ సమీకృత పరీక్షా వేదిక(ఐటీఆర్) నుంచి ఫిబ్రవరి 21న రాత్రి 8.30 గంటలకు క్షిపణిని ప్రయోగించగా..లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించింది.

రుస్తుం-2 పరీక్ష విజయవంతం

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మానవ రహిత విమానం.. రుస్తుం-2 వైమానిక పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. శాస్త్రవేత్తలు కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో ఫిబ్రవరి 25న ఈ పరీక్షలను నిర్వహించారు.

హైదరాబాద్‌లో డేటా సైన్స్ కేంద్రం

డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విభాగాల్లో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా హైదరాబాద్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది.

వార్తల్లో వ్యక్తులు

అందాలతార శ్రీదేవి మృతి



భారత చలనచిత్ర రంగంపై తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి శ్రీదేవి ఫిబ్రవరి 24న దుబాయ్‌లో మరణించారు. స్పృహకోల్పోయి ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడటంతో శ్రీదేవి మృతిచెందినట్లు ఫోరెన్సిక్ రిపోర్ట్ వెల్లడించింది. తమిళనాడులోని శివకాశిలో 1963 ఆగస్టు 13న జన్మించిన శ్రీదేవి..1967లో కందన్ కరుణై చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. తెలుగులో నటించిన పదహారేళ్ల వయసు(1978) చిత్రం శ్రీదేవికి హీరోయిన్‌గా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అప్పటి నుంచి రెండు దశాబ్దాలపాటు దక్షిణాది, ఉత్తరాది చలన చిత్ర రంగాల్లో అగ్రతారగా వెలుగొందారు. తెలుగులో శ్రీదేవి ప్రేమాభిషేకం, వేటగాడు, కొండవీటి సింహం, దేవత, జగదేకవీరుడు అతిలోక సుందరి వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. బాలీవుడ్‌లో సద్మా, చాందినీ, చాల్‌బాజ్, ఖుదాగవా, లమ్హే, మిస్టర్ ఇండియా వంటి చిత్రాల్లో అసమాన నటనతో ఆకట్టుకున్నారు. శ్రీదేవి చివరిగా నటించిన సినిమా 'మామ్' 2017లో విడుదలైంది. శ్రీదేవిని కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మశ్రీతో సత్కరించింది.

యుద్ధవిమానం నడిపిన అవనీ చతుర్వేది



యుద్ధ విమానం నడిపిన తొలి భారతీయ మహిళగా అవనీ చతుర్వేది గుర్తింపు పొందారు. ఆమె ఫిబ్రవరి 19న జామ్‌నగర్ స్థావరం నుంచి మిగ్-21 బైసన్‌ను నడిపారు.

స్వచ్ఛభారత్ వృద్ధురాలు కున్వర్ బాయ్ మృతి

స్వచ్ఛభారత్ అభియాన్ చిహ్నంగా పేరొందిన 106 ఏళ్ల వృద్ధురాలు కున్వర్ బాయ్ ఫిబ్రవరి 23న ఛత్తీస్‌గఢ్‌లో మరణించారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తితో 2016లో తనకున్న కొన్ని మేకలను అమ్మేసి..ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవడంతో కున్వర్ బాయ్ పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు.

పార్టీ పేరు ప్రకటించిన కమల్ హాసన్



ప్రముఖ తమిళ నటుడు కమల్ హాసన్ ఫిబ్రవరి 21న మదురైలో మక్కల్ నీది మయ్యం పార్టీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఐక్యమత్యాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన పార్టీ జెండాను ఆవిష్కరించారు.

రాష్ట్రీయం

జాతీయ ఇ-పరిపాలన సదస్సు

హైదరాబాద్‌లో ఫిబ్రవరి 26 నుంచి రెండు రోజులపాటు జాతీయ ఇ-పరిపాలన సదస్సు జరిగింది. ఇందులో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార-ప్రజా పంపిణీ శాఖ మంత్రి సీఆర్ చౌధరి, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు, యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో బయో ఆసియా సదస్సు

హైదరాబాద్‌లో ఫిబ్రవరి 22 నుంచి మూడు రోజులపాటు 15వ బయో ఆసియా సదస్సు జరిగింది. దీనికి తెలంగాణ రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారకరామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొ.హాల్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు.

క్రీడలు

టీ20 సిరీస్ భారత్ కైవసం



కేప్‌టౌన్‌లో ఫిబ్రవరి 24న దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌ను భారత్ గెలుచుకుంది. దీంతో టీ20 సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. సురేశ్ రైనాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, భువనేశ్వర్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

అరుణ రెడ్డికి జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో కాంస్యం

తెలుగమ్మాయి అరుణ రెడ్డి జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో భాగంగా ఫిబ్రవరి 24న జరిగిన మహిళల వాల్ట్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించింది.

స్విస్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సమీర్ వర్మ

భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సమీర్ వర్మ స్విస్ ఓపెన్(బ్యాడ్మింటన్) పురుషుల సింగిల్స్ టైటిల్ గెలుచుకున్నాడు. వియన్నాలో ఫిబ్రవరి 25న జరిగిన ఫైనల్లో జాన్ జార్జెన్‌సెన్(డెన్మార్క్)ను సమీర్ ఓడించాడు.


ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

సాక్షి బిజినెస్
గురువారం 1-3-2018
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
162 ▼	61 ▼
34,184	10,493

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 10.30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	7,338	▲	8
డోజోన్స్	25,385	▼	25
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,232	▼	51
డాక్స్	13,436	▼	55
షాంఘై	3,260	▼	32
నికాయ్	22,068	▼	332

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.35	65.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	89.12	92.04
€	యూరో	ఎస్‌బీఐ	78.35	80.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.77	61.84
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.87	51.63
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.38	49.89
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.74	18.67
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.12	18.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.27	11.80

అన్ని రంగాలూ కలిసొచ్చాయి!

- మూడవ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి వృద్ధి దూకుడు
- 7.2 శాతంగా నమోదు
- క్యూ1, క్యూ2లతో పోల్చితే మంచి ఫలితం
- వ్యవసాయం, తయారీ, నిర్మాణం, సేవల్లో రికవరీ

న్యూఢిల్లీ: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు డిసెంబర్ త్రైమాసికంలో (అక్టోబర్–డిసెంబర్) బాగుంది. 7.2 శాతం వృద్ధి నమోదయ్యింది. మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) వృద్ధి రేటు మూడేళ్ల కనిష్ట స్థాయిలో 5.7 శాతానికి పడిపోగా, రెండవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) కొంచెం కోలుకుని 6.3 శాతంగా నమోదయ్యింది. అయితే ఇప్పుడు ఈ రేటును 6.5 శాతంగా సీఎస్‌ఓ సవరించింది. కీలకమైన వ్యవసాయం, తయారీ, నిర్మాణం, సేవల రంగాల్లో రికవరీ కనిపించడం 3వ త్రైమాసికానికి కలిసి వచ్చింది. భారత్ జీడీపీలో సేవల రంగం వాటా దాదాపు 60 శాతం ఉంటే, తయారీ, వ్యవసాయం రంగాల వాటా దాదాపు చెరి 15 శాతం ఉంది.



మొత్తంగా 6.6 శాతం ఉండొచ్చు...

ఆర్థిక సంవత్సరం మొత్తంమీద (2017 ఏప్రిల్– 2018 మార్చి) భారత్ జీడీపీ వృద్ధి రేటు 6.6 శాతం ఉండే అవకాశం ఉందని బుధవారంనాడు విడుదల చేసిన గణాంకాల సందర్భంగా కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌ఓ) పేర్కొంది. ఇంతక్రితం అంచనాలకన్నా (6.5 శాతం) ఇది 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) ఎక్కువ. 2016–17లో భారత్ జీడీపీ వృద్ధి రేటు 7.1 శాతం. 2016–17 జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో 7.5 శాతం వృద్ధి రేటు నమోదుకాగా, ఇప్పుడు రేటు కొంచెం ఆ స్థాయికి చేరుకోవడం విశేషం.

విలువలు చూస్తే...

సీఎస్‌ఓ గణాంకాల ప్రకారం– 2017–18లో జీడీపీ విలువ (2011–12 స్థిర ధరల వద్ద) 130.04 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. 2016–17లో ఈ విలువ 122 లక్షల కోట్లు. (మొదటి సవరిత అంచనా ప్రకారం).


వివిధ రంగాలు చూస్తే...

తయారీ: స్థూల విలువ జోడింపు (జీవీఏ) కింద 3వ త్రైమాసికంలో తయారీ రంగం 8.9 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంది. 2వ త్రైమాసికంలో ఈ రేటు 6.9 శాతం.


వ్యవసాయం: ఈ రంగం విషయంలో ఈ రేటు 2.7 శాతం నుంచి 4.1 శాతానికి పెరిగింది.

నిర్మాణం: ఈ విభాగంలో వృద్ధి రేటు 6.8 శాతం. 2వ త్రైమాసికంలో రేటు 2.8 శాతం.

సేవలు: జీడీపీలో మెజారిటీగా ఉన్న ఈ కీలక విభాగంలో 6.4 శాతం నుంచి 6.7 శాతానికి ఎగసింది.



మురిపించింది... మౌలికం




జనవరిలో 6.7% వృద్ధి

న్యూఢిల్లీ: ఎనిమిది పారిశ్రామిక రంగాలతో కూడిన మౌలిక పరిశ్రమల విభాగం జనవరిలో పర్వాలేదనిపించింది. వృద్ధి 6.7 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది ఇదే నెలలో ఈ వృద్ధి రేటు 3.4 శాతం. ఐఐపీలో దాదాపు 40 శాతం వాటా కలిగిన ఈ ఎనిమిది రంగాలూ ఇలా..

- **పెట్రోలియం రిఫైనరీ ప్రొడక్టులు:** అసలు ఎటువంటి వృద్ధి లేని స్థితి నుంచి (2016 జనవరిలో 0%) తాజా సమీక్షా నెల– జనవరిలో 11% వృద్ధిని నమోదుచేసుకుంది.
- **సిమెంట్:** క్షీణత నుంచి (2016 జనవరిలో వృద్ధి లేకపోగా –13.3 శాతం క్షీణత) వృద్ధి ఏకంగా 20.7 శాతానికి ఎగసింది.
- **స్టీల్:** వృద్ధి 11.3 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గింది.
- **విద్యుత్:** వృద్ధి 5.2 శాతం నుంచి 8.2 శాతానికి చేరింది.
- **బొగ్గు:** ఈ రంగంలో వృద్ధి 3.5 శాతం నుంచి 3.0 శాతానికి తగ్గింది.
- **క్రూడ్ ఆయిల్:** 1.3 వృద్ధి రేటు –3.2 క్షీణతలోకి జారింది.
- **సహజవాయువు:** ఈ రంగంలో కూడా 11.6 శాతం వృద్ధి –1 శాతం క్షీణతలోకి మారింది.
- **ఎరువులు:** –1.2 శాతం క్షీణత మరింతగా –1.6 క్షీణతకు జారింది.

10 నెలలూ చూస్తే దిగువ బాటే: ఇక ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకూ చూస్తే, మౌలిక పరిశ్రమల వృద్ధి రేటు 5.1 శాతం నుంచి 4.3 శాతానికి తగ్గింది.

గురితప్పింది... ద్రవ్యలోటు



జనవరి ముగిసే నాటికి 6.77 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: భారత్ ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (2017–18) గురితప్పుతున్నట్లు మరింత స్పష్టమైన గణాంకాలు వెలువడ్డాయి. ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలలు ఉండగానే– జనవరిలో ద్రవ్యలోటు రూ. 6.77 లక్షల కోట్లుగా నమోదయ్యింది. 2017–18 బడ్జెట్ లక్ష్యాలతో పోల్చిచూస్తే ఇది 113.7 శాతం అధికం. ప్రభుత్వ అధిక వ్యయాలు దీనికి కారణం. ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాల మధ్య నికర వ్యత్యాసమే ద్రవ్యలోటు. 2017–18లో ఈ విలువ రూ.5.33 లక్షల కోట్లు దాటరాదని ఈ బడ్జెట్ నిర్దేశించింది. ఇది మొత్తం జీడీపీ విలువతో పోల్చితే 3.2 శాతం. అయితే తాజా గణాంకాలు చూస్తుంటే, లక్ష్యాలను సాధించడంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిని ఇప్పటికే నిర్ధారించుకున్న కేంద్రం 2018–19లో ద్రవ్యలోటు లక్ష్యాన్ని రూ.5.95 లక్షల కోట్లకు పెంచింది. జీడీపీ అంచనా విలువలో ఇది 3.5 శాతం. మరింతగా విశ్లేషిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017–18) బడ్జెట్ అంచనాల ప్రకారం– ఈ ఏడాది స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో ద్రవ్యలోటును 3.2 శాతానికి కట్టడి చేయాలి. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 3 శాతానికి తగ్గాలి. అయితే ప్రస్తుతం నడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 3.2 శాతం లక్ష్యానికి బదులు 3.5 శాతంగా ఉంటుందని జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ద్రవ్యలోటు విధానంపై ఆర్థిక విశ్లేషకుల నుంచి విమర్శలు వెలువడ్డాయి. బడ్జెట్ తరువాత, స్టాక్ మార్కెట్లు కూడా భారీగా పడిపోయాయి.

నెమ్మదించింది... తయారీ!



న్యూఢిల్లీ: తయారీ రంగం ఫిబ్రవరిలో నెమ్మదించిందని నికాయ్ ఇండియా మ్యానుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పేర్కొంది. ఫిబ్రవరిలో సూచీ 52.1గా నమోదయినట్లు తన సర్వేలో పేర్కొంది. ఇది నాలుగు నెలల కనిష్ట స్థాయి. జనవరిలో ఈ రేటు 52.4 వద్ద ఉంది. డిసెంబర్‌లో 60 నెలల గరిష్ట స్థాయి 54.7 వద్ద సూచీ ఉంది. ఫ్యాక్టరీ ఉత్పత్తి, బిజినెస్ ఆర్డర్లలో మందగమనం ఫిబ్రవరిలో సూచీ నెమ్మదించడానికి కారణమని నికాయ్ పేర్కొంది. అయితే నికాయ్ ఇండెక్స్ ప్రకారం... సూచీ 50పైన ఉంటే అది వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతే, క్షీణతగా భావిస్తారు. వరుసగా 7 నెలలుగా సూచీ 50 పైనే ఉంటోంది.

భారత వృద్ధి 7.6 శాతం

- ప్రతికూలతల నుంచి కోలుకుంటోంది
- రేటింగ్ సంస్థ మూడీస్ అంచనాలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ ఇన్వెస్టర్ సర్వీసెస్ భారత్ వృద్ధి రేటును 2018 సంవత్సరానికి 7.6 శాతంగా అంచనా వేసింది. 2016 నాటి డీమోనిటైజేషన్, 2017లో తీసుకొచ్చిన జీఎస్టీ ప్రతికూల ప్రభావాల నుంచి కోలుకుంటుందని చెప్పటానికి కొన్ని సంకేతాలు కనిపిస్తున్నాయని తన నివేదికలో పేర్కొంది. 2018 సంవత్సరానికి సంబంధించిన వృద్ధి అంచనాలను మార్పు చేయకుండా గతంలో వెల్లడించిన మేరకు 7.6 శాతం నమోదవుతుందని స్పష్టంచేసింది. 2019లో 7.5 శాతంగా ఉంటుందని తెలిపింది. ప్రముఖ వర్ధమాన దేశాల్లో భారత్, ఇండోనేషియా దేశాల వృద్ధి అంచనాలను మాత్రమే మార్పు చేయడం లేదని పేర్కొంది.

అంతర్జాతీయంగానూ వృద్ధి మెరుగే

2018, 2019 సంవత్సరాలకు సంబంధించి అంతర్జాతీయ వృద్ధి అంచనాలను సైతం మూడీస్ పెంచింది. అమెరికా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, దక్షిణ కొరియా, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ దేశాల జీడీపీ వృద్ధి అంచనాలను సవరించింది.

ఇకపై ఆకర్షణీయం కాదు

- చమురు ధరలు భారత్‌కు ఇబ్బందే
- దిగుమతి సుంకాల టారిఫ్ పెంచడమూ ప్రతికూలమే
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వ్యాఖ్య



సింగపూర్: భారత్ ద్రవ్యలోటు లక్ష్యం పట్ల ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు హెచ్చరిక జారీ చేశారు. పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో భారత్ ఇకపై ఎంత మాత్రం ఆకర్షణీయం కాదన్నారు. 2018–19 కేంద్ర బడ్జెట్‌లో దిగుమతుల సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయం భారత్‌లో తయారీకి విఘాతం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. 1991లో భారత్ చెల్లింపుల పరంగా ఎదుర్కొన్న సంక్షోభం, 2013లో మరోసారి సంక్షోభం వరకూ వెళ్లడం అన్నవి నియంత్రణ లేని ఆర్థిక దుబారాల వల్లేనన్నారు. సింగపూర్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సౌత్ ఏషియన్ స్టడీస్‌లో 'ప్రపంచీకరణలో భారత్' అనే అంశంపై మాట్లాడుతూ దువ్వూరి ఈ విషయాలు చెప్పారు. పలు ఉత్పత్తులపై దిగుమతి సుంకాల పెంపును దువ్వూరి సుబ్బారావు తీవ్రంగా తప్పుబట్టారు. భారత్‌లో తయారీకి తగినంత ఆసరా ఇవ్వకుండా ఈ విధంగా రేట్లు పెంచితే అది దేశ తయారీ రంగానికి తగదన్నారు.

ఎయిర్‌సెల్ దివాలా!

ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ ◆ తీవ్రమైన పోటీ, రుణభారం, నష్టాలే కారణం



న్యూఢిల్లీ: టెలికం రంగంలో తీవ్ర పోటీ నేపథ్యంలో ఎయిర్‌సెల్ దివాలా ప్రకటించింది. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో కంపెనీ ఈ మేరకు పిటీషన్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కొత్త సంస్థ (జియో) రాకతో పోటీ తీవ్రమవడం, చట్ట.. నియంత్రణ సంస్థలపరమైన సవాళ్లు, పెరిగిపోయిన రుణభారం, భారీ నష్టాలు మొదలైన వాటి కారణంగా 'వ్యాపారంపైనా, పరపతిపైనా గణనీయంగా ప్రతికూల ప్రభావం' పడినట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. దివాలా చట్టం 2016లోని సెక్షన్ 10 కింద ఎయిర్‌సెల్ సెల్యులార్, డిష్‌నెట్ వైర్‌లెస్, ఎయిర్‌సెల్ లిమిటెడ్ సంస్థలు కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియ చేపట్టాలంటూ దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది.

అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి..

వైర్‌లెస్ వ్యాపారాన్ని ఇతర టెల్కోలో విలీనం చేయడానికి ప్రయత్నించినా సాధ్యపడలేదని ఎయిర్‌సెల్ తెలిపింది. అటుపైన రుణపునర్‌వ్యవస్థీకరణ, నిధుల సమీకరణ అంశాలపై రుణదాతలు, షేర్‌హోల్డర్లతో సుదీర్ఘ చర్చలు జరిపినా ఏకాభిప్రాయం కుదరలేదని వివరించింది. వ్యూహాత్మక రుణ పునర్‌వ్యవస్థీకరణ పథకం కూడా పనిచేయకపోవడంతో.. దివాలా చట్టం కింద పరిష్కార ప్రక్రియ ఒక్కటే తగిన మార్గంగా విశ్వసిస్తున్నట్లు ఎయిర్‌సెల్ తెలిపింది. సీఐఆర్‌పీ అనేది.. కంపెనీని విక్రయించే ప్రక్రియ కాబోదని ఎయిర్‌సెల్ స్పష్టం చేసింది. ఉద్యోగులతో పాటు రుణదాతలు, సరఫరా సంస్థలు మొదలైన వర్గాల ప్రయోజనాలను పరిరక్షించేలా మెరుగైన పరిష్కారమార్గాన్ని కనుగొనే ఉద్దేశంతోనే దీనివైపు మొగ్గు చూపినట్లు పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ నిరంతరాయంగా సర్వీసులు అందించేందుకు ప్రయత్నిస్తూనే ఉంటామన్న ఎయిర్‌సెల్.. ''ప్రస్తుత కష్టకాలంలో'' తమకు మద్దతుగా నిలవాలంటూ కస్టమర్లకు విజ్ఞప్తి చేసింది. మలేసియా కోటీశ్వరుడు ఆనంద్ కృష్ణన్ సంస్థ మ్యాక్సిస్ కమ్యూనికేషన్స్ .. 2005లో 1 బిలియన్ డాలర్లతో ఎయిర్‌సెల్‌లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఎయిర్‌సెల్‌లో మ్యాక్సిస్‌కి 74 శాతం వాటా ఉండగా.. రూ. 15,500 కోట్ల మేర రుణభారం పేరుకుపోయింది.

డిపాజిట్ రేట్లు పెంచిన ఎస్‌బీఐ

- 0.75 శాతం దాకా వడ్డీ రేటు పెంపు
- రుణాలపైనా వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలు



ముంబై: బ్యాంకింగ్ వ్యవస్థలో ఇక నుంచి వడ్డీ రేట్ల పెరుగుదలకు సూచనగా.. ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డిపాజిట్ రేట్లను పెంచింది. వివిధ కాలావధులకు సంబంధించి రిటైల్, బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 0.75 శాతం దాకా పెంచుతున్నట్లు బుధవారం ప్రకటించింది. పెంచిన రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. గడిచిన నాలుగు నెలల్లో ఎస్‌బీఐ.. బల్క్ టర్మ్ డిపాజిట్ రేట్లు సవరించడం ఇది మూడోసారి. నవంబర్ ఆఖర్లో తొలిసారి రేటు సవరించిన ఎస్‌బీఐ ఆతర్వాత జనవరిలోనూ మార్చింది. తాజా పరిణామంతో రుణాలపై వడ్డీ రేట్లు కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిని నిర్ణయించడానికి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్న సంగతి తెలిసిందే. దీంతో డిపాజిట్ రేట్ల పెంపు సహా నిధుల సమీకరణ వ్యయాలు పెరిగిన పక్షంలో ఆ మేరకు ఆటోమేటిక్‌గా రుణాలపై వడ్డీ రేట్ల పెరుగుదలకు కూడా దారి తీస్తుంది. గత త్రైమాసికం నుంచి పలు బ్యాంకులు క్రమంగా డిపాజిట్, లోన్ రేట్లు పెంచుకుంటూ వస్తున్నాయి.

పెరుగుదల ఇలా..

రెండేళ్ల నుంచి పదేళ్ల దాకా కాలవ్యవధి ఉండే రూ. 1 కోటి లోపు రిటైల్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు 0.50 శాతం మేర పెంచుతున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. దీంతో ఇప్పటిదాకా 6 శాతంగా ఉన్న రేటు 6.50 శాతానికి చేరుతుంది. అలాగే, ఒక్క సంవత్సరం పైబడి.. రెండేళ్ల కన్నా తక్కువ కాలవ్యవధి ఉండే డిపాజిట్స్‌పై రేటు 0.15 శాతం మేర పెరుగుతుంది. ఫలితంగా ఇప్పటిదాకా 6.25 శాతంగా ఉన్నది ఇకపై 6.40 శాతానికి చేరుతుంది. మరోవైపు, ఏడాది పైబడి.. రెండేళ్ల లోపు మెచ్యూరిటీ ఉండే రూ. 1 కోటి– రూ. 10 కోట్ల దాకా ఉండే బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేటు 0.50 శాతం పెరిగి.. 6.25 శాతం నుంచి 6.75 శాతానికి చేరుతుంది. రెండేళ్ల పైబడి.. మూడేళ్ల లోపు కాలవ్యవధి ఉండే బల్క్ డిపాజిట్స్‌పై పెరుగుదల 0.75 శాతంగా ఉంటుంది.

థండర్‌బర్డ్‌లో కొత్త వేరియంట్‌లు

- థండర్‌బర్డ్ 500ఎక్స్: రూ.1,98,878
- థండర్‌బర్డ్ 350ఎక్స్: రూ.1,56,849



న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ థండర్‌బర్డ్ మోడల్‌లో కొత్త రేంజ్ బైక్‌లను మార్కెట్లోకి తెచ్చింది. థండర్‌బర్డ్ 500ఎక్స్ (ధర రూ.1,98,878), థండర్‌బర్డ్ 350 ఎక్స్ (ధర రూ.1,56,849– రెండు ధరలూ ఎక్స్ షోరూమ్, ఢిల్లీ).. ఈ రెండు బైక్‌లకు బుకింగ్స్ బుధవారం నుంచే ప్రారంభించామని రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రెసిడెంట్ రుద్రతేజ్ సింగ్ తెలిపారు. థండర్ బర్డ్ 500 ఎక్స్ బైక్‌ను సింగిల్ సిలిండర్, ఎయిర్‌కూల్డ్ 499సీసీ ఇంజిన్‌తో రూపొందించామని, ఈ బైక్ 41.3 ఎన్‌ఎమ్ టార్క్‌ను, 4,000 ఆర్‌పీఎమ్‌ను ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే థండర్‌బర్డ్ 350ఎక్స్‌లో సింగిల్ సిలిండర్, ఎయిర్‌కూల్డ్ ట్విన్‌స్పార్క్, 346 సీసీ ఇంజిన్‌తో రూపొందించామని గరిష్ట టార్క్ 28 ఎన్‌ఎమ్ అని, 4,000 ఆర్‌పీఎమ్ అని తెలిపారు. ఈ రెండు బైక్‌ల్లో..సింగిల్ డౌన్ ట్యూబ్ ఛాసిస్, 41ఎమ్ఎమ్ ఫ్రంట్ ఫోర్క్‌లు, 20 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్, 9 స్పోక్ అలాయ్ వీల్స్, 5 స్పీడ్ గేర్‌బాక్స్, ట్యూబ్‌లెస్ టైర్లు వంటి ప్రత్యేకతలు ఉన్నాయి.

హార్లే డేవిడ్సన్‌లో రెండు కొత్త మోడళ్లు



- లో రైడర్ @ రూ.12.99 లక్షలు
- డీలక్స్ @ రూ.17.99 లక్షలు

న్యూఢిల్లీ: విలాసవంతమైన బైక్‌లు తయారు చేసే అమెరికాకు చెందిన హార్లే డేవిడ్సన్ కంపెనీ సాఫ్టైల్ పోర్ట్‌ఫోలియోలో రెండు కొత్త మోడళ్లు– లో రైడర్, డీలక్స్‌లను భారత మార్కెట్లోకి తెచ్చింది. లో రైడర్ మోడల్ ధర రూ.12.99 లక్షలని, డీలక్స్ ధర రూ.17.99 లక్షలని హార్లే డేవిడ్సన్ ఇండియా, చైనా ఎమ్‌డీ పీటర్ మ్యాక్ కోంజీ తెలిపారు. ఈ రెండు బైక్‌లను 1745 సీసీ మిల్‌వాకీ–ఎయిట్ 107 ఇంజిన్‌తో రూపొందించామని పేర్కొన్నారు. ఈ రెండు బైక్‌ల్లో డ్యుయల్–బెండింగ్ వాల్వ్ ఫ్రంట్ సస్పెన్షన్, వెనక భాగంలో అడ్జెస్ట్ చేసుకునే మోనోషాక్ అబ్జార్బర్స్ ఉన్నాయని తెలిపారు.మై18 సాఫ్టైల్ మోడళ్లను గత ఏడాది అక్టోబర్‌లో అందుబాటులోకి తెచ్చామని, తాజాగా ఇప్పుడు మరో రెండు మోడళ్లను అందిస్తున్నామని మ్యాక్ తెలిపారు. కాగా హార్లే డేవిడ్సన్ కంపెనీ టూరింగ్, సీవీఓ మోడళ్ల ధరలను సవరించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఇప్పుడు స్పోర్టీ స్కూటర్ల వంతు

కుర్రకారు కోసం వినూత్న డిజైన్లు ▪ పోటీపడుతున్న ప్రధాన కంపెనీలు ▪ అమ్మకాల్లో ఏటా 35 శాతం వృద్ధి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ద్విచక్ర వాహనాల్లో స్కూటర్లు సౌకర్యవంతంగా ఉంటాయన్నది వాస్తవం. ఇప్పుడు ఈ స్కూటర్ మార్కెట్ కాస్తా స్పోర్టీ, స్మార్ట్ వైపు దూసుకెళ్తోంది. సాధారణ స్కూటర్లతో పోలిస్తే ఈ స్పోర్టీ వేరియంట్ల అమ్మకాలు రెండింతల మేర వృద్ధి చెందుతున్నాయంటే ట్రెండ్‌ను అర్థం చేసుకోవచ్చు. మెట్రోలు, పెద్ద పట్టణాలే కాకుండా చిన్న పట్టణాల్లోనూ యువత వీటికి దాసోహం అంటున్నారు. అటు తయారీ కంపెనీలు సైతం వినూత్న డిజైన్లతో ఒకదాని వెంట ఒకటి పోటీపడుతున్నాయి. ఈ ఏడాది మరిన్ని మోడళ్లు కస్టమర్ల కోసం రెడీ అవుతున్నాయి.

స్పోర్టీ మోడళ్లకు సై..

విభిన్న డిజైన్లు, మల్టీ కలర్, స్పోర్టీ లుక్ స్కూటర్లకు యువత సై అంటున్నారు. స్కూటర్ల విభాగం ఏటా 18 శాతం వృద్ధి చెందితే, స్పోర్టీ మోడళ్లు 35 శాతం వృద్ధి నమోదవుతున్నాయని టీవీఎస్ సేల్స్ జీఎం బినయ్ ఆంథోని 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారు. ''స్కూటర్లలో స్పోర్టీ మోడళ్ల వాటా 10 శాతం దాకా ఉంది. 18 నుంచి 24 ఏళ్ల కుర్రకారే ఈ విభాగాన్ని నడిపిస్తున్నారు'' అని ఆథోని వివరించారు. ద్విచక్ర వాహన రంగంలో అధిక మైలేజీ ఇచ్చే ఇంజన్ల అభివృద్ధికి కంపెనీలు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నాయి. ఒకప్పుడు మైలేజీ లీటరు పెట్రోలుకు 30 లోపే ఉండేది. ఇప్పుడు 55 కిలోమీటర్ల దాకా ఇచ్చే మోడళ్లూ వచ్చాయి. బైక్‌ల మైలేజీ కూడా ఇదే స్థాయిలో ఉండటంతో స్కూటర్ల అమ్మకాలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

పోటాపోటీగా మోడళ్లు..

ద్విచక్ర వాహన తయారీ కంపెనీలు పోటాపోటీగా స్పోర్టీ మోడళ్లను ప్రవేశపెడుతున్నాయి. హోండా నుంచి గ్రేజియా, డియో. హీరో మోటోకార్ప్ నుంచి మాయెస్ట్రో ఎడ్జ్. యమహా నుంచి రే–జడ్‌ఆర్, రే–జడ్, ఆల్ఫా. అప్రీలియా నుంచి ఎస్‌ఆర్ 150 రేస్, ఎస్‌ఆర్ 150 వంటివి ఇప్పటికే మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. మహీంద్రా తన గస్టో మోడల్‌ను స్పోర్టీ లుక్‌తో తీర్చిదిద్దింది. వీటికి పోటీ ఇచ్చేందుకు తాజాగా టీవీఎస్ మోటార్ కంపెనీ ఎన్‌టార్క్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. ఇతర కంపెనీలకు భిన్నంగా కనెక్టెడ్ స్కూటర్‌గా దీనిని అభివర్ణిస్తోంది. సుజుకీ ఈ ఏడాదే బ్రౌనీ 125, బర్గ్‌మన్ స్ట్రీట్ 125 మోడల్స్‌ను తీసుకొస్తోంది. ఇక కంపెనీలన్నీ రెగ్యులర్ మోడళ్లను సైతం మల్టీ కలర్, స్పోర్టీ లుక్ వచ్చే విధంగా రీలాంచ్ చేస్తుండటం ప్రస్తుత ట్రెండ్‌కు అద్దం పడుతోంది.

మూడింట ఒకటి స్కూటర్..

దేశవ్యాప్తంగా 2016–17లో 1.75 కోట్ల యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం నెలకు అమ్ముడవుతున్న యూనిట్లలో 34 శాతం వాటా స్కూటర్లు చేజిక్కించుకున్నాయి. అంటే మూడు వాహనాల్లో ఒకటి స్కూటర్ అన్నమాట. గేర్లు మార్చాల్సిన అవసరం లేకపోవడం, స్త్రీ, పురుషులు ఇద్దరికీ ఉపయోగపడే విధంగా వాహన డిజైన్ ఉండటం, సౌకర్యవంతమైన డ్రైవింగ్ అనుభూతి వంటి కారణాలతో స్కూటర్లు పాపులర్ అవుతున్నాయి. స్కూటర్ల విభాగం అయిదేళ్లుగా ఏటా 18 శాతం వృద్ధి నమోదు చేస్తోంది. 2012–13లో దేశీయంగా 1.38 కోట్ల యూనిట్ల టూవీలర్లు విక్రయమయ్యాయి. ఇందులో స్కూటర్ల వాటా 20 శాతం లోపే ఉంది. కాగా, భారత్‌లో ఈ ఏడాది అన్ని కంపెనీల నుంచి 150 సీసీ స్కూటర్లు మార్కెట్లో అడుగు పెడతాయని సమాచారం.



హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తమ నూతన ఉత్పాదన టీవీఎస్ ఎన్‌టోర్క్ 125ని ఆవిష్కరిస్తున్న సేల్స్ జనరల్ మేనేజర్లు బినయ్ ఆంథోని, ఆర్. బాలాజీ



పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	మిర్చి (వరంగల్, తేజ)	పసుపు (నిజామాబాద్, కొమ్ము)	ఉల్లి (కర్నూలు)	చక్కెర (చెన్నై)	బియ్యం (కరీంనగర్)	కందిపప్పు (చెన్నై)	సుబాబులు (కృష్ణా)	ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)
--	--	--	--	రూ.3,600	రూ. 3,800 (హెచ్ఎంటీ)	రూ.7,200	రూ.4,400 (టన్నుకు)	--
--	--	--	--					

భెల్ డివిడెండ్ 40 శాతం

40 ఏళ్లగా డివిడెండ్ చెల్లింపులు



న్యూఢిల్లీ: విద్యుదుత్పత్తి పరికరాలు తయారు చేసే ప్రభుత్వ రంగ సంస్థ భెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 40 శాతం మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించింది. మొత్తం మీద ఈ ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ కింద రూ.294 కోట్లు చెల్లించినట్లు సంస్థ తెలిపింది. దీంతో గత 40 ఏళ్లగా విరామం లేకుండా డివిడెండ్ చెల్లింపు రికార్డ్‌ను కొనసాగించామని వెల్లడించింది. తమ కంపెనీలో ప్రభుత్వం వాటా 63.06 శాతమని, దీంతో రూ.185.21 కోట్ల డివిడెండ్ చెక్‌ను ప్రభుత్వానికి అందజేశామని పేర్కొంది. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో ఈ చెక్కును భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ సహాయ మంత్రి అనంత్ గీతేకు కంపెనీ సీఎమ్‌డీ అతుల్ సోబ్తి అందజేశారు. వృద్ధి జోరును మరింత వేగవంతం చేస్తున్నామని, ఈ క్యూ3లో లాభదాయకత పెరిగిందని కంపెనీ తెలిపింది.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ చేతికి ఇటలీ రెండో పెద్ద స్టీల్ ప్లాంట్!

డీల్ విలువ రూ.500 కోట్లు!




ముంబై: ఇటలీలో రెండో పెద్ద ఉక్కు కంపెనీ, అఫెర్ని జేఎస్ డబ్ల్యూ స్టీల్ కంపెనీ కొనుగోలు చేయనున్నది. ఈ మేరకు అఫెర్నిని నిర్వహిస్తున్న అల్జీరియాకు చెందిన సెవిటాల్ కంపెనీతో జేఎస్‌డబ్ల్యూ ఒక ఒప్పందం కుదుర్చుకోనున్నదని సమాచారం. ఈ డీల్ విలువ రూ.500 కోట్ల వరకూ ఉండొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రష్యాకు చెందిన సెవెర్‌స్టల్ యాజమాన్యంలోని లుచ్చిని కంపెనీని సెవిటాల్ 2014లో కొనుగోలు చేసింది. ఆ తర్వాత లుచ్చిని పేరును అఫెర్నిగా మార్చింది. అఫెర్ని కంపెనీ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తోంది. రైల్వేలు, ఇంధనం, వాహన, ఇంజినీరింగ్ రంగాల్లో ఉపయోగపడే ఉత్పత్తులను అందిస్తోంది.

ఫెడ్ రేట్ల పెంపు భయాలతో నష్టాలు

- 162 పాయింట్లు పతనమై 34,184కు సెన్సెక్స్
- 61 పాయింట్ల నష్టంతో 10,493కు నిఫ్టీ

అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు భయాలతో బుధవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా ఉండటం, డాలర్‌తో రూపాయి మారకం 44 పైసలు పతనం కావడం ప్రతికూల ప్రభావం చూపాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 162 పాయింట్లు పతనమై 34,184 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 10,500 దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 10,462 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయిన నిఫ్టీ చివరకు 61 పాయింట్ల నష్టంతో 10,493 పాయింట్ల వద్ద ముగిసింది. భవిష్యత్ రేట్ల పెంపు తథ్యమన్నట్లుగా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలివ్వడంతో ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం, బ్యాంక్ షేర్లలో అమ్మకాలు కొనసాగడం.. మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. జనవరిలో జీఎస్‌టీ వసూళ్లు స్వల్పంగా తగ్గడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ 34,157 పాయింట్ల వద్ద నష్టాలతో ఆరంభమైంది. విదేశీ నిధులు వెళ్లిపోతాయనే ఆందోళనతో అమ్మకాలు జోరుగా సాగాయి. దీంతో 270 పాయింట్ల నష్టంతో 34,076 పాయింట్ల కనిష్ట స్థాయికి పడిపోయింది.

బ్యాంక్ షేర్లు బేర్: పంజాబ్ నేషనల్ బ్యాంక్ రుణ కుంభకోణం నేపథ్యంలో నిర్వహణ, టెక్నికల్ రిస్క్‌లకు సంబంధించి ముందస్తు చర్యలను 15 రోజుల్లోగా తీసుకోవలసిందిగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. యాక్సిస్ బ్యాంక్, యస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు 2 శాతం మేర నష్టపోయాయి.



లాభాల్లో పీఎన్‌బీ: గత కొంత కాలంగా నష్టపోతూ వచ్చిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేర్ తేరుకుంది. ఇంట్రాడేలో 12.1 శాతం నష్టంతో 20 నెలల కనిష్టానికి, రూ.92కు పడిపోయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ షేర్ చివరకు 3 శాతం లాభంతో రూ.101 వద్ద ముగిసింది.

బీఎస్ఈ నుంచి 36 కంపెనీలు డీలిస్ట్... బాంబే స్టాక్ ఎక్స్చేంజ్(బీఎస్ఈ) నుంచి 36 కంపెనీలు డీలిస్ట్ కానున్నాయి. ఈ కంపెనీ షేర్లలో ట్రేడింగ్ మూడేళ్లపాటుగా సస్పెండ్ కావడంతో వచ్చే వారం (ఈ నెల 5) నుంచి ఈ కంపెనీలను డీలిస్ట్ చేస్తున్నామని బీఎస్ఈ తెలిపింది.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	3,276
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	35,922
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	7,78,711
ఎఫ్ఐఐ	-1,751
డీఐఐ	1,597

విస్తరిస్తున్న విలాస మార్కెట్

- ఈ ఏడాది 30 బిలియన్ డాలర్లకు: అసోచామ్
- వచ్చే మూడేళ్లలో ఐదు రెట్ల వృద్ధి అవకాశాలు

ముంబై: ఖరీదైన బ్రాండెడ్ ఉత్పత్తుల వినియోగం పట్ల మక్కువ చూపే వారి సంఖ్య పెరుగుతోంది. అంతర్జాతీయ బ్రాండెడ్ ఉత్పాదనలు అందుబాటులోకి వస్తుండడంతో ఈ మార్కెట్ 30 శాతం వృద్ధితో డిసెంబర్ నాటికి 30 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రస్తుత దేశీయంగా సంపన్న ఉత్పత్తుల మార్కెట్ విలువ 23.8 బిలియన్ డాలర్ల మేర ఉంది. ''యువతలో అంతర్జాతీయ బ్రాండ్ల వినియోగం పెరుగుతుండటం, చిన్న పట్టణాల్లో ఉన్నత తరగతి ప్రజలు కొనుగోలు శక్తితో లగ్జరీ కార్లు, బైక్‌లు, విదేశీ పర్యటనలు, దూర ప్రాంత వివాహాలు తదితర వాటితో ఈ మార్కెట్ ఈ ఏడాది చివరికి 30 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది'' అని అసోచామ్ తన నివేదికలో పేర్కొంది. రానున్న మూడేళ్లలో ఈ మార్కెట్ ఐదు రెట్ల మేర వృద్ధి చెందుతుందని అంచనా వేసింది.

వృద్ధికి కారకాలు...

- మిలియనీర్ల సంఖ్య వచ్చే ఐదేళ్లలో మూడు రెట్లు పెరగనుండటం.
- ఆర్థిక వృద్ధి పట్టణీకరణకు దారితీయడం, ఆదాయం పెరుగుతుండటం.
- విలాస ఉత్పత్తుల అందుబాటు, మరిన్ని విలాస బ్రాండ్లు దేశంలోకి ప్రవేశించడం.
- చిన్న పట్టణాల్లో ఇంటర్నెట్ వ్యాప్తి, ఖర్చు చేసే ఆదాయం పెరగడం వల్ల 2020 నాటి కి ఇంటర్నెట్‌పై 10 కోట్ల లావాదేవీలు జరుగుతాయి. దీంతో ఖరీదైన ఉత్పత్తుల వినియోగం ఎన్నో రెట్లు పెరగనుంది.
- వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా బ్రాండ్లను ప్రమోట్ చేసుకోవడం.
- రిటైల్ పరిశ్రమకు సంబంధించి సానుకూల విధానాల ఫలితంగా అంతర్జాతీయ బ్రాండ్లకు ఆకర్షణీయంగా మారిన భారత్ మార్కెట్.

మూడు నెలల కనిష్ట విలువకు రూపాయి

- డాలర్‌తో 30 పైసలు కోల్పోయి 65.17కు చేరిక
- వరుసగా మూడో రోజు నష్టాలు



ముంబై: డాలర్‌తో రూపాయి వెలవెలబోయింది. ఒకే రోజు బుధవారం ఫారెక్స్ మార్కెట్లో 30 పైసలు పడిపోయి 65.17కు చేరింది. రూపాయికి ఇది మూడు నెలల కనిష్ట స్థాయి. ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జీరోమ్‌పావెల్ అమెరికా ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తులో బలంగా ఉంటుందని, ఈ ఏడాది కూడా వడ్డీ రేట్ల పెంపు కొనసాగుతుందంటూ చేసిన ప్రకటనతో డాలర్ బలం పుంజుకుంది. ఇంట్రాడేలో రూపాయి 65.32 వరకూ తగ్గింది. ఆ తర్వాత తిరిగి కాస్త కోలుకుని నికరంగా 30 పైసలు నష్టం (0.46 శాతం)తో 65.17 వద్ద క్లోజయింది.

ఆంధ్రప్రదేశ్‌లో డెస్క్‌ఎరా రూ.500 కోట్ల పెట్టుబడులు

విశాఖపట్నం: చిన్న, మధ్య తరహా సంస్థలకు క్లౌడ్ ఆధారిత సమగ్ర వ్యాపార నిర్వహణ సాఫ్ట్‌వేర్ సేవలు అందించే డెస్క్‌ఎరా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.500 కోట్లను ఇన్వెస్ట్ చేసేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. విశాఖపట్నంలో క్లౌడ్ సెంటర్ ఏర్పాటు చేసి రానున్న ఐదేళ్ల కాలంలో 1,000 మందికి పైగా ఉపాధి కల్పించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, పంచాయతీరాజ్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగినట్టు కంపెనీ ఓ ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రంలో ఉన్న సాఫ్ట్‌వేర్ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని అనుకుంటున్నట్టు డెస్క్‌ఎరా సీఈవో శశాంక్ దీక్షిత్ తెలిపారు. డెస్క్‌ఎరా ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఐదు పట్టణాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, రానున్న కొన్ని నెలల్లో మరో 20 పట్టణాలకు విస్తరించనుంది. చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు మరింత సమర్థతతో నడిచేందుకు వీలుగా అవసరమైన క్లౌడ్, టెక్నాలజీ సేవలను ఈ సంస్థ ఆఫర్ చేస్తుంటుంది.

ఐదు రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయిన హెచ్‌జీ ఇన్‌ఫ్రా

ఈ నెల 9న స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ !

న్యూఢిల్లీ: హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఐదు రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబయింది. బుధవారం ముగిసిన ఈ ఐపీఓ ధరల శ్రేణి రూ.263 –270గా ఉంది. ఈ ఐపీఓలో భాగంగా కంపెనీ 1.21 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. మొత్తం 6.02 కోట్ల షేర్లకు దరఖాస్తులొచ్చాయి. ఈ కంపెనీ షేర్ ఈ నెల 9న స్టాక్ మార్కెట్లో లిస్టయ్యే అవకాశాలున్నాయి. ఈ ఐపీఓ ద్వారా రూ.462 కోట్లు సమీకరించాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణ భారం తగ్గించుకోవడానికి, మూలధన పరికరాల కొనుగోలుకు, సాధారణ వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకోవాలని కంపెనీ భావిస్తోంది.

పేటీఎం మాల్‌తో టీవీఎస్ ఆటో అసిస్ట్ జట్టు



చెన్నై: కార్లు, బైకులు ఏదైనా సమస్య వచ్చి రోడ్డు మధ్యలో ఆగిపోయిన పక్షంలో బ్రేక్‌డౌన్ అసిస్టెన్స్ సేవలందించే దిశగా పేటీఎం మాల్‌తో టీవీఎస్ ఆటో అసిస్ట్ చేతులు కలిపింది. ఈ ఒప్పందం కింద రోడ్ అసిస్టెన్స్ సర్వీస్ ప్యాకేజీలను పేటీఎం తమ ప్లాట్‌ఫాంపై విక్రయించనుంది. ఆటో అసిస్ట్‌లో సభ్యత్వానికి సంబంధించి గోల్డ్ మెంబర్‌షిప్ ఫీజు రూ.1,499గా, ప్లాటినం మెంబర్‌షిప్‌కి రూ.2,999గా ఉంటుంది. వినియోగాన్ని బట్టి చార్జీలు చెల్లించే ప్రాతిపదికన టీవీఎస్ ఆటో అసిస్ట్‌లో సభ్యులు కాని వారికి కూడా సర్వీసులు అందిస్తామని టీవీఎస్ ఆటోమొబైల్ సొల్యూషన్స్ ఈడీ జి. శ్రీనివాస రాఘవన్ తెలిపారు. రాత్రి 8 గం. నుంచి తెల్లవారుఝాము 5 గం.ల మధ్య ప్రయాణించే మహిళా ప్యాసింజర్స్‌కి కూడా సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఈ తరహా ప్రయోగాన్ని హైదరాబాద్‌తో పాటు న్యూ ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరులో అందించనున్నట్లు తెలియజేశారు.

ప్రైమ్ సభ్యులకు అమెజాన్ ఉచిత మ్యూజిక్



ముంబై: ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ తాజాగా తమ ప్రైమ్ పథకంలో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రకటనల బాదరబందీ లేని మ్యూజిక్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. అమెజాన్ ప్రైమ్ మ్యూజిక్ పేరిట ప్రవేశపెట్టిన ఈ సర్వీసులకు అదనంగా ఏమీ చెల్లించనక్కర్లేదని సంస్థ తెలియజేసింది. పదికి పైగా భాషల్లో దేశ, విదేశాలకు చెందిన పాటలు, సంగీతం ఇందులో అందుబాటులో ఉంటాయని అమెజాన్ మ్యూజిక్ ఇండియా డైరెక్టర్ సాహస్ మల్హోత్రా తెలిపారు.



ముంబైలో జరిగిన బీఎఫ్ఎస్ఐ-ఐకాన్ అవార్డ్స్ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ బ్రోకర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారంతో అమేజ్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి (మధ్య)

బులియన్ రూ.లలో



ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,535	▲	160
బంగారం (99.5, 10గ్రా)	30,385	▲	160
వెండి (కిలో)	38,210	▲	285
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	– –		
బంగారం (22 క్యారెట్లు)	29,010	▲	230
వెండి (కిలో)	– –		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,460	▲	230
బంగారం (22 క్యారెట్లు)	29,010	▲	70
వెండి (కిలో)	41,200	▲	500
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	31,450	▲	50
బంగారం (22 క్యారెట్లు)	29,080	▲	70
వెండి (కిలో)	39,400	▲	500
విశాఖపట్నం (మంగళవారం అందిన ధరలు)			
బంగారం (24 క్యారెట్లు)	31,854		
బంగారం (22 క్యారెట్లు)	29,200		
వెండి (కిలో)	41,000		
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,500	▲	100
బంగారం (22 క్యారెట్లు)	29,100	▲	200
వెండి(కిలో)	39,600	▲	200
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,440	▲	170
బంగారం (22 క్యారెట్లు)	29,080	▲	160
వెండి (కిలో)	39,300	▲	400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.29 (రాత్రి 11.00కు)	$63.01 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	65.59 (రాత్రి 11.00కు)	$66.52 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 01-2-2018

విశాఖ	350–00
చిత్తూరు	388–00
వరంగల్	347–00
ముంబై	390–00
చెన్నై	395–00
విజయవాడ	340–00
గోదావరి	340–00
నమక్కల్	380–00
28-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.05
బెంగళూరు	385–00
కోల్‌కతా	398–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	408.35	410.45
AMBUJA CEME	252.35	251.4
ASIAN PAINT	1117.75	1110.35
AXIS BANK L	528.75	538.4
BAJAJ AUTO	3020.6	3034.7
BAJAJ FINAN	1640.25	1656.8

A B C D

20 MICRONS	50.5	50.6
3M INDIA LI	20717.4	20564.8
5PAISA CAPI	349.85	357.55
63 MOONS TE	93.35	93.35
8K MILES SO	736.55	744.25
AARTI DRUGS	600.4	603.7
AARTI INDUS	1173.05	1156.3
AARVEE DEN.	50.75	50.85
AARVI ENCON	100	98
BANSWARA SY	114	114.35
BASF INDIA	2037	2044.4
BATA INDIA	729.95	722.65
BAYER CROPS	3798.7	3798.9
BEARDSELL L	56.5	57.6
BEML LIMITE	1235.1	1232.3
BERGER PAIN	248.7	246.85
BETA DRUGS	145.25	148
BF INVESTME	328.55	329.05
BF UTILITIE	441.45	450.4
BGR ENERGY	116.85	117.7
BHAGERIA IN	295.15	298.5
BHAGYANAGAR	48.35	50.7
DILIP BUILD	945.75	941.3
DISH TV IND	73.6	71.95
DISHMAN CAR	336.25	342.85
DIXON TECHN	3454.75	3456.8
DOLLAR INDU	457.6	440.65
DOLPHIN OFF	89.45	90.7
DONEAR IND.	61.25	61.5
DR. LAL PAT	911.6	907.65
DYNAMATIC T	1975.25	1896.4
DYNEMIC PRO	200.2	199.8

E F G H

GUJARAT AMB	272.15	268.3
GUJARAT FLU	773.65	774.4
GUJARAT GAS	870	895.2
GUJARAT MIN	140.7	137
GUJARAT PIP	142	142.45
GUJARAT STA	207.05	204.45
GULF OIL LU	997.2	994.85
GULSHAN POL	79.9	79.45
HARITA SEAT	961.8	950
HARRISON MA	84.5	84.6
HATSUN AGRO	743.3	767
HCL INFOSYS	63.9	64.05
HDFC STAND	461.2	469

I J K L

JINDAL POLY	354.9	352.35
JINDAL SAW	138.35	138.25
JINDAL STAI	101.1	103
JINDAL STAI	185.85	189.1
JINDAL STEE	254.4	264.05
JINDAL WORL	628.95	626.8
JK CEMENT L	1011.8	1024.9
JK LAKSHMI	424.85	435.9
JK PAPER LI	139.95	139.3
JK TYRE & I	150.5	147.55
JKUMAR INFR	322.35	324.3
JM FINANCIA	147.55	152.8
JMC PROJECT	579.85	583.95

M N O P

MAX FINANCI	495.45	497.95
MAX INDIA L	96	95.95
MAX VENTURE	77.75	78.7
MAYUR UNIQU	510.05	509.2
MAZDA LIMIT	372.55	376.25
MCLEOD RUSS	165.1	167.3
MCNALLY BH.	63.85	64.2
MEGHMANI OR	91.75	94.05
MENON BEARI	102.75	104.55
MEP INFRA.	86.5	87.8
MERCK LIMIT	1578.4	1508.85
MINDA CORPO	187.25	191.75
MINDA INDUS	1128.55	1126.35
PRABHAT DAI	172.25	173.7
PRAJ INDUST	90.75	92.75
PRAKASH IND	209.4	212.55
PRATAAP SNA	1233.35	1219.45
PRAXIS HOME	159.7	158.35
PRECISION C	110.4	110.95
PRECISION W	303.05	305.3
PRECOT MERI	66.25	69.05
PREMIER EXP	387.35	392.1
PRESSMAN AD	56.8	57.55
PRESTIGE ES	335.3	325.05
PRICOL LIMI	96.75	98.9
PRIME FOCUS	101.8	101.15

R S T U

SHOPPERS ST	539.05	537.2
SHRE PUSH C	246.65	259.1
SHREE TIRUP	55	55.25
SHRENIK LIM	570.35	577.85
SHREYANS IN	154.9	157.05
SHREYAS SHI	557.6	568.75
SHRIRAM CIT	2020.6	1943
SICAL LOGIS	223.35	223.25
SIL INVESTM	435.35	439.35
SILLY MONKS	138.7	144
SILVER TOUC	121	121.05
SIMPLEX INF	579.65	573.75
THE STATE T	156.1	157.3
THE TINPLAT	232.75	236.1
THEJO ENGIN	535	560
THEMIS MEDI	563.85	518.3
THERMAX LTD	1154.55	1169.35
THIRUMALAI	2000.4	2024.65
THOMAS COOK	242.85	242.5
THYROCARE T	624.4	626.85
TI FINANCIA	670.4	673.35
TIDE WATER	6451.35	6459.9
TIL LTD	507.75	516.45
TIME TECHNO	173.35	177.9

V W X Z

బీఎస్ఈలో ఏపీ, టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
Aditya	[illegible]	[illegible]

ఐదుగురు మిలీషియా సభ్యుల అరెస్ట్

మావోయిస్టులకు మందులు తీసుకెళ్తుండగా పట్టుకున్న పోలీసులు

చర్ల: మావోయిస్టు పార్టీకి చెందిన ఐదుగురు మిలీషియా సభ్యులను బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీసులు అరెస్టు చేశారు. సీఐ తాళ్లపల్లి సత్యనారాయణ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చర్ల మండలం కుర్నపల్లి శివారులోని కురకట్‌పాడుకు చెందిన మడివి మంగయ్య, కుడుం నంగయ్య, మడకం దేవ, సోడి దేవయ్య, సోడి మూకయ్య మావోయిస్టుల కోసం మంగళవారం భద్రాచలంలో రూ.5000 విలువైన మందులు కొనుగోలు చేశారు. బుధవారం తెల్లవారుజామున మందులను తీసుకుని వెంకటాపురం వైపు వెళ్లే బస్సు ఎక్కి దేవరాపల్లిలో దిగారు. అక్కడి నుంచి కురకట్‌పాడుకు కాలినడకన వెళ్తుండగా దేవరాపల్లి శివారులో స్పెషల్‌పార్టీ, సీఆర్‌పీఎఫ్ 141 బెటాలియన్ బలగాలు తనిఖీలు నిర్వహిస్తుండగా వీరు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో మావోయిస్టులకు అందజేసేందుకు మందులు తీసుకెళ్తున్నట్లు అంగీకరించారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ చెప్పారు.

బేస్ క్యాంప్‌లపై స్మగ్లర్ల మెరుపు దాడి



ఖానాపూర్: నిర్మల్ జిల్లా పెంబి అటవీ రేంజ్ పరిధిలోని ఆర్దినాల–1 బేస్ క్యాంపుపై ఇచ్చోడ మండలంలోని పలువురు కలప స్మగ్లర్లు బుధవారం సాయంత్రం మెరుపు దాడికి దిగారు. క్యాంపు సిబ్బంది హన్మంతు, కైలాస్, లచ్చన్న, సంతోష్‌పై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన వారిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఖానాపూర్ ఎఫ్‌డీవో సీహెచ్ రవీందర్ తెలిపారు. బుధవారం ఏడు ఎడ్ల బండ్లలో కలప తరలించే క్రమంలో అడ్డుకోవడంతో ముందుగా బండ్లు వదిలి పారిపోయిన స్మగ్లర్లు తిరిగి వచ్చి సిబ్బందిపై అనూహ్యంగా దాడికి పాల్పడ్డారని చెప్పారు. కలప స్మగ్లర్ల దందాకు చెక్ పెట్టడంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దారులు లేకుండా ట్రెంచ్‌లు తవ్వించడంతో, స్మగ్లర్లు ఈ విధంగా దాడులకు పాల్పడినట్లు ఎఫ్‌డీవో తెలిపారు.

‘కృష్ణా’పై కొట్లాట!

సాగర్ నీటి విడుదలపై తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం

- ఏపీ సీఎం జోక్యం.. బోర్డు సభ్య కార్యదర్శికి ఫోన్
- తెలంగాణ ఈఎన్‌సీతో బోర్డు కార్యదర్శి చర్చలు
- 2 వేల క్యూసెక్కుల విడుదలకు ఓకే
- సాయంత్రానికి చల్లారిన వివాదం

సాక్షి, హైదరాబాద్/నాగార్జునసాగర్: కృష్ణా జలాలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య బుధవారం ఉదయం మొదలైన వివాదం సాయంత్రానికి చల్లారింది. వాటాకు మించి వాడుకున్న కారణంగా నీటి విడుదల నిలిపివేయాలని ఏపీని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆదేశించడం, దాన్ని ఏపీ ధిక్కరించడం.. అనంతరం ఏపీ ముఖ్యమంత్రి రంగంలోకి దిగడం, తెలంగాణతో బోర్డు సంప్రందిపులు జరపడం, తెలంగాణ అంగీకరించడం అన్నీ చకాచకా జరిగిపోయాయి. దీంతో ప్రస్తుత వివాదానికి తాత్కాలికంగా ఉపశమనం లభించింది. ఇరు రాష్ట్రాల అవసరాలపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు ఈ నెల 2న మధ్యాహ్నం 3 గంటలకు బోర్డు త్రిసభ్య కమిటీ భేటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం చేసింది.

వాటా వాడేసిన ఏపీ

ప్రస్తుత వాటర్ ఇయర్‌లో కృష్ణాలో మొత్తంగా 466.64 టీఎంసీల నీటిని ఇరు రాష్ట్రాలు వినియోగించుకున్నాయి. తెలంగాణ 142.14 టీఎంసీలు, ఏపీ 324.50 టీఎంసీలు వాడుకున్నట్లుగా లెక్కలు తేలాయి. అవిగాక కృష్ణా బోర్డు జనవరిలో తెలంగాణకు 50 టీఎంసీలు, ఏపీకి 60 టీఎంసీలను పంచింది. అయితే ఏపీ కేటాయింపులకు మించి 2.32 టీఎంసీల నీటిని వాడినట్లు బోర్డు గుర్తించి శ్రీశైలం, సాగర్ కుడి కాల్వ పరిధిలో నీటి విడుదల నిలిపివేయాలని ఆదేశించింది. దీంతో బుధవారం నుంచి కుడి కాల్వ పరిధిలో ఏపీ నీటి వినియోగాన్ని తెలంగాణ నిలిపివేసింది. దీనిపై ఏపీ అధికారులు సాగర్ డ్యామ్‌పై హడావుడి చేయడంతో వివాదం మొదలైంది. కుడి కాల్వకు నీటిని విడుదల చేసేందుకు నాగార్జున సాగర్ డ్యాం దగ్గర రెగ్యులేటర్‌ను ఆపరేట్ చేసుకోవాలని, తెలంగాణ అధికారులు అభ్యంతరం చెబితే పోలీసుల రక్షణ తీసుకోవాలంటూ ఏపీ నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వర్ రావు రాసిన లేఖతో ఆ రాష్ట్ర అధికారులు రంగంలోకి దిగారు. కృష్ణా బోర్డు కేటాయింపులతో తమకు సంబంధం లేదంటూ తెలంగాణ అధికారులతో వితండవాదానికి దిగారు. అయితే ఉన్నతాధికారుల అనుమతి లేకుండా చుక్క నీటిని కూడా విడుదల చేయలేమంటూ తెలంగాణ అధికారులు తెగేసి చెప్పారు.దీంతో డ్యామ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎస్.సునీల్.. నల్లగొండ కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ముందు జాగ్రత్త చర్యగా డ్యామ్ వద్ద ఇరురాష్ట్రాల పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.



బుధవారం సాగర్ డ్యాం వద్ద ఉద్రిక్తత నేపథ్యంలో పోలీసుల పహారా

ఏపీ సీఎం రంగంలోకి..

ఈ వివాదం జరుగుతుండగానే తమ రాష్ట్రానికి నీళ్లు విడుదల చేయాలని కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి పరమేశానికి ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. కనీసం 2 వేల క్యూసెక్కులైనా విడుదల చేయాలని కోరారు. దీనిపై తెలంగాణ అధికారులతో చర్చిస్తానన్న పరమేశం.. వెంటనే తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌తో మాట్లాడారు. కుడి కాల్వల కింది పంటలకు నీటి అవసరాల దృష్ట్యా 5 రోజులపాటు 2 వేల క్యూసెక్కుల మేర విడుదలకు ఈఎన్‌సీ అంగీకరించడంతో కుడి కాల్వకు నీటిని విడుదల కొనసాగించవచ్చంటూ పరమేశం ఆదేశాలు ఇచ్చారు. దీంతో వివాదం చల్లారింది. అయితే శ్రీశైలం జలాశయం ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేస్తేనే తాము కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తామని డ్యామ్ చీఫ్ ఇంజనీర్ సిరివోరు సునీల్ తెలిపారు. ఈ విషయమై ఇప్పటివరకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

బెల్లంపల్లిలో 13 మంది నిందితుల అరెస్టు



బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో పోలీసులు భారీగా నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ, బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి నకిలీ విత్తనాల గుట్టును రట్టు చేశారు. ఈ వ్యవహారంతో ప్రమేయం ఉన్న 13 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టుకు పంపించారు. బుధవారం బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామగుండం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథితో కలసి బెల్లంపల్లి ఏసీపీ వి.బాలుజాదవ్ వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద కొందరు వ్యక్తులు కార్లలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయించడానికి సిద్ధమవుతున్నట్లు పోలీసులకు మంగళవారం సాయంత్రం సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమయిన పోలీసులు రాత్రి సుమారు 8.30 గంటల ప్రాంతంలో నాలుగు బృందాలుగా విడిపోయి దాడులు నిర్వహించారు. నాలుగు కార్లు, ఆటోలో ఉన్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. బెల్లంపల్లికి చెందిన కొత్తపల్లి శ్రీనివాస్ అనే ఫెర్టిలైజర్ షాపు యాజమానికి నకిలీ పత్తి విత్తనాలు విక్రయించడానికి వచ్చినట్లు వారు తెలిపారని పోలీసు అధికారులు వివరించారు. వీరి వద్ద నుంచి 3.20 క్వింటాళ్ల నకిలీ లూజ్ విత్తనాలు, శ్రీపావని పేరుతో ఉన్న 600 నకిలీ విత్తనాల ప్యాకెట్లు (3 క్వింటాళ్లు), రూ.2.53 లక్షల నగదు, రూ.లక్ష విలువైన చెక్కు, 17 సెల్ ఫోన్లు, నాలుగు కార్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాల విలువ మార్కెట్లో రూ.12.48 లక్షలు ఉంటుందని తెలిపారు.

‘కనిమెట్ట ప్రమాదం’పై విచారణ

కొత్తకోట: వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కనిమెట్ట వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై ఈనెల 21న రెండు కార్లు ఢీకొని తొమ్మిది మంది దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ ఘటనపై రాష్ట్ర రోడ్డు భద్రత శాఖ, డీజీపీ కృష్ణప్రసాద్ విచారణ బుధవారం చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై మహబూబ్‌నగర్ ఎస్పీ అనురాధ, వనపర్తి ఏఎస్పీ సురేందర్‌రెడ్డి, కొత్తకోట సీఐ సోంనారాయణ్‌సింగ్‌తో వచ్చిన ఆయన ప్రమాద స్థలంలో వివరాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఘటన మానవ తప్పిదం వల్ల జరిగిన దుర్ఘటనగా పేర్కొన్నారు.గంటకు 100 కంటే ఎక్కువ వేగంతో నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

పరిహారం కోసం పనుల అడ్డగింత

గోపాల్‌పేట(వనపర్తి): ఇండ్ల పరిహారం చెల్లించాలని, పునరావాసం, జీవనోపాధి కల్పించాలనే డిమాండ్‌తో ముంపు గ్రామాల ప్రజలు బుధవారం ఏదుల రిజర్వాయర్ పనులను అడ్డుకున్నారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరావిపాకుల, కొంకలపల్లి గ్రామాల పరిధిలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే, పనులు ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా తమకు పరిహారం చెల్లించకపోగా.. పునరావాసం, జీవనోపాధి అంశాలపై స్పష్టత ఇవ్వడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఏదుల దగ్గర బండ్, నాగ్‌పూర్ వద్ద ఒపెన్ కెనాల్, కోడేరు మండలం తీగలపల్లి దగ్గర పంప్‌హౌజ్ పనులు జరగకుండా నిలిపివేశారు.

నేడు విదుశేఖర భారతి స్వామి రాక

గద్వాల: శృంగేరి శారదాపీఠం 37వ శంకరాచార్య, చిన్నస్వామి శ్రీశ్రీ విదుశేఖర భారతి స్వామి గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈ మేరకు గద్వాలలో ఘనంగా స్వాగతం పలకడానికి ఎమ్మెల్యే డీకే. అరుణతో పాటు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. విదుశేఖర విజయ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానం పలకాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా గద్వాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని గత నెల ఎమ్మెల్యే డీకే.అరుణ.. కర్ణాటకలోని శృంగేరి పీఠానికి వెళ్లి స్వామి వారిని ఆహ్వానించారు.

WAN IFRA ICQC 2018-20

ఇద్దరు రైతుల ఆత్మహత్య

మల్హర్(మంథని)/నర్సింహులపేట(డోర్నకల్): అప్పుల బాధ భరించలేక జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలో ఒక రైతు, మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం శివారు జగ్యాతండాలో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మల్హర్ మండలం మల్లెంపల్లికి చెందిన జింకల రవి(42) జ్కి దిగుబడి రాకపోవడంతో రూ.5లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం తెలియక రవి మంగళవారం పురుగు మందు తాగాడు. వరంగల్ ఎంజీఎంకు తరలించగా బుధవారం మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లా రైతు భూక్య హెమోజీ (48)కి రూ.4 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పు ఎలా తీర్చాలని మనో వేదనకు గురైన అతడు పొలంలో బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

పేదలకు కడుపు నిండా అన్నం

మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లాలో పాస్‌పోర్ట్ కేంద్రం ప్రారంభించిన మంత్రి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

సాక్షి, సిద్దిపేట: పేదలకు కడుపు నిండా అన్నం పెట్టి దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేయడమే ప్రభుత్వ లక్ష్యమని భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లాలో పాస్‌పోర్టు సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పౌర సరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి సివిల్ సప్లైస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గతంలో పౌర సరఫరాల శాఖ నుంచి రైళ్లల్లో, ట్రక్కుల్లో బియ్యం అక్రమంగా తరలివెళ్లేవని, దీనిని అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటెల రాజేందర్, కమిషనర్ సీవీ ఆనంద్ విప్లవాత్మక మార్పులు తెచ్చారని అభినందించారు. ఈ–పాస్ విధానం ద్వారా బినామీలు రేషన్ పొందకుండా చెక్ పెట్టామన్నారు. దీంతో ఏటా రూ.500 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదా అవుతోందని చెప్పారు. ఈ నిధులు పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, సంక్షేమ హాస్టల్స్‌కు సన్న బియ్యం సరఫరాకు ఉపయోగపడుతున్నాయన్నారు. రైతులకు మేలు చేయాలనే ఆలోచనతో గత సీజన్‌లో రాష్ట్రంలో 5,300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 53 లక్షల టన్నుల ధాన్యాన్ని రూ.8,100 కోట్లు వెచ్చించి కొన్నామని, మహిళా సంఘాలు, పీఏసీఎస్ ఉద్యోగుల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి 72 గంటల్లో డబ్బులు అందజేశామని చెప్పారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే రికార్డు అని అన్నారు. బియ్యం అక్రమ రవాణా అరికట్టడం కోసం కమాండ్ అండ్ కంట్రోల్ రూం ప్రారంభించామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈ విధానం మంచి ఫలితాలను ఇచ్చిందని, ఇప్పుడు సిద్దిపేటలో ప్రారంభించామని, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తృతం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 171 ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద 17 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, వాహనాలకు జీపీఎస్ అమర్చడంతో అక్రమాలను అడ్డుకట్ట వేస్తున్నామని మంత్రి స్పష్టంచేశారు.

డీలర్ల సమస్య సీఎం దృష్టికి..

రాష్ట్రంలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు డీలర్ల సంఘం నాయకులు దృష్టికి తెచ్చారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు. డీలర్ల సమస్యను పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్, సీఎం సమక్షంలో చర్చించి పరిష్కరిస్తామన్నారు.

అక్రమ రవాణాకు చెక్: సీవీ ఆనంద్

రాష్ట్రం నుంచి రేషన్ బియ్యం ఇతర దేశాలకు అక్రమ రవాణా అవుతోందంటూ వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో బియ్యం పక్కదారి పట్టకుండా కమాండ్ అండ్ కంట్రోల్ విధానం ప్రారంభించామని సివిల్ సప్లై రాష్ట్ర కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. అన్ని మెయిన్ గోదాంలు, ఎంఎల్ఎస్ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. నిజమైన లబ్ధిదారులకే బియ్యం సరఫరా చేయాలనే ఆలోచనతో ఈ పాస్ విధానం అమలు చేస్తున్నామన్నారు. వేలిముద్రలు పడని వారి కోసం త్వరలో ఐరిస్ విధానం తీసుకొస్తామన్నారు.

ఆడపిల్ల పుట్టిందని అమ్మేశాడు!

రంగారెడ్డి జిల్లా మేకంగుట్ట తండాలో దారుణం

షాద్‌నగర్ రూరల్: ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో ఆడపిల్ల పోషణ భారమవుతుందని భావించిన ఓ తండ్రి రెండు నెలల పసికందును అమ్మేశాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా చౌలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మేకంగుట్ట తండాలో ఆలస్యంగా వెలుగు చూసింది. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం గుడ్డి రుక్యాతండాకు చెందిన హస్లీబాయికి రెండేళ్ల క్రితం మేకంగుట్ట తండాకు చెందిన కుమార్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. మొదటి కాన్పులో హస్లీబాయి ఆడపిల్లకు జన్మనిచ్చింది. రెండు నెలల క్రితం మరో కాన్పులో మళ్లీ ఆడపిల్ల పుట్టింది. రెండవ కాన్పులో కూడా ఆడపిల్లకు జన్మనివ్వడంతో ఘర్షణ పడటం ప్రారంభించాడు. బిడ్డను వదిలించుకోవడానికి హైదరాబాద్‌కు చెందిన వారికి రూ.15 వేలకు అమ్మేశాడు. పసిపాపను ఏం చేశావని హస్లీ ప్రశ్నిస్తే చంపుతానని బెదిరించాడు. దీందో బిడ్డను తన భర్త అమ్మేశాడని హస్లీబాయి షాద్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది.

నందిగామలో ఉద్రిక్తత

మద్దూరు: మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలంలోని నందిగామలో బుధవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అనుచరులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాలు.. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పట్నం మహేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి తదితరులు మండలంలోని మన్నాపూర్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మంత్రులు గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించేందుకు వెళ్లగా.. ఎమ్మెల్యే రేవంత్ తన అనుచరులతో కొత్తపల్లి మీదుగా నందిగామ వెళ్లారు. అక్కడ మంత్రులు రాకముందే శిలాఫలకాన్ని ఆవిష్కరించేందుకు యత్నించగా.. పది నిమిషాల్లో మంత్రులు వస్తారని పోలీసులు చెప్పారు. కొద్దిసేపు ఆగిన ఎమ్మెల్యే ఆ వెంటనే శిలాఫలకం ఎదుట కొబ్బరికాయ కొట్టారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరగగా శిలాఫలకం ధ్వంసమైంది. అనంతరం అక్కడి నుంచి ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు వేరే గ్రామానికి వెళ్లడానికి వాహనాల్లో ఎక్కగా.. వాహన శ్రేణిని టీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు అడ్డగించారు. దీంతో ఎమ్మెల్యే వాహనం దిగి పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

బాలకార్మికుల్లేని తెలంగాణను నిర్మిద్దాం

బాలల హక్కుల సాధనకు కృషిచేద్దాం: సత్యార్థి

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు.. పిల్లల హక్కులు హరించే వారిపై ఉక్కుపాదం: మంత్రి ఈటల





బుధవారం కరీంనగర్ బాలమిత్ర సదస్సులో సత్యార్థితో సెల్ఫీ దిగుతున్న పిల్లలు, సదస్సుకు హాజరైన విద్యార్థులు

కరీంనగర్ లీగల్/శాతవాహన యూనివర్సిటీ (కరీంనగర్)/ఇబ్రహీంపట్నం రూరల్: బాలకార్మికుల్లేని తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలని నోబెల్ గ్రహీత కైలాశ్ సత్యార్థి పిలుపునిచ్చారు. దేశంలో పిల్లలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంరక్షణ కోసం అందరూ ఉద్యమించాలన్నారు. ప్రపంచంలో 53 శాతం బాలలకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నగర పంచాయతీ పరిధిలోని శేరిగూడ శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాలలో ‘చైల్డ్ ఫ్రెండ్లీ తెలంగాణ’అంశంపై జరిగిన సెమినార్‌లో పాల్గొన్నారు. పిల్లల సంతోషాలు, కళలను పట్టించుకోకపోవడంతో వారి బాల్యం బుగ్గిపాలవుతోందని, చాలా ప్రాంతాల్లో పిల్లలు బాలకార్మికులుగా మగ్గిపోతున్నారని, పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కాలేజీ ఆడిటోరియానికి కైలాశ్ సత్యార్థి ఆడిటోరియంగా నామకరణం చేశారు.

ప్రతి ఒక్కరి బాధ్యత..

చిన్న పిల్లలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, ప్రతి గంటకు సగటున నలుగురు పిల్లలు లైంగికదాడులకు గురవుతున్నారని సత్యార్థి పేర్కొన్నారు. వీటి నిర్మూలనకు సమాజంలోని పౌరులంతా బాధ్యతగా కృషి చేయాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సహకారంతో బాలల హక్కులను పరిరక్షిస్తూ ప్రపంచంలోనే భారత్‌ను అగ్రగామిగా నిలుపుకొందామని పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఎంపీ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బాలమిత్ర సదస్సుకు హాజరయ్యారు. తల్లిదండ్రుల్లేని అనాథ పిల్లలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంటులో బిల్లు పెట్టిన వినోద్‌ను అభినందించారు. నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పేద పిల్లల సంక్షేమానికి 500 రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు వివిధ రాష్ట్రాల్లో సత్యార్థి ఫౌండేషన్ సంస్థలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని చాలా పాఠశాలల్లో టాయిలెట్లు లేక పిల్లలు బడి మానేస్తున్నారని చెప్పారు. ఇలాంటి సమస్యలను అధిగమించాలంటే పాఠశాలల్లో ఎన్నికలు, పార్లమెంట్, పంచాయితీ వంటివి ఏర్పాటు చేసి పిల్లలకు బాధ్యతలు తెలపాలని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. పిల్లల హక్కులు హరించే వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

టీచర్ ఉద్యోగం రాదని యువతి ఆత్మహత్య

రామారెడ్డి(ఎల్లారెడ్డి): ‘‘ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఐదేళ్లుగా కష్టపడి చదువుతున్నా.. ఆ చదువుకు ఫలితం లేకుండా పోయింది. ఓఎంఆర్ షీట్‌లో వరుస క్రమం తప్పి పొరపాటు చేశాను. జీవితంలో ఉపాధ్యాయ ఉద్యోగం తప్ప మారేదాన్ని ఊహించుకోలేను’’ అని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది ఓ యువతి. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన జపా సుప్రియ(24) సెకండరీ గ్రేడ్ టీచర్ కావాలన్న లక్ష్యంతో ఐదేళ్లుగా చదువుతోంది. ఆదివారం ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష (ఎస్జీటీ) రాసింది. కాగా, సోమవారం విడుదలైన కీ ని చూసుకుని నివ్వెరపోయింది. పరీక్ష హాల్‌లో సమయం గడిచిపోతోందన్న తొందరలో ఓఎంఆర్ షీట్‌లో ఒక ప్రశ్నకు ఇంకో ప్రశ్న జవాబు వేసినట్లు గుర్తించింది. దాదాపు అన్ని ప్రశ్నలకు ఇలాగే జవాబులు రాయడంతో మనో వేదనకు గురైంది. ఇక తనకు ఉద్యోగం రాదని కలత చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పరీక్షలో చేసిన పొరపాటుకు శిక్ష విధించుకుంటున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. మృతురాలి తండ్రి లింగారెడ్డి దుబాయిలో ఉంటున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్
గురువారం 1-3-2018



నేటి నుంచి దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా తొలి టెస్టు

పేస్‌కు పుట్టిల్లయిన డర్బన్‌లోని కింగ్స్‌మీడ్ మైదానంలో గురువారం నుంచి దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు జరగనుంది. గాయాల కారణంగా భారత్‌తో సిరీస్ చివర్లో జట్టుకు దూరమైన సఫారీ కెప్టెన్ డు ప్లెసిస్, ప్రధాన బ్యాట్స్‌మెన్ డివిలియర్స్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చారు. సొంతగడ్డపై 1970 నుంచి ఆసీస్‌తో టెస్టు సిరీస్ గెలవని రికార్డును చెరిపేయాలని ప్రొటీస్ భావిస్తుండగా, మరోవైపు 2016లో తమను తమ దేశంలోనే ఓడించిన దక్షిణాఫ్రికాను ఎలాగైనా మట్టికరిపించాలని స్టీవ్ స్మిత్ సేన ప్రతీకారేచ్ఛతో ఉంది. ఈ మ్యాచ్ సోనీ సిక్స్‌లో మధ్యాహ్నం గం. 1.30 నుంచి ప్రత్యక్ష ప్రసారం కానుంది.



ఫెడరర్ డబుల్ ధమాకా

రెండు 'లారెస్' పురస్కారాలు గెలుచుకున్న స్విస్ టెన్నిస్ దిగ్గజం

మోంటెకార్లో (మొనాకో): టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ ఆటలోనే కాదు అవార్డుల్లోనూ చరిత్ర సృష్టిస్తున్నాడు. క్రీడారంగంలో 'ఆస్కార్' అంతటి ప్రతిష్ట ఉన్న 'లారెస్ స్పోర్ట్స్' అవార్డులను ఈ ఏడాది ఒకటి కాదు... రెండు గెలుచుకున్నాడు. 2017 సంవత్సరానికి క్రీడల్లో కనబరిచిన అత్యుత్తమ ప్రదర్శనకు ఫెడరర్ 'వరల్డ్ స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్'... 'కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్' అవార్డులను గెల్చుకున్నాడు. మరో టెన్నిస్ దిగ్గజం బోరిస్ బెకర్ చేతుల మీదుగా అతను ఈ పురస్కారాలను అందుకున్నాడు. 'స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం రేసులో క్రిస్టియానో రొనాల్డో (ఫుట్‌బాల్), మో ఫరా (అథ్లెటిక్స్), లూయిస్ హామిల్టన్ (ఫార్ములావన్), రాఫెల్ నాదల్ (టెన్నిస్) కూడా ఉన్నప్పటికీ ఫెడరర్‌నే ఈ అవార్డు వరించింది. 36 ఏళ్ల ఈ స్విట్జర్లాండ్ 'ఆల్ టైమ్ గ్రేటెస్ట్' 2016లో ఎదురైన గడ్డు పరిస్థితులు, వరుస వైఫల్యాలు, గాయాలను అధిగమించి... 2017లో రెండు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో పాటు ఏడు ట్రోఫీలను గెలిచాడు. దీంతో మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ (ఈ ఏడాది) సాధించాడు. ఈ వెటరన్ చాంపియన్‌కు ఈ ప్రతిష్టాత్మక అవార్డులు రావడం కొత్తేమీ కాదు. జోరుమీదున్న కెరీర్ తొలినాళ్లలోనే 2005 నుంచి 2008 వరకు వరుసగా నాలుగుసార్లు లారెస్ 'స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్' అవార్డును అందుకున్నాడు. తాజాగా అతని ఖాతాలో మరో రెండు చేరడంతో మొత్తం ఆరు పురస్కారాలతో అత్యధిక అవార్డులు గెలుచుకున్న ఆటగాడిగానూ చరిత్రకెక్కాడు. ఈ సందర్భంగా ఫెడరర్ మాట్లాడుతూ 'ప్రతిష్టాత్మక అవార్డును మళ్లీ అందుకోవడం ఆనందంగా ఉంది. పునరాగమంలో ఈ స్థాయికి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. గతేడాది నాకెంతో కలిసొచ్చింది. నా కలల్ని సాకారం చేసుకునేందుకు సహకరించింది. నా కెరీర్‌లో నేను ఎదుర్కొన్న క్లిష్టమైన ప్రత్యర్థి రాఫెల్ నాదలే. అతనో అద్భుతమైన ఆటగాడు' అని అన్నాడు. ప్రస్తుతానికైతే రిటైర్మెంట్‌పై ఆలోచించడం లేదన్నాడు. 'స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్' అవార్డు అమెరికన్ టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్ అందుకుంది. ఆమెకిది నాలుగో అవార్డు. గతంలో 2003, 2010, 2016లో మూడుసార్లు ఈ పురస్కారం అందుకుంది. గతేడాది ఆరంభంలో వారాల గర్భంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగిన అమెరికా నల్లకలువ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

'డోపీ' దవిందర్ సింగ్...

భారత జావెలిన్ త్రోయర్‌పై తాత్కాలిక నిషేధం



న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి జావెలిన్ త్రోయర్ దవిందర్ సింగ్ కంగ్ డోపింగ్ టెస్టులో పట్టుబడ్డాడు. గత నవంబర్‌లో అతని నుంచి అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) సేకరించిన రక్త, మూత్ర నమూనాలను పరిశీలించగా దవిందర్ నిషిద్ధ ఉత్ప్రేరకం తీసుకున్నట్లు తేలింది. దీంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) వెంటనే అతన్ని పాటియాలలో జరిగిన ఇండియన్ గ్రాండ్‌ప్రి-1 పోటీల నుంచి తప్పించింది. తక్షణమే శిక్షణ కేంద్రం నుంచి నిష్క్రమించాలని ఆదేశించింది. ఇప్పటికైతే తాత్కాలిక నిషేధం విధించినప్పటికీ 'బి' శాంపిల్ లోనూ దోషిగా తేలితే అతనిపై నాలుగేళ్ల నిషేధం పడనుంది. 29 ఏళ్ల దవిందర్ గతేడాది లండన్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించి ఈ ఘనత వహించిన తొలి భారత అథ్లెట్‌గా గుర్తింపు పొందాడు. తాజాగా ఏఐయూ పరీక్షల్లో దొరికిన తొలి భారత డోపీగానూ నిలిచాడు. క్రీడారంగాన్ని కుదిపేసిన రష్యా వ్యవస్థీకృత డోపింగ్ ఉదంతంతో అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ఏఐయూను ఏర్పాటు చేసింది.



ఐపీఎల్‌లో డీఆర్ఎస్

న్యూఢిల్లీ: అంపైర్ నిర్ణయ సమీక్ష పద్ధతి (డీఆర్ఎస్)ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తోన్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఐపీఎల్‌లో దానికి ఆమోదం తెలిపింది. ఏప్రిల్‌లో ప్రారంభంకానున్న ఐపీఎల్-11తో ఈ లీగ్‌లో డీఆర్ఎస్‌ను ప్రవేశపెట్టనుంది. కచ్చితమైన నిర్ణయాల విషయంలో లోపాలున్న కారణంగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనే డీఆర్ఎస్‌ను వ్యతిరేకించిన బీసీసీఐ తమ సొంత లీగ్‌లో దీనికి పచ్చజెండా ఊపడం గమనార్హం. 'బీసీసీఐ గత కొంత కాలం నుంచి డీఆర్ఎస్‌ను పరిశీలిస్తోంది. ఐపీఎల్‌లో ప్రవేశ పెట్టాలని మాత్రం ఈ ఏడాదే నిర్ణయించింది. మిగతా అన్నింట్లో అత్యుత్తమ పద్ధతులను అవలంభిస్తున్నప్పుడు డీఆర్ఎస్ విషయంలో ఎందుకు అమలు చేయకూడదు?' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. అంపైర్‌గా మారిన ఆస్ట్రేలియా పేసర్ పాల్ రైఫిల్ ఆధ్వర్యంలో గతేడాది విశాఖపట్నంలో 10 మంది భారత దేశవాళీ అంపైర్లకు డీఆర్ఎస్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు.

కామన్వెల్త్ గేమ్స్‌కు హుసాముద్దీన్

భారత బాక్సింగ్ జట్టులో చోటు



న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే భారత బాక్సింగ్ జట్టులో తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (56 కేజీలు)కు చోటు లభించింది. ఇటీవలే బల్గేరియాలో జరిగిన స్ట్రాండ్‌జా స్మారక టోర్నీలో ఈ నిజామాబాద్ బాక్సర్ కాంస్య పతకం సాధించాడు. వాస్తవానికి 56 కేజీల విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత గౌరవ్ బిధురిని ఎంపిక చేయాల్సి ఉన్నా అతను గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో హుసాముద్దీన్ పేరును ఖరారు చేశారు. ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో వచ్చే నెలలో జరుగనున్న ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే భారత జట్టును భారత బాక్సింగ్ సమాఖ్య బుధవారం ప్రకటించింది. మహిళల జట్టులో మేరీకోమ్ (48 కేజీలు), లవ్లీనా (69 కేజీలు), సరితా దేవి (60 కేజీలు)లను ఎంపిక చేశారు.

పూల్ 'సి'లో భారత్

ప్రపంచకప్ హాకీ టోర్నీ షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్ ఆతిథ్యమివ్వనున్న ప్రపంచ కప్ హాకీ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య విడుదల చేసింది. మొత్తం 16 జట్లను నాలుగు పూల్స్‌గా విభజించారు. టీమిండియా పూల్ 'సి'లో బెల్జియం, కెనడా, దక్షిణాఫ్రికాలతో ఉంది. భువనేశ్వర్‌లో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకు ప్రపంచకప్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. టోర్నీ ప్రారంభోత్సవ మ్యాచ్‌లో ఆతిథ్య భారత్... దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. అనంతరం డిసెంబర్ 2న బెల్జియంతో, 8న కెనడాతో టీమిండియా పోటీపడుతుంది. నవంబరు 28 నుంచి డిసెంబర్ 9 వరకు లీగ్ పోటీలు, 12, 13 తేదీల్లో క్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయి. ప్రతీ పూల్‌లోని టాపర్ నేరుగా క్వార్టర్స్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడో స్థానంలో నిలిచిన జట్లు 10, 11 తేదీల్లో జరిగే క్రాస్ ఓవర్ మ్యాచ్‌ల్లో తలపడి గెలిస్తేనే క్వార్టర్స్ బెర్త్ దక్కుతుంది. 15న సెమీస్, 16న ఫైనల్ జరుగనుంది.

ఏ పూల్‌లో ఎవరంటే...

పూల్ 'ఎ': అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్; **పూల్ 'బి':** ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఐర్లాండ్, చైనా; **పూల్ 'సి':** భారత్, బెల్జియం, కెనడా, దక్షిణాఫ్రికా; **పూల్ 'డి':** నెదర్లాండ్స్, జర్మనీ, మలేసియా, పాకిస్తాన్.

అశ్విన్‌కు గాయం... 'దేవధర్'కు దూరం

న్యూఢిల్లీ: భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ గాయంతో దేవధర్ ట్రోఫీకి దూరమయ్యాడు. ఈ నెల 4 నుంచి 8 వరకు జరగనున్న ఈ వన్డే టోర్నీలో అతను భారత్ 'ఎ' జట్టు సారథిగా ఎంపికయ్యాడు. అయితే అతను దూరం కావడంతో షాబాజ్ నదీమ్‌ను జట్టులోకి తీసుకున్నారు. అంకిత్ బావ్నేకు 'ఎ' జట్టు పగ్గాలు అప్పగించారు.

అదే... అతడికి అడ్డంకి!

మయాంక్... మరికొంత కాలం వేచి చూడాలి ● స్థిరత్వంతోనే జాతీయ జట్టులోకి పిలుపు

ఈ దేశవాళీ సీజన్‌లో ఇప్పటికి 2141 పరుగులు... 30 ఇన్నింగ్స్‌లలో 8 శతకాలు... చివరి 9 ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా ఐదు అర్ధ సెంచరీలు... మూడు సెంచరీలు... ఇవి ఒక జట్టులోని ప్రధాన బ్యాట్స్‌మెన్ గణాంకాలు కాదు! కర్ణాటక ఓపెనర్ మయాంక్ అగర్వాల్ కళ్లు చెదిరే రికార్డులు! అయినా శ్రీలంకలో జరిగే టి20 ముక్కోణపు టోర్నీలో అతనికి టీమిండియాలో చోటు దక్కలేదు! ఇంతకంటే ఇంకేం చేయాలి? మరి భారత జట్టులోకి ఎంపికకు మయాంక్ ఎంతవరకు అర్హుడు? ఇందుకు అడ్డంకిగా నిలుస్తున్న అంశాలేంటి?



సాక్షి క్రీడా విభాగం

వాస్తవమే... మయాంక్ ప్రతిభావంతుడే. కర్ణాటకను ఈ సీజన్‌లో ఒంటిచేత్తో గెలిపించినవాడే. కరుణ్ నాయర్, లోకేశ్ రాహుల్ వంటివారున్న జట్టులో తన ఉనికిని బలంగా చాటుకున్నవాడే. అన్నిటికి మించి స్ట్రోక్ ప్లేలో డాషింగ్ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపించేవాడే. ఓ అవకాశం ఇచ్చి పరీక్షించదగినవాడే. అయినా... పిలుపెందుకు రాలేదు? దీనికి కారణాలు ఏమిటి? తనలో లోపం ఎక్కడుంది? సెలెక్షన్ కమిటీ ఆలోచన ఎలా ఉంది? అనే ప్రశ్నలు రావడం సహజం. వీటన్నిటికీ సమాధానం జాతీయ జట్టులోని పరిస్థితులు. దీంతోపాటు నిలకడ లేని అతడి గత ఆటతీరు.

ఈ ఒక్క ప్రదర్శననే చూడలేరుగా!

13 మ్యాచ్‌ల్లో 284 పరుగులు, సగటు 23.66... గతేడాది రంజీల్లో మయాంక్ ప్రదర్శనిది. మూడే అర్ధ సెంచరీలు చేశాడు. అంతకుముందు (2015-16) సీజన్‌లో 5 మ్యాచ్‌ల్లో 8 ఇన్నింగ్స్‌లలో 52.12 సగటుతో 417 పరుగులు సాధించాడు. ఈసారి మాత్రం ఒక ట్రిపుల్ సెంచరీ సహా నాలుగు శతకాలతో 1160 పరుగులు చేశాడు. అంటే మూడు సీజన్లలో అతడు భారీగా పరుగులు చేసింది ఈ ఏడాదే. దీనినిబట్టి అవకాశం ఇవ్వడానికి మరికొంత కాలం వేచి చూడాలని సెలెక్టర్లు భావించడంలో తప్పు లేదు. మరోవైపు నిలకడ లేమి మయాంక్ కెరీర్ ప్రారంభం నుంచి ఉంది. 2008-09లో కూచ్ బెహర్ ట్రోఫీలో 432 పరుగులు చేసి వెలుగులోకి వచ్చిన అతడు, ఇదే ఊపులో ఆస్ట్రేలియాతో జరిగిన అండర్-19 వన్డేలో 160 పరుగులు చేసి సత్తా చాటాడు. కానీ 2010 కుర్రాళ్ల ప్రపంచకప్‌లో నిరాశపరిచాడు. తదనంతరం భారత్ 'ఎ' జట్టులో అవకాశం వచ్చినా విఫలమయ్యాడు. అప్పటికింకా అతడు రంజీల్లో అరగేట్రం కూడా చేయలేదు. 2013-14 సీజన్‌లో రంజీల్లోకి అడుగుపెట్టినా పోటీ కారణంగా ఈ కుడిచేతి వాటం ఓపెనర్‌కు జట్టులో చోటు కష్టంగానే ఉండేది. కేఎల్ రాహుల్ జాతీయ జట్టుకు వెళ్లాక మాత్రమే ఇతడికి స్థిరంగా అవకాశాలు వచ్చాయి.

'ఓపెనింగ్' ఖాళీ లేదు...

టెస్టుల్లో ధావన్, విజయ్, రాహుల్... వన్డేలు, టి20ల్లో రోహిత్, ధావన్ భారత జట్టుకు ఓపెనర్లుగా స్థిర పడిపోయారు. గాయపడితేనో, తప్పిస్తేనో తప్ప మరొకరికి చాన్స్ ఇవ్వలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో నిఖార్సైన ఓపెనర్ అయిన మయాంక్‌ను ఎంపిక చేసినా ఎక్కడ ఆడించాలో తెలియని పరిస్థితి. అప్పటికీ దక్షిణాఫ్రికాలో టెస్టుల్లో రాహుల్ వైఫల్యం, రంజీల్లో మయాంక్ అదరగొట్టడం చూసిన విశ్లేషకులు ఇతడిని తీసుకోవాలని వ్యాఖ్యానించారు. కానీ ఇదంత తేలిగ్గా తీసుకునే నిర్ణయం కాదు. ఎందుకంటే అగర్వాల్ ఇప్పటికి ఆడింది ఐదు రంజీ సీజన్లే. జట్టులో స్థిరంగా చోటు దక్కింది రెండు-మూడేళ్ల నుంచే.

ఈ ఏడాది రంజీలు, విజయ్ హజారేలో దుమ్మురేపిన మయాంక్... టి20 టోర్నీ అయిన ముస్తాక్ అలీలో పెద్దగా ఆకట్టుకోలేదు. 9 మ్యాచ్‌ల్లో 258 పరుగులే చేశాడు. వీటిలో మూడే అర్ధ సెంచరీలున్నాయి. పైగా శ్రీలంకలో జరగనున్న నిదాహస్ ముక్కోణపు ట్రోఫీ టి20 ఫార్మాట్. ఈ లెక్కన చూసినా సెలెక్టర్ల నిర్ణయాన్ని తప్పుపట్టలేం. కాబట్టి అగర్వాల్ జాతీయ జట్టులో స్థానం కోసం మరికొంత కాలం వేచి చూడాల్సి రావచ్చు.

మరింకేం చేయాలి...?

మయాంక్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలంటే ప్రస్తుత ఫామ్‌ను కొనసాగిస్తూ స్థిరంగా పరుగులు చేయాలి. గతంలో ఎదురైన ఫిట్‌నెస్ సమస్యలు మళ్లీ తలెత్తకుండా చూసుకోవాలి. ఇదే సమయంలో టెస్టు ఓపెనర్ విజయ్ 35 ఏళ్లకు దగ్గరవుతున్నాడు. అంటే బ్యాకప్‌ను వెతుక్కోవాల్సిన సమయం. ఆ స్థానాన్ని భర్తీ చేయడాన్ని 27 ఏళ్ల అగర్వాల్ సవాల్‌గా తీసుకోవాలి.

కొసమెరుపు: కర్ణాటకకు ఆడినప్పుడు ఓపెనింగ్‌లో పోటీగా మారిన కేఎల్ రాహులే... ఇప్పుడూ మయాంక్ కంటే ముందే జాతీయ జట్టులోకి వచ్చి అతడిని నిరీక్షణ జాబితాలో ఉంచాడు.



భారత జట్టులోకి ఎంపికయ్యేందుకు తాను ఎంత చేరువగా వచ్చానో ప్రతీ ఆటగాడికి తెలియాలనేది మా భావన. వారికి ఈ విషయంలో ఎలాంటి సందేహాలు ఉండవద్దు. కాబట్టి మా కమిటీ ప్రతి ఆటగాడితో విడిగా మాట్లాడుతుంది. దేశవాళీలో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న మయాంక్ అగర్వాల్‌తో నేను స్వయంగా మాట్లాడాను. తన ఆటతో అతను మా దృష్టిలో పడ్డాడని కూడా చెప్పాను. అయితే ఎంపిక విషయంలో మాకంటూ ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరిస్తున్నాం. ఆ విధంగా చూస్తే ప్రస్తుతం వరుసలో నిలబడిన మయాంక్ తనకంటే ముందున్నవాళ్లను దాటి వెళ్లే పరిస్థితి లేదు. నేను చెప్పిన విషయాన్ని అతను కూడా బాగా అర్థం చేసుకున్నాడు. పైగా మీ దృష్టిలో పడితే చాలు. నాకు తొందరేమీ లేదని అతనే చెప్పాడు. –ఎమ్మెస్కే ప్రసాద్, చీఫ్ సెలక్టర్

ఐపీఎల్ ఎంతో ఎదిగింది!



- ఇప్పుడు వినోదం మాత్రమే కాదు
- ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ను ఇకపై సరదా టోర్నీగా మాత్రమే చూడరాదని... ఇన్నేళ్లలో ఈ లీగ్ స్థాయి ఎంతో పెరిగిందని పేస్ బౌలర్ ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యానించాడు. ఒక అంతర్జాతీయ మ్యాచ్‌కు ఏమాత్రం తగ్గని రీతిలో బలమైన పోటీ, ఆటగాళ్ల ప్రదర్శనపై అన్ని వైపుల నుంచి దృష్టి ఉంటుందని అతను అభిప్రాయపడ్డాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఐపీఎల్ వేలంపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి కనిపించిందని పఠాన్ అన్నాడు. 'నేను 2008లో తొలి ఐపీఎల్ ఆడినప్పుడు దానిని దాదాపుగా అందరూ కేవలం వినోదంగా మాత్రమే చూశారు. గత కొన్నేళ్లుగా లీగ్ ప్రతీ సంవత్సరం మరింతగా ఎదిగిపోతోంది. ఇప్పుడు పది సీజన్లు ముగిశాక తిరుగులేని స్థితిలో, ప్రపంచంలోని అత్యుత్తమ టోర్నీలలో ఒకటిగా నిలిచింది. ఈసారి వేలంపై అందరి దృష్టి నిలవడమే ఇందుకు ఉదాహరణ. క్రికెటర్లు కూడా తీవ్ర ఒత్తిడి మధ్య ఎలా ఆడాలో నేర్చుకుంటున్నారు. ఆటగాళ్లకు వేలంలో విలువ కట్టడం వల్ల కూడా కచ్చితంగా బాగా ఆడాలనే కసి, పట్టుదల వారికి పెరుగుతాయి. ఇదంతా లీగ్‌ను పెద్ద స్థానంలో నిలబెడుతోంది' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు. ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లను ఎదుర్కొని పరుగులు సాధించడం వల్ల రంజీ ట్రోఫీ కంటే ఐపీఎల్ ప్రదర్శన ఎక్కువ మంది దృష్టిని ఆకర్షిస్తోందని అతను పేర్కొన్నాడు. మరోవైపు లీగ్‌ను ఆకర్షణీయంగా మార్చేందుకు పఠాన్ మరో సూచన చేశాడు. న్యూజిలాండ్‌లో ఉన్న తరహాలో మైదానంలో ప్రేక్షకులు క్యాచ్ పట్టే అవకాశం ఇచ్చి బహుమతులతో ప్రోత్సహించాలని అన్నాడు.

జమ్మూ కశ్మీర్ తరపున...

2018 ఐపీఎల్ వేలంలో ఇర్ఫాన్‌ను ఏ జట్టు కూడా తీసుకోలేదు. అయితే దీనికి తాను బాధ పడటం లేదని, ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఏమాత్రం రాణించకపోవడం వల్లే తనను పట్టించుకోలేదని విషయం తనకు తెలుసని అతను అన్నాడు. వచ్చే దేశవాళీ సీజన్‌లో ఇర్ఫాన్ పఠాన్ జమ్మూ కశ్మీర్ జట్టు తరపున బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఆ సంఘం ప్రతినిధులతో తాను చర్చలు జరిపినట్లు అతను వెల్లడించాడు. ఈ సీజన్‌లలో ఆడిన 2 రంజీ మ్యాచ్‌లలో కూడా విఫలం కావడంతో ఇర్ఫాన్‌ను బరోడా అర్ధాంతరంగా జట్టు నుంచి తప్పించింది. కీలక సమయంలో గాయాలతో కెరీర్ ఇబ్బందుల్లో పడిందని, గణాంకాలకంటే కూడా ఒక దశలో అమిత ప్రభావం చూపించిన ఆటగాడిగా భారత క్రికెట్ తనను గుర్తు పెట్టుకుంటుందని ఉద్వేగంగా చెప్పాడు. ఈసారి ఐపీఎల్‌లో 'స్టార్ టీవీ' వ్యాఖ్యాతల బృందంలో చేరే అవకాశం ఉన్న ఇర్ఫాన్... సన్‌రైజర్స్ తరపున తన సోదరుడు యూసుఫ్ పఠాన్ బాగా ఆడతాడనే విశ్వాసం వ్యక్తం చేశాడు.

స్టోక్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శన



రెండో వన్డేలో ఇంగ్లండ్ విజయం

మౌంట్ మాంగనీ: ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అదరగొట్టడంతో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ సునాయస విజయం సాధించింది. తొలి వన్డేలో ఓడిన ఇంగ్లండ్ బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొంది సిరీస్‌ను 1-1తో సమంచేసింది. స్టోక్స్ (63 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్)తో పాటు కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ (62; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), బెయిర్‌స్టో (37; 5 ఫోర్లు, 1 సిక్స్), బట్లర్ (36 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగడంతో 37.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసి గెలుపొందింది. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 49.4 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. గప్టిల్ (50; 7 ఫోర్లు), సాన్‌ట్నర్ (63; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లలో స్టోక్స్, వోక్స్, మొయిన్ అలీలకు రెండేసి వికెట్లు దక్కాయి. బౌలింగ్, బ్యాటింగ్‌లలో రాణించడంతో పాటు రెండు రనౌట్లలో పాలుపంచుకున్న స్టోక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే శనివారం వెల్లింగ్టన్‌లో జరుగనుంది.

భారత క్రికెటర్లకు త్వరలో జీతాల పెంపు

ముంబై: విరాట్ కోహ్లి సేనకు జీతాలు భారీగా పెంచేందుకు బీసీసీఐ పాలకుల కమిటీ (సీవోఏ) అంగీకరించింది. దీనిపై ఇప్పటికే హెడ్ కోచ్ రవి శాస్త్రి, కెప్టెన్ కోహ్లి, సీనియర్ ఆటగాడు ధోనిలతో చర్చలు జరిపామని... త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దీంతోపాటు మహిళా క్రికెటర్లు, దేశవాళీ, అండర్-19 ఆటగాళ్ల వేతనాలూ పెద్దఎత్తున పెరగనున్నాయి. ఇప్పటివరకు పురుషుల జాతీయ జట్టు ఆటగాళ్లను ఎ, బి, సి విభాగాలుగా విభజించి వరుసగా రూ.2 కోట్లు, రూ.కోటి, రూ.50 లక్షల వార్షిక కాంట్రాక్టు ఇస్తున్నారు. ఇకపై 'ఎ+' కేటగిరీని కొత్తగా సృష్టించనున్నారు. మూడు ఫార్మాట్లు ఆడేవారే ఇందులోకి వస్తారు. పెంపు భారీగానే ఉండనున్నా... ఎంత అనేది తెలియరాలేదు. ఊహాగానాల ప్రకారం 'ఎ' విభాగంలోని ఆటగాడికి ఏడాదికి ఏకంగా రూ.12 కోట్లు చెల్లించనున్నట్లు తెలుస్తోంది.

కుంటాల అందాలకు కుప్టి జలాలు

కడెం నదిపై కుప్టి వద్ద రిజర్వాయర్ నిర్మాణం

- 5.32 టీఎంసీల సామర్థ్యం.. రూ.744 కోట్ల ఖర్చు
- కడెం ప్రాజెక్టు ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం
- అవసరమైనపుడు కుంటాల జలపాతానికీ నీరు
- సీఎం ఆదేశాలతో శరవేగంగా కదులుతున్న ఫైలు



సాక్షి, హైదరాబాద్: గోదావరి ఉపనది అయిన కడెం నదీ జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా మరో రిజర్వాయర్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ, ఇచ్చోడ మండలాల మధ్య కుప్టి గ్రామం వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కడెం ప్రాజెక్టు కింది ఆయకట్టు స్థిరీకరణతో పాటు అవసరమైనపుడు కుంటాల జలపాతానికి నీరు విడుదల చేసేలా ప్రాజెక్టును రూపొందించారు. 5.32 టీఎంసీల సామర్థ్యంతో రూ.744 కోట్లతో రిజర్వాయర్ నిర్మించనున్నారు. ప్రాజెక్టు పనులు ముమ్మరం చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో కేబినెట్ నోట్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. బడ్జెట్ సమావేశాలకు ముందు జరిగే కేబినెట్ భేటీలో దీన్ని ఆమోదించే అవకాశం ఉంది.

7 టీఎంసీలే వినియోగం..

కడెం నదిపై ఆదిలాబాద్ జిల్లాలో కడెం ప్రాజెక్టు నిర్మించిన విషయం తెలిసిందే. దీనికి 13.42 టీఎంసీల నీటి కేటాయింపులుండగా 7.2 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 4 టీఎంసీలే వాడుకుంటుండగా మిగతా 3 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంది. ఆ 4 టీఎంసీలతో 68,150 ఎకరాలకు నీరివ్వాలనే లక్ష్యం ఉన్నా ఆశించిన మేర అందడం లేదు. అదీగాక వరద ఉన్న ఒక్క సీజన్‌లోనే పంటలకు నీరందుతోంది. నీటి నిల్వ పెంచేందుకు కడెం ప్రాజెక్టు ఎత్తు పెంచితే అటవీ భూములు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు ఎత్తు పెంపు పనులు పూర్తయ్యే వరకు నాలుగైదేళ్లు పంటలు వేసుకునే అవకాశం ఉండదు. మరోవైపు మొత్తం కేటాయింపుల్లో 6.22 టీఎంసీల నీటి వినియోగమే లేదు. ఈ నేపథ్యంలోనే కుప్టి రిజర్వాయర్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

బోథ్‌లో 30 వేల ఎకరాలకు..

ఆదిలాబాద్ జిల్లాలో నేరడిగొండ, ఇచ్చోడ మండలాల పరిధిలో సహజసిద్ధంగా ఉన్న 2 కొండల మధ్య నుంచి కడెం వాగు ప్రవహిస్తుంటుంది. ఈ కొండలను కలుపుతూ ఆనకట్ట నిర్మిస్తే 6.22 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురావొచ్చని ప్రభుత్వం తొలుత అంచనా వేసింది. దీనిపై సర్వే నిర్వహించగా 5.32 టీఎంసీలతో ప్రాజెక్టు నిర్మించవచ్చని తేలింది. అలాగే కుప్టిని కడెం ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకుంటూ బోథ్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాలకూ నీరిచ్చే అవకాశం ఉంటుంది. అవసరమైనపుడు కుంటాలకు కూడా నీరు విడుదల చేయొచ్చు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆదిలాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటి పరీక్షకు 20 వేల మంది గైర్హాజరు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సర ద్వితీయ భాష పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షలకు 4,82,360 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 4,61,516 మంది హాజరయ్యారు. 20,844 మంది గైర్హాజరైనట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది. వికారాబాద్, కరీంనగర్, సూర్యాపేట్‌లో మూడు మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైనట్లు తెలిపింది.

రేపటి నుంచి ద్వితీయ సంవత్సర పరీక్షలు

మార్చి 2 నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు తెలిపింది. ద్వితీయ సంవత్సర పరీక్షల్లో భాగంగా మొదటి రోజు ద్వితీయ భాష పరీక్ష ఉంటుందని పేర్కొంది.

అక్కడ ప్రత్యేక బందోబస్తు: కడియం

పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ఏరియాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక బందోబస్తు కల్పించాలని అధికారులకు సూచించారు.



అన్నీతానై పెంచిన తండ్రి రాత్రి కన్నుమూశాడు. ఉదయమే పరీక్ష.. కన్నీళ్లను దిగమింగుకుని బడి పరీక్షకు హాజరై.. బతుకు పరీక్షకు నిలిచిన ఈ అమ్మాయి లావణ్య. ఘట్‌కేసర్‌లోని యంనంపేట్‌లో తండ్రి శ్రీనివాస్ అంత్యక్రియల సందర్భంగా ఇలా తలకొరివి పట్టింది

సినీ ధరల చెల్లింపు వివాదం పరిష్కరిస్తా..

ఫిలిం చాంబర్స్ ప్రతినిధులతో మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్: క్యూబ్/యూఎఫ్‌వో సంస్థల నిర్వాహకులకు, సినీ ఎగ్జిబిటర్లకు ధరల చెల్లింపు వివాదంపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలో ఎఫ్‌డీసీ చైర్మన్ రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఫిలిం చాంబర్, తెలుగు ఫిలిం చాంబర్, తెలంగాణ ఫిలిం చాంబర్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. ప్రస్తుతం థియేటర్లలో సినిమాలను ప్రదర్శిస్తున్న క్యూబ్/యూఎఫ్‌వో సంస్థలు ధరలు పెంచడాన్ని నిరసిస్తూ ఈనెల 2 నుంచి దక్షిణ భారతదేశంలో సినిమాల ప్రదర్శనను నిలిపివేయనున్నట్లు వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తెలుగు, హిందీ సినిమాల పట్ల ఒకలా, హాలీవుడ్ చిత్రాల పట్ల మరోలా క్యూబ్ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎగ్జిబిటర్ల స్థితిగతులు అంతంతమాత్రంగానే ఉన్నాయని.. ఈ పరిస్థితుల్లో ధరలు పెంచితే తీరని నష్టం వాటిల్లుతుందని చెప్పారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరల విషయంలో కచ్చితమైన ఆదేశాలు ఇచ్చేలా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలసిన వారిలో ఫిల్మ్ చాంబర్స్ అధ్యక్షుడు మురళీమోహన్, సౌత్ ఇండియా నిర్మాతల సంఘం కార్యదర్శి సి.కళ్యాణ్, తెలుగు ఫిలిం చాంబర్ అధ్యక్షులు జెమిని కిరణ్, దామోదర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మజ్లిస్ మెప్పు కోసమే ప్రధానిపై విమర్శలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: మజ్లిస్ మెప్పు పొందేందుకే ప్రధాని మోదీపై కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఎన్నికలు దగ్గర పడటం, టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతున్న నేపథ్యంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మెప్పు పొందేందుకు నానా పాట్లు పడుతున్న కేసీఆర్, బీజేపీపై, ప్రధానిపై విమర్శలకు దిగుతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైతాంగ సంక్షేమం కోసం ప్రధాని చేపడుతున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం కోసం కేంద్రం నుంచి రూ.కోట్ల నిధులు వస్తున్నా, వాటిని ఖర్చుచేయలేక, ఆ విషయం జనం గమనించి ఎక్కడ ఈసడించుకుంటారోననే కేసీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి నాలుగేళ్లు నిద్రమత్తులో జోగిన సీఎం, ఎన్నికలు వస్తుండటంతో రైతు సమితుల పేరుతో జిమ్మిక్కులు మొదలుపెట్టారని విమర్శించారు. మరోవైపు ప్రధానిని కించపరిచేలా మాట్లాడిన సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపట్టాయి.

అర చేతిలో పౌర సేవలు!

ఇక రాష్ట్రంలోనూ మొబైల్ గవర్నెన్స్

- ‘టీ-యాప్ ఫోలియో’ఆవిష్కరణలో మంత్రి కేటీఆర్
- దేశంలో కర్ణాటక తర్వాత రెండో రాష్ట్రంగా తెలంగాణ
- తొలుత 150 సేవలు.. ఏడాదిలో 1,000
- యాప్‌తో మీ–సేవ నిర్వాహకులకు నష్టం ఉండదని భరోసా



బుధవారం హైదరాబాద్‌లో ‘టీ-యాప్ ఫోలియో’ను రిమోట్ ద్వారా ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్య గౌడ్, సీవీ ఆనంద్

సాక్షి, హైదరాబాద్: ‘భారతీయులు సులువుగా, వేగంగా టెక్నాలజీని అందిపుచ్చుకుంటారు. సాంకేతికత పట్ల మక్కువ, అందిపుచ్చుకునే విషయంలో విజ్ఞత భారతీయుల్లో ఎక్కువ. ప్రపంచంలో మరే దేశంలో వినియోగించుకోని విధం గా వాట్సాప్, ఫేస్‌బుక్‌లను దేశంలో వినియోగిస్తున్నారు. పెద్దగా చదువుకోకపోయినా, సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలియకున్నా దాని వల్ల కలిగే ఫలితాలను ప్రజలకు స్పష్టంగా వివరిస్తే అద్భుతాలు సాధించవచ్చు. మొబైల్ ఫోన్‌తో వివిధ రకాల పౌర సేవలందించేందుకు ప్రవేశపెట్టిన టీ–యాప్ ఫోలియోను రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తారని నమ్మకముంది’ అని మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల సేవలను మొబైల్ ఫోన్ ద్వారా పౌరులకు అందించేందుకు తెలంగాణ స్టేట్ టెక్నాలజికల్ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) శాఖ రూపొందించిన ‘టీ–యాప్ ఫోలియో’ యాప్‌ను మంత్రి బుధవారం ఆవిష్కరించారు.

ఏడాదిలో 1,000 రకాల సేవలు

వివిధ శాఖల సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి యాప్ రూపంలో నిక్షిప్తం చేయడం ద్వారా మొబైల్ గవర్నెన్స్ (ఎం–గవర్నెన్స్) సేవల వైపు అడుగులు వేశామని కేటీఆర్ చెప్పారు. ‘మొబైల్ యాప్ ద్వారా అన్ని రకాల సేవలను అందించడంలో కర్ణాటక తర్వాత దేశంలో రెండో రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లలో యాప్‌ను రూపొందించాం. తెలుగు, ఆంగ్లంలో వినియోగించుకోవచ్చు. తొలుత 150 రకాల సేవలను అందుబాటులోకి తెచ్చాం. జనన ధ్రువీకరణ పత్రం, కరెంట్, వాటర్ బిల్లులు, ల్యాండ్ రికార్డులు, రేషన్ సరఫరా, అత్యవసర సహాయం తదితరాలను దీని ద్వారా పొందవచ్చు. ఏడాదిలో 1,000 రకాల సేవలను తీసుకొస్తాం’ అని వివరించారు.

ప్రజల చేతి వేళ్లపై పాలన..

సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని పుంతలు తొక్కినా సాధారణ ప్రజలకు ప్రయోజనం లేకపోతే నిరర్థకమని సీఎం కేసీఆర్ అంటుంటారని కేటీఆర్ గుర్తు చేశారు. మొబైళ్ల ద్వారా సమాచార శూన్యం నుంచి సమాచార విప్లవం వచ్చిందని.. దేశ జనాభాకు సమాన సంఖ్యలో ఫోన్లు ఉన్నాయన్నారు. చేతి వేళ్లపై పరిపాలన ఉండాలనే ఉద్దేశంతో యాప్‌ను తీసుకొచ్చామన్నారు. ‘హైదరాబాద్‌లో పౌర సేవల కోసం తెచ్చిన ‘మై జీహెచ్‌ఎంసీ’ యాప్‌ను ఇప్పటివరకు 3 లక్షల మంది, ‘మై ఆర్టీఏ’ యాప్‌ను 30 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. బ్లాక్ చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితరాల గురించి నిత్యం పత్రికల్లో వస్తోంది, ప్రజలకు సేవ లందించేందుకు ఈ సాంకేతిక తను ఉపయోగించుకుంటాం’ అని పేర్కొన్నారు.

‘మీ-సేవ’ నిర్వాహకులకు ఆందోళన వద్దు


రాష్ట్రంలో 4,500కి పైగా మీ–సేవ కేంద్రాలున్నాయని, వాటి ద్వారా ఉపాధి పొందుతున్న వారి ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు. టీ–యాప్ ఫోలియోను ప్రవేశపెట్టిన నేపథ్యంలో మీ–సేవ కేంద్రాలకు నష్టం కలగకుండా చూసుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మీ–సేవ కేంద్రాల ద్వారా కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రజల సౌలభ్యత కోసమే టీ–యాప్ ఫోలియోను తీసుకొచ్చామని, మీ–సేవ కేంద్రాల నిర్వాహకుల పొట్టగొట్టడం తమ ఉద్దేశం కాదన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, టీఎస్‌టీఎస్ ఎండీ జీటీ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్లుగా మినీ రైస్ మిల్లులు

సాక్షి, హైదరాబాద్: ప్రాసెసింగ్ యూనిట్లుగా మినీ రైస్ మిల్లులు, దాల్ మిల్లులను ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇప్పటికే వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ కేంద్రమైన బాన్సువాడలో పైలట్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. దాదాపు రూ.లక్షతో మినీ రైస్ మిల్లు ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీటిని డ్వాక్రా మహిళలకు అప్పగిస్తే వారికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు అవుతుందనేది సర్కారు ఉద్దేశం. నియోజకవర్గానికి ఒక వ్యవసాయ సంబంధిత ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన సంగతి తెలిసిందే. కల్తీ, నకిలీ ఆహార పదార్థాల నివారణకు రాష్ట్ర ఉద్యానాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసింది. దాని ద్వారా వినియోగదారులకు స్వచ్ఛమైన కారం, అల్లం, వెల్లుల్లి వంటి 8 రకాల పదార్థాలను అందించాలని నిర్ణయించింది. వాటితోపాటు ఆ సంస్థ మినీ రైస్, దాల్ మిల్లులను ఏర్పాటు చేస్తుంది.

గుడికి జీఎస్టీ గుబులు

- ఆర్జిత సేవలు, ప్రసాదాలపై 18 శాతం పన్ను
- కట్టలేమని మొత్తుకుంటున్న ఆలయాలు
- ధరల పెంపుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- లడ్డూ, పులిహోర ధరలకు రెక్కలు
- త్వరలో ఆర్జిత సేవలూ ప్రియం
- దేవుడి సాక్షిగా భక్తుల జేబుకు కన్నం



సాక్షి, హైదరాబాద్: ఫలం, పుష్పం, పత్రం, తోయం.. ఖరీదైన కానుకలు సమర్పించుకున్నా ఓ పండు, అది లేకుంటే ఓ పువ్వు, అదీ దొరక్కుంటే ఓ ఆకు సమర్పించినా దేవుడు ప్రసన్నమవుతాడని పురాణాల మాట. కానీ ఇప్పుడు ‘జేబు’ను సమర్పించుకుంటే గానీ స్వామి సేవ చేసుకోలేని దుస్థితి దాపురించింది. జనం జేబును గుల్ల చేస్తూ వచ్చిపడ్డ వస్తు సేవల పన్ను (జీఎస్టీ).. దేవుడి గుడినీ ఆగమాగం చేస్తోంది. అన్నింటికీ అతీతుడైన భగవంతుడినీ వదిలేదిలేదని జీఎస్టీతో కేంద్రం తేల్చి చెప్పింది. ఆ పాపం తనకెందుకని దేవుడు కళ్లు మూసుకోగా పన్ను భారం కాస్తా నేరుగా భక్తుడి జేబును తాకుతోంది. ఇక స్వామి సన్నిధికి వెళ్లాలంటే ఒకటికి రెండుసార్లు జేబు తడిమి చూసుకోవాల్సిందే.

కైంకర్యాలూ ‘సేవ’లే..!

సేవ ఏదైనా పన్నుపోటు తప్పదన్నది జీఎస్టీ వ్యాఖ్యానం. దేవాలయాల్లో స్వామికి చేసుకునే కైంకర్యాలూ ‘సేవ’లే కాబట్టి అవి కూడా పన్ను పరిధిలోకి రావాల్సిందేనని అధికారులు తేల్చేశారు. దీంతో అష్టోత్తరం చేయించినా, హారతి సమర్పించినా ఆర్జిత సేవల రూపంలో జీఎస్టీ కన్ను పడుతోంది. కల్యాణోత్సవాలు, వ్రతాలు, సువర్ణ పుష్పార్చనలు.. ఒకటేమిటి దేవాలయాల్లోని ఆర్జిత సేవలన్నింటిపై 18 శాతం మేర పన్ను చెల్లించాల్సి వస్తోంది. ప్రసాద సరుకులు కొన్నప్పుడు మళ్లీ 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది. అంటే ఆ మేర ధరలు పెరిగిపోయాయి. ఇక రూ.1,000, అంతకంటే ఎక్కువ రుసుము ఉన్న కాటేజీలపైనా 12 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. దీంతో ఈ మొత్తాన్ని ఆ దేవాలయం ఆదాయంలోంచి చెల్లించాల్సి వస్తోంది.

మేం కట్టలేం బాబోయ్..

ఆలయ ఆదాయంలో 12 శాతం దేవాదాయ శాఖకు, 3 శాతం అర్చక సంక్షేమ నిధికి, మరో 3 శాతం సర్వ శ్రేయోనిధికి చెల్లించడమే భారంగా భావిస్తున్న దేవాలయాలు.. 18 శాతం జీఎస్టీ చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నాయి. ఈ భారాన్ని భక్తులపైనే వేస్తామని ప్రభుత్వానికి నివేదించి, అనుమతి పొంది ధరలు పెంచేస్తున్నాయి. జీఎస్టీ భారంతో ఇప్పటికే యాదాద్రి, భద్రాచలంలో ప్రసాదాల ధరలు రూ.5 చొప్పున పెంచారు. మిగతా దేవాలయాల్లోనూ పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఆర్జిత సేవల ధరలూ పెంచాలని దేవాదాయ శాఖను దేవాలయాలు కోరాయి. యాదాద్రి అధికారులు ఇప్పటికే ప్రతిపాదన పంపారు. అక్కడ అనుమతి రాగానే మిగిలిన ఆలయాల నుంచీ ప్రతిపాదనలు రానున్నాయి.

జీఎస్టీ వల్లే భారం

‘జీఎస్టీ పరిధిలోకి దేవాలయాలను తీసుకురావడమే దారుణం. అనాలోచితంగా ఆర్జిత సేవలు, కాటేజీలు, ప్రసాద సామగ్రిపై జీఎస్టీ విధిస్తున్నారు. దీంతో ఆలయాల ఖర్చు పెరిగి నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీంతో ఆర్జిత సేవలు, ప్రసాదాల ధరలు పెంచుకునేందుకు ఒత్తిడి వస్తోంది. జీఎస్టీ నుంచి ఆలయాలను మినహాయించాలి. ఈ విషయమై ఇప్పటికే చాలాసార్లు కేంద్రానికి విన్నవించాం, మళ్లీ ఒత్తిడి తెస్తాం’

– ఇంద్రకరణ్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి

ఆర్జిత సేవలు.. ‘సర్వీస్’ ఎలా?

‘ఆర్జిత సేవలు పన్ను పరిధిలోకి వచ్చే సర్వీస్ ఎలా అవుతుందో అర్థం కావటం లేదు. జీఎస్టీతో సగటున ఆలయంపై ప్రతినెలా రూ.60 లక్షలకుపైగా అదనపు భారం పడింది. ప్రసాదాల సరుకులపైనా జీఎస్టీ అంతే అవుతోంది. ఇంత భారాన్ని మోయటం దేవాలయానికి సాధ్యం కావటం లేదు. మూడేళ్ల వరకు ప్రసాద ధరలు పెంచే అవకాశం లేనందున వస్తువుల ధరలు పెరిగినప్పుడల్లా ఆలయ హుండీకి కన్నంపడినట్లేగా’

– గీత, యాదాద్రి కార్యనిర్వహణాధికారి

తెలంగాణలో పొత్తులుంటాయి

- ఏ పార్టీతో అన్నది సమయం వచ్చినప్పుడు నిర్ణయిస్తా: చంద్రబాబు
- ఇతర పార్టీల్లో టీడీపీని విలీనం చేసే హక్కు ఎవరికీ లేదన్న ఏపీ సీఎం
- టీఆర్ఎస్‌తో పొత్తు వద్దన్న కార్యకర్తలు.. స్పందించని టీడీపీ అధినేత
- ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో కార్యకర్తలు, నేతలతో సమావేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అవసరమైతే తమ పార్టీ ఇతర రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంటుందని.. అయితే ఆ పొత్తు ఏ పార్టీతో అన్నది సమయం వచ్చినప్పుడు నిర్ణయిస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ సీఎం ఎన్.చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సుదీర్ఘ విరామం అనంతరం బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో జరిగిన తెలంగాణ తెలుగుదేశం పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఎల్లకాలం ఉంటుందని, కొందరు నేతలు పార్టీని వీడినా నష్టం లేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తెలంగాణ పార్టీ నేతలు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన ఓ నేత మాట్లాడుతూ.. తెలంగాణ టీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదనను మానుకోవాలని, లేదంటే తాము ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. దానిపై స్పందించిన చంద్రబాబు.. ఇతర పార్టీలో టీడీపీ విలీనమన్న ప్రసక్తే ఉండదని, అలా చేసే హక్కు ఎవరికీ లేదని పేర్కొన్నారు. అదే సమయంలో టీఆర్ఎస్‌తో పొత్తు కూడా వద్దని కొందరు కార్యకర్తలు నినాదాలు చేయగా.. చంద్రబాబు ఈ విషయంలో స్పందించలేదని తెలుస్తోంది. ఇక సమావేశంలో మరికొందరు నేతలు, కార్యకర్తలు.. తెలంగాణలో టీడీపీ బాధ్యతలను జూనియర్ ఎన్టీఆర్‌కు, లేదంటే లోకేశ్‌కు ఇవ్వాలని నినాదాలు చేశారు. దీనికి స్పందించిన సీఎం... జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్‌లు కాదని, తమ కాళ్ల మీద తాము నిలబడాలని సూచించారు. టీటీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, అరవింద్‌కుమార్‌గౌడ్, బొల్లం మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం ఉదయం తెలంగాణకు చెందిన టీడీపీ సీనియర్ నేతలతో చంద్రబాబు తన నివాసంలో మరోసారి భేటీ కానున్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792